# కాలం దాచిన కన్నీరు

నవల

-గొల్లపూడి మారుతిరావు



శ్రీ

కౌముది

మీ ముంగిట్లో సాహితీ వెన్నెల

www.koumudi.net

కౌముది ప్రచురణలు - 109




## ఒక మాట

ఎప్పుడో ఏభై సంవత్సరాల కిందట రాసిన రచనల్ని పైకి తీసి తమ పత్రికలో ప్రచురించి, నాకు కొత్త అభిమానుల్ని సంతరించి పెట్టిన ఘనత కౌముది సంపాదకులు కిరణ్‌ప్రభ, కిరణ్ దంపతులది. కాలం గడిచినా నా రచనలు, ఆలోచనలు పాతబడలేదని, పాడుబడలేదని నాకు ధైర్యాన్నిచ్చిన సందర్భమిది. వారికి నా ధన్యవాదాలు.

నా రచనలతో తప్ప - నా ప్రతిభగురించి మాట్లాడే అలవాటు నాకు లేదు. అవసరమూలేదు. మొదటిసారి అమెరికా విమానాశ్రయంలో దిగినప్పుడు ఆస్కార్ వైల్డ్‌ని "మీరు తెస్తున్న సరుకుల్ని ప్రకటించండి" అని కష్టమ్స్‌వారు అడిగారట. ఇంగ్లీషులో చెపితే బాగుంటుంది - **"Declare your assets"** అనడిగారు

ఆయన సమాధానం: **I have nothing to declare except my genius.**

ఈ నవలని దాదాపు ఏభై ఏళ్ళ కిందట - నా పాతిక సంవత్సరాల వయస్సులో రాశాను. అప్పటికి నేను జేమ్స్ జాయిస్ చదివి ఉన్నాను. ఆ ఛాయలు ఇందులో కనబడతాయి. కానీ తర్వాత రాసిన 'అంపశయ్య 'కు ఆ తరహా రచనలకు ప్రథమ ప్రయత్నంగా పేరొచ్చింది. నాకు నవీన్ గారు మంచి మిత్రులు. ఇప్పుడు నేనేమీ **claim** చెయ్యబోవడంలేదు.

"మీ నవల సీరియల్‌గా మొదలెడుతున్నాం. ముందుమాట రాయండి" అని కిరణ్‌ప్రభగారు అడగకపోతే ఇదీ రాసేవాడిని కాదు. మంచి రచన ఎన్నటికీ కాలదోషం పట్టదు. రచనలో జీవలక్షణం లేకపోతే ఎన్ని హంగులున్నా కాలం మిగల్చదు.

ఒక్కసారి ఈ నవల పేజీలు తిప్పుతూంటే, ఆనాటి ఉత్సాహం గుర్తుకొచ్చి ఆనందం కలుగుతోంది. వయస్సు ఆలోచనల్ని బేరీజు వేసి వడబోస్తుంది. కుర్రతనం తనకు తెలిసిందంతా బోరవిరుచుకు ఒలకబోస్తుంది. కాలం ఈ రెండు ధోరణలకూ సమదర్శి.

ఈ పాతరచనకు మీ కొత్తతరం స్పందనే కొలబద్ద. చదివి స్పందించండి. మీవి అభినందనలయితే దాచుకుంటాను. సూచనలయితే నేర్చుకుంటాను.

- గొల్లపూడి మారుతిరావు.

దురదృష్టంలో కృంగిపోయే జీవితాల్లో హఠాత్తుగా అదృష్టాన్ని కల్పించడం ఎంత కష్టమో, అదృష్టంతో పొంగిపోయే జీవితాల్ని దురదృష్టం వేపు మళ్ళించడమూ అంతే కష్టం. మంచికి కానీ, చెడుకి కాని - వ్యక్తిగాని, కుటుంబంకానీ, వ్యవస్థగానీ ఒక పద్ధతిలో గమనిస్తూంటుంది. ఆ గమనం సృష్టి అంత విచిత్రమూ, స్రష్ట అంత అనంతమూను. ఆంధ్రదేశంలో అతి సామాన్య మధ్య తరగతి కుటుంబంలోని 'అయిదు' మనస్సుల 'నాలుగు' రోజుల ఇతివృత్తం ఈ నవల. ఆశ, ప్రేమ కోరిక అభిమానం అనురాగం, సుఖం దుఃఖం అనే ఉత్తేపక్షలతో ఉక్కిరిబిక్కిరయిన అయిదు మనస్సులవి. ఆ మనస్సుల పేర్లు - హనుమంతయ్య, వరలక్ష్మి, గాయత్రి, వెంకటరావు, సుందరి - వాటి కథ ఈ 'కాలం దాచిన కన్నీరు'.

50 సంవత్సరాల క్రిందటి రచన.

## (ప్రారంభం)

**ఒకనాడు అదృష్టదేవతా, దురదృష్టదేవతా** కలిసి ప్రపంచం మంచి చెడ్డలను గురించి వితర్కించుకున్నాయి. అదృష్టమంటే రెండు దురదృష్టాలమధ్య మిగిలిన చిన్నవ్యవధి, అంతకంటే ఇంకేమీ కాదు - అంటుంది దురదృష్టదేవత. కానీ అదృష్టదేవత అందుకు వప్పుకోలేదు. "అదృష్టం భగవంతుడు ఇచ్చే అమూల్యమయిన వరం. దానిని పొందే యోగ్యతను సంపాదించుకోలేనివాళ్ళు దురదృష్టవంతులు" అంది. ఈ మాటల్తో ఆ ఇద్దరు దేవతల మధ్య వాదోపవాదాలు పెరిగిపోయాయి. ఇటువంటి సంశయాల్ని తీర్చడానికి ఏ తెలుగు రచయిత దగ్గరికో, ఏ రాజకీయ నాయకుడి దగ్గరకో వెళ్తే తీరిపోనా? కానీ ఆ దేవతలు అలా చెయ్యలేదు. సరాసరి భగవంతుడి దగ్గరకు వెళ్ళారు.

"హే భగవాన్! అదృష్టాన్నీ దురదృష్టాన్నీ మానవాళికి పంచిపెట్టే గొప్పగుణాన్ని మాకు ప్రసాదించావుగాని, మా ఇద్దరి మధ్యా స్నేహాన్ని ఎందుకు ఏర్పరచలేదు ప్రభో!" అన్నారు ఇద్దరూ దేవతలూ.

భగవంతుడు నవ్వాడు. మానవుడి తెలివితక్కువను, దేవతల 'అతితెలివి'ని చూసినప్పుడు భగవంతుడు అలాగ నవ్వుతూంటాడు.

"ఏమిటి మీ సంశయం?"

"మా గొప్పతనాలు వేర్వేరుగా తెలియడంలేదు. స్పష్టంగా తేల్చుకోదలిదాం."

"అంటే ఏం చేస్తారు?"

"పూర్తిగా దురదృష్టం, దుఃఖం, బాధ, దారిద్ర్యం ఆవరించిన కుటుంబాన్ని అదృష్టంలో ముంచి ఎత్తుతాను నేను" అన్నది అదృష్టదేవత.

భగవంతుడు నవ్వాడు.

దురదృష్టదేవతా నవ్వింది.

అదృష్టదేవత తెల్లబోయింది.

"పూర్తి అదృష్టం ఎవరినీ ఆవరించదు. అలా ఆవరించకుండా చూడడమే నా పని" అంది దురదృష్టదేవత.

భగవంతుడు సర్వజ్ఞుడు. అదృష్టదేవత మనస్సులో ఇంకా సంశయం తీరలేదని గ్రహించి ఓ మంచి పాఠం చెప్పాలనుకున్నాడు.

అనుకుని ఇలా అన్నాడు:

"మీరిద్దరూ దురదృష్టం, దారిద్ర్యం, దీనస్థితి, అసహాయతా పెనవేసుకున్న ఒక కుటుంబాన్ని వెదకండి. ఆ కుటుంబం ఎట్లా ఆ స్థితిని అనుభవిస్తోందో తెలుసుకోవడానికి వీలుగా ఆ కుటుంబంలో ప్రతివ్యక్తీ ఏ విధంగా ఆలోచిస్తూ ఏ విధంగా పరిస్థితులను ఎదుర్కొంటున్నాడో మూడు రోజులు కనిపెట్టండి."

అదృష్టదేవతా, దురదృష్టదేవతా ఒకరి మొహం ఒకరు చూసుకున్నారు. అంతలో తలవంచి "సరే సరే.." అన్నారు.

మళ్ళీ భగవంతుడు చిరునవ్వు నవ్వాడు.

ఆ నవ్వులో వెయ్యి యుగాల జగత్ సృష్టి వైచిత్ర్యం తళుక్కున మెరిసింది !

ఈ విధంగా భగవంతుడి ఆదేశాన్ని పొంది అదృష్టదేవతా, దురదృష్టదేవతా భూలోకంలోకి వచ్చారు. భగవంతుడు చెప్పిన అన్ని హంగులతో ఉన్న కుటుంబం కోసం వెదుకుతూ జంబూ ద్వీపం, భరతఖండానికి వచ్చారు. భరత ఖండంలోని ఆంధ్రదేశానికి వచ్చారు

వచ్చి.. వచ్చి ఆహా! అప్పటికి వాళ్ళకా కుటుంబం కనిపించింది. భగవంతుడు చెప్పిన అన్ని హంగులూ ఉన్నాయి - దురదృష్టం, దారిద్ర్యం, అసహాయత, దీనస్థితి - అన్నీ.

ఆ కుటుంబంలో అయిదుగురు వ్యక్తులు. హనుమంతయ్య ఇంటి యజమాని. భార్య వరలక్ష్మి. పిల్లలు వెంకటరావు, గాయత్రి. సుందరి.

మూడురోజులు అదృష్టదేవత. దురదృష్టదేవతా ఓపికగా కూచుని ఆ కుటుంబంలో మూడు రోజుల చరిత్రను, ఆయా వ్యక్తుల దృక్పథాన్ని పరిశీలించారు.

***మొదటి రోజు***

***వరలక్ష్మి***

వంగపువ్వు రంగు కోడంబాకం చీరను తీరుగా కుచ్చెళ్ళు పోసి కట్టుకుని, నీళ్ళబిందెను మోసుకొస్తూ గుమ్మం దగ్గర ఆగి నన్ను నేను చూసుకుంటే నాకే ఆశ్చర్యం వేసింది.

సగం తడిసీ తడియని కుచ్చెళ్ళు కిందకి లాగుతూ -

కెంపులా పెట్టుకున్న ఎర్రటి బొట్టు నీటికి తడిసి ఎర్రమందారంలాగ బిందెనీళ్ళలో ప్రతిఫలిస్తూ -

ఈ నలభైఏళ్ళ వయస్సులో మళ్ళీ వయస్సు గుర్తుకొచ్చింది.

ఇంకా ముచ్చట తీరక వసారాలో కూచున్న మా వారిని హడావుడిగా పిలిచి 'నేనెలా ఉన్నానండీ?' అని మురిసి పోతూ, మరొకసారి కొంగుతో బొట్టు సరిచేసుకుంటూ కాలు కదపకుండా నిలబడి అడిగాను,

ఆయన కెందుకు తెలుస్తాయి ఇలాంటి ముచ్చట్లు.

అరగంట ఆలోచించి, ఈ ప్రశ్నలో అంతరార్థం ఏదో ఉందని తికమకపడి, చివరకి "అచ్చు నా భార్యలాగ ఉన్నావు" అనేసరికి నా ఉత్సాహమంతా పోయింది. చిన్నబుచ్చుకుని ఆ బిందె కాస్తా ఇంట్లో పెట్టి, ముఖం తుడుచుకున్నాను.

అలనాడు - ఇరవై ఏళ్ళ క్రితం - మా అత్తగారు ఇలాగే నిలబడి, మా మామగారిని పిలిచి నేనెలా ఉన్నానని ఆమె అడిగితే, ఆయన దక్షిణ నాయకుడిలాగ ఆరురకాలుగా మురిసిపోయి, రెండుసార్లు చుట్ట అటూ ఇటూ తిప్పి 'అచ్చు అప్సరసలాగ ఉన్నావు' అనడం, ఆమె పొంగిపోయి అతని గుండెమీద ఉప్పెనలాగ వాలడం, ఆయన చుట్టూ చూసి అలవోకగా 'ముసిలి'ముద్దు పెట్టుకోవడం - అంతా ఈరోజు అంటే శ్రావణ శుక్రవారం నాడు గుర్తుకొచ్చాయి నాకు.

నేను కాపరానికి వచ్చేసరికి మా అత్తకూ, మామగారికీ వయస్సింకా తీరలేదు. మీసం తిప్పి 'కాసులూ' అని పెళ్ళాన్ని పిలిస్తే పల్లెటూరిలోని ఇరవై గడపా ఖంగుమనేది.

నేనింతా నిలబడి అడిగితే ఈయన 'నువ్వు అప్సరసలాగా ఉన్నావు' అన్నాక, నేను గుండెమీద పడి చెక్కిలి అందించవలసివస్తే, మడిబట్ట మైలపడుతుందని జంకినా, అయినా ఏమయితే అదే అయిందిలే అని ఆతృతపట్టలేక, ఇరవైఏళ్ళుగా దాచుకున్న ఈ అనుభవాన్ని అనుభవించడానికి ఆయన్ని పిలిస్తే -

'నా భార్యలాగ ఉన్నావు' అంటారేమిటీ?

అలాకాకపోతే మరెలా ఉంటాను?

మామగారికున్న సత్తాలేనట్టే, ఆయనకున్న రసికతా, హంగూకూడా లేవు.

అందుకే ఐశ్వర్యమంతా ఆ మహరాజుతోనే పోయింది.

పోయింది, పోయింది, పోయింది.

ఆశలన్నీ పోయాయి, డబ్బుపోయింది, వయస్సూ పోయింది.

ఉన్నప్పుడు డబ్బు ఉపయోగం తెలీనట్టే, ఉన్నప్పుడు వయస్సు ఉపయోగం తెలీలేదు ఆయనకి.

డబ్బును తన తెలివితక్కువతనానికి, వయస్సును తన నిర్లక్ష్యానికి ఖర్చుపెట్టేశారు.

దేశాన్ని బాగుచేస్తామని వయస్సులో ఉద్రేకాలూ, పరుగులూ!

బాగుచేయకపోతే ఈ వెధవదేశానికేమొచ్చింది?

పెళ్ళాన్ని బాగుచేసుకోలేకపోయావ్ దేశం ఎందుకు?

దేశం బాగుపడింది, జీవితం పాడుపడింది.

దేశానికి స్వాతంత్ర్యం, తన ఆశయాలకు జైలు.

సంవత్సరానికి ఆరునెలలు జైల్లో బ్రతుకు.

మిగతా ఆరునెలలూ జైలు గురించి ఆలోచిస్తూ బ్రతుకు.

'దేశమును ప్రేమించుమన్నా' అని ఈ మగపురుగులంతా అరిచారే కానీ, ఆ నెహ్రూనో, మరెవరో వాళ్ళని ఆపి 'మీ మీ పెళ్ళాల్ని ప్రేమిస్తున్నార్రా' అని అడిగితే బాగుండిపోయేది.

అప్పట్లో వాళ్ళనడిగే నాథుడు లేడు.

ఇప్పుడు వీళ్ళగురించి పట్టించుకునేనాథుడు లేడు.

అయ్యో! అయ్యో! నా వయస్సెలా ఖర్చయిపోయింది.

చెరువు నీళ్ళలో ముఖం ఎప్పుడు కనిపించినా కాలం 'కసి' తీర్చుకున్న విషయం గుర్తుకొస్తుంది -

ఆయన నడుం స్వరాజ్యం వచ్చాక జాతివాళ్ళు పోయాక, మన జాతివాళ్ళ చిన్న చూపులతో వంగిపోయింది.

నా నడుం బాధ్యతలతో, బెంగల్తో, దారిద్ర్యంతో వంగిపోయింది.

తల్చుకుంటే ఏడుపొస్తోంది.

ఇలా ఎన్నిసార్లు ఏడిచాను కాను.

ఏడిచి, ఏడిచి - ఎవరూ అడిగేవారు లేక విసుగేసింది.

జైలునుంచి విడుదలయి పదిమందితో ఆయన ఇల్లు జొరబడితే వాళ్ళందరినీ సాకలేక ఏడ్చాను.

ఆయన ఆ ఉద్రేకంలో చావబాదారు.

వీళ్ళకి స్వాతంత్ర్యం వస్తే, ఆడవాళ్ళ నడుములు విరుగుతాయి కాబోలనిపించింది.

ఆయన మనస్సులో ఉద్రేకానికి, దేశభక్తికి చిహ్నంగా ఆ రోజు నన్ను కొట్టినప్పుడు నుదుటిమీద తగిలిన గాయం మిగిలిపోయింది.

ఆ రోజు చివరిసారిగా ఏడ్చాను.

తరువాత ఎప్పుడూ నవ్వుతూనే ఉన్నాను.

అది అసలైన నవ్వుకాదు. ఏడుపులాంటి నవ్వు.

ఏడవలేక నవ్వు; ఏడుపులోనే నవ్వు.

ఆ రోజు కన్నీళ్ళతో వాళ్ళకి దాహం తీర్చాను.

ఆ దేశభక్తుల త్యాగానికి సుఖాన్ని అంకితం చేశాను.

పెళ్ళాన్ని అర్థం చేసుకోలేనివాళ్ళు ఈ దేశప్రజలని ఎలా అర్థం చేసుకుంటారు?

ఇంటిని బాగుచేసుకోలేని వాళ్ళు దేశాన్ని ఎలా బాగుచేసుకుంటారు.?

దేశమంటే నా కసహ్యం.

నా కుటుంబాన్ని పాడుచేసిన దేశమది.

నా వయస్సును పాడుచేసిన దేశమది.

నా సుఖాల్ని పాడుచేసిన దేశమది.

నాకు దేశంలేదు. నాకు కుటుంబం ఉంది.

ఆయనకి కుటుంబం లేదు. దేశమే ఉంది.

ఇప్పుడీ వయస్సులో ఆయనకి కోపమూ, మూర్ఖత్వమే ఉన్నాయి.

దేశానికి స్వాతంత్ర్యం తెచ్చి దేశనాయకులు తలో ముక్కా పంచేసుకున్నారు.

కుటుంబాన్ని దారిద్ర్యం పంచుకుంది.

వయస్సులో ఎన్నిరకాల కోర్కెలుండేవి? చిన్నతనం నుంచీ పెంచుకున్న కోర్కెలు.

కొన్ని కోర్కెలకి తెల్లగుర్తు.

మిగతావి సాదా కోర్కెలు.

ఎర్రగుర్తు కోర్కెలూ - ఎప్పుడూ తీరేవికావు - పెద పెద్ద కోర్కెలు.

అంటే - కాంచీపురం పట్టుచీరె కట్టుకోవాలని, నెమలి పింఛెం రంగు జాకెట్టు తొడుక్కుంటే బాగుంటుందని - ఎప్పుడన్నా మద్రాసులో మా ఆయనతో షికారుగా తిరగాలని - ఒక మంచి 'ప్రేమ' సినిమా చూడాలని -

ఇవన్నీ పెద్ద పెద్ద కోర్కెలని నాకు తెలుసు.

ఎప్పుడూ తీరలేదవి. మద్రాసు చూడలేదు. సినిమా తెలీదు. కాంచీపురం చీర సరే.

రెండో రకం కోర్కెలు చాలా ఉన్నాయి. వెన్నెల రాత్రిలో ఆరుబయట ఆయన ఒళ్ళో పడుకోవాలని

ఆయన వింటూండగా ఒక 'మంగళహారతి' పాడాలని -

ఇల్లాంటివి.

ఎప్పుడయినా పాటపాడితే ఆయనకు కోపం వచ్చేది.

వెయ్యిమంది బండగొంతుకల్లతో అరిచే పాటలు చెప్పి పాడమనేవారు.

వాటిలో పుణ్యమా, పురుషార్థమా?

ఎప్పుడూ 'అండర్‌గ్రౌండ్' అనే మాట గుండెల్లో ప్రతిధ్వనించేది -

పదేళ్ళలో ఎనిమిదేళ్ళు 'అండర్‌గ్రౌండ్'

ఎప్పుడో ఇంటికి రావడం వెళ్ళడం.

పిల్లల కోడిలాగ ఈ పిల్లల్తో నేను.

ఆరు నెలలు పోయాక ఇంటికి వచ్చి మూడు నెలల క్రిందటే పుట్టిన కొడుకుని చూస్తారు.

పిల్లల్ని చూసే ఓపిక ఎలా ఉంటుంది?

వాళ్ళకీ దేశాల పేర్లు పెడుతున్నారు.

కానీ ఆ విషయంలో మాత్రం మామగారు పట్టుదల వదలలేదు.

సుబ్బరంగా లక్షణమైన పేర్లు పెట్టారు.

వెంక(టావు, గాయ(త్రి, సుందరి.

మధ్యలో నలుగురు పుట్టి చచ్చిపోయారు.

ఆయన తిరిగి వచ్చేసరికి పిల్లలు పుట్టి చచ్చిపోయేవారు.

కొందరు పిల్లల్ని ఆయన చూడేలేదు.

జైలుకు వెళ్ళివస్తే - 'మీకు కొడుకు పుట్టాడండీ' అంటే 'అలాగా!' అనేవారు.

'మొన్న చచ్చిపోయాడండి' అంటే -

ఒక్క క్షణం ఊరుకుని 'పోనీలే - దేశంకోసం అన్నీ వదులుకోవాల'నే వారు.

దేశంకోసం నలుగురు పిల్లల్ని వదులుకున్నారు.

దేశంకోసం ఆయన మీద ఆశను వదులుకున్నాను.

ఈ దేశంకోసం నా పిల్లల భవిష్యత్తుని వదులుకున్నాను.

డబ్బును వదులుకున్నాను.

ఇంకెన్ని వదులు కోవాలి?

కావాలని ఆయన త్యాగాలు చేస్తే -

అక్కర్లేక నేనూ త్యాగాలు చేశాను.

ఆయన తన అదృష్టాన్నీ, సుఖాన్నీ త్యాగం చేస్తే -

నేను నా పిల్లల్నీ, యౌవనాన్నీ ఇచ్చేశాను.

స్త్రీకి పిల్లలకంటే ధనం ఏముంది?

యౌవనంకంటే ఐశ్వర్యం ఏముంది?

ఆ రోజుల్లో కన్నకడుపు ఎంత ఘోష పెట్టిందో చెప్పలేను.

ఓ క్షణంలో విసుగొచ్చి, ఏడుపొచ్చేది -

మామగారు చచ్చిపోయాక మరీను.

ఒక్కోసారి విసుగేసి 'ఈయన పోతే బావుణ్ణు - ఈ బెంగలకు ఓ ముగింపు ఉండేది' అనుకునేంత హీనస్థితికి జారిపోయాను.

ఈయన నిర్లక్ష్యంలోంచి, నా దుఃఖంలోంచి (బతికి మొండిగా బయటపడ్డ పిల్లలు ముగ్గురు -

వెంకటరావు, గాయ(త్రి, సుందరి.

వయస్సు వచ్చి అన్నీ పోయాక ఇప్పుడు ఇంటిపట్టున ఉంటున్నారుకానీ ఎప్పుడన్నా వరసగా పిల్లల పేర్లు చెప్పమంటే చెప్పగలిగేవారా? మధ్యలో "వాడు చచ్చిపోయాడుకదూ?" అని ఎప్పుడో పోయిన కొడుకుని గుర్తుతెచ్చుకునేవారు.

నా కడుపు తరుక్కుపోయేది.

"భగవాన్ నాకెందుకు పుట్టించావు నాకు దక్కని పిల్లల్ని?" అని ఏడ్చేదాన్ని.

ఉన్న పదెకరాల పొలంలోకి పెద్దవాడిని తీసుకుని నేనే పోయేదాన్ని.

వరలక్ష్మమ్మ పొలం - అని అంతా తోడుపడేవారు.

సంవత్సరం తిరిగి, పంట ఇంటికి వస్తే డబ్బు ఆయన తిరుగుళ్ళకే సరిపోయేది.

వెంకట్రావు పట్నంలో చదువుకు మిగతా డబ్బంతా ఖర్చయ్యేది.

ఇంట్లో నేనూ ఇద్దరు ఆడపిల్లలూ.

ఒక్క భర్త అనుకూలంగా ఉంటే ఆడదానికి ఎన్ని బాధలున్నా పరవాలేదు.

భర్త అనుకూలత లేకపోయాక ప్రతిదీ ఇబ్బందే!

'ఇంతచేసి ఏం సాధించాను?' అనుకునేదాన్ని.

ఏ రెండు నెలలకో తిరిగివచ్చి ఇంటివిషయం అడిగేవారు కాదు.

'మా నాయకులిద్దరూ చచ్చిపోయారు. వాళ్ళ శవాలని ఇవ్వడానికి పోలీసులు ఒప్పుకోలేదు. దెబ్బలాడాం. ఇవిగో లాఠీ దెబ్బలుచూడు' అని రక్తం చిమ్మే వీపును నా వేపు తిప్పితే అంత దుఃఖంలోనూ ఆయన దీక్షకు ఒళ్ళు పులకరించేది.

కానీ ఎన్నాళ్ళని సహించను?

నా కన్నీళ్ళతో, నా సహనంతో ఆయన గాయాల్ని మాపేదాన్ని.

ఆయన శరీరం మీద గాయాలు మాని నా గుండెలో గాయాలు రక్తం చిమ్మేవి.

ఇన్నేళ్ళ తర్వాత ఆయన శారీరకంగా ముసలివాళ్ళయ్యారు.

నేను మనస్సులో వెయ్యేళ్ళు ముసలిదాన్నయ్యాను, ఆయన శారీరకంగా వీగిపోయారు.

నేను మానసికంగా వీగిపోయాను.

తన ప్రయత్నంవల్ల సాధించిన దేశం ఇలా చీలిపోతుందే అన్న బాధ ఆయనకి.

ఇప్పటికయినా ఈ ముసిలితనంలోనయినా ఇంట్లో ఉండగలిగారన్న సంతోషం నాకు.

నా నలభై ఏళ్ళ వయసులో సుఖంగా బ్రతికే రోజు లేమన్నా ఉంటే ఇవే.

శ్రావణ శుక్రవారంనాడు, మకరసంక్రాంతినాడు పండగనాడు చేసుకుందామనుకుంటే, ఆయన కాళ్ళుకడిగి నెత్తిన నీళ్ళు చల్లుకుందామనుకుంటే ఆయన దర్శనమే కరువయేది.

కనిపించని ఆ గాంధీమీద, హిందూదేశం మీద, 'కసి' పెరిగిపోయేది.

నాకు దేశం వద్దు - దేశం వద్దు అని ఏడిచేదాన్ని.

మనస్సు వెయ్యివిధాలా క్షోభించేది.

పోనీ. పోనీ, పోనీ.

ఆ బాధలు తీరిపోయయి. తీరిపోయాయి.

ఆయన మంచికే ముసలివాళ్ళయారు.

జీవితమంతా ఆయనకి ముసలితనమే ఉంటే బాగుండేది.

ఆయన ఈ విచారంలోనే, ఈ కృంగుబాటులోనే హాయిగా ఉన్నారు.

ఇన్నేళ్ళయిపోయాక ఇంటివేపు దృష్టి మళ్ళితే ఇంట్లో ఏం మిగిలి ఉంది.

ఎముకలగూడు అయిపోయిన భార్య -

ఏదో కొత్తవాడిలాగ, భయం భయంగా తనవేపు చూసే పిల్లలూ - తప్పిస్తే.

నయం పిల్లలు మాత్రం తండ్రిలాంటి అప్రయోజకులు కాలేదు.

వెంకట్రావుకి నేనంటే ప్రాణం.

చిన్నప్పటినుంచీ వాడు అమ్మనే చూశాడు. నాన్న తనని ఎత్తుకుని ముద్దుపెట్టుకోవడం ఎరుగడు వాడు.

వాడికి అమ్మే ఓనమాలు నేర్పింది.

అమ్మే పొలంలోకి తీసుకెళ్ళింది.

అమ్మే చదువు చెప్పించింది.

అమ్మే తనకు దెబ్బతగిలితే ఏడ్చింది -

దెబ్బతగిలితే అందరూ "అమ్మా!" అంటారు.

కానీ తన పిల్లలు వాళ్ళకు తెలిసిన ఒక్క 'అమ్మ' కోసమే అరుస్తారు.

గాయత్రీ, సుందరినీ కడుపులో పెట్టుకు పెంచాను.

వెంకట్రావుకీ, నాకు భేదం లేదు. నన్ను చూసి వీడిని చూడనక్కరలేదు.

వెంకుకి నాలో ఉన్న అమాయకత్వం, మంచితనం మరో మోతాదు ఎక్కువపడింది.

గాయత్రి అలాకాదు. తండ్రిపట్టుదలను, మొండి ధైర్యాన్ని పంచుకు పుట్టింది.

సుందరి పూర్తిగా నన్నే ఉద్రేకపరుచుతుంది. పద్దెనిమిదేళ్ళు ఉన్నా ఆ ఉద్రేకంలో ఆడపిల్లనని కూడా మరిచిపోతుంది.

కాలు రాయికి తగిలితే -

ఇరవై మూడేళ్ళ వయసున్నా 'అమ్మా' అని ఏడుస్తాడు వెంకు.

'అమ్మా' అని బాధపడి, కట్టు కట్టుకొంటుంది ఇరవయ్ ఏళ్ళ గాయత్రి.

ఏడవక, ఆ రాయిని కసితో పిండిచేస్తుంది సుందరి.

నా రెండు కళ్ళూ గాయత్రీ, సుందరీ.

నా గుండె వెంకు.

దేశ భక్తిని ఎదుర్కొని, దారిద్ర్యాన్ని దాటి, తండ్రి చేతకానితనాన్ని మించి బ్రతికి, పెరిగిన పిల్లలు వీళ్ళు.

నా ఆశ, కోరిక, జీవితం - అన్నీ వీళ్ళే.

## (2)

**హనుమంతయ్య**

బిందెపట్టుకుని గుమ్మానికి ఆనుకుని నిలబడితే నిజంగా అప్సరసలాగే ఉండేది వరలక్ష్మి.

కానీ ఇప్పుడు లేదు.

ఎందుకు లేదో తెలుసు నాకు.

వరలక్ష్మికీ తెలుసు.

అంతా తెలిసే చివరికిట్లా తయారయిందని దాని వాదన.

నేను ఈ కుటుంబాన్నంతా నాశనం చేసి ఇప్పుడు మూలన పడ్డానని అనుకుంటుంది.

నాన్న మమ్మల్నేమీ ఉద్ధరించలేదని - పిల్లలు అనుకుంటారు.

బ్రతికి చెడి, రాజకీయాలవల్ల చెదిరిపోయిన సంసారమని ప్రజలు అనుకుంటారు.

వరలక్ష్మి ప్రేమ పక్షపాతి.

పిల్ల 'సుఖం' మీద దృష్టి.

ప్రజలకి కష్టాలుపడే కుటుంబాల్ని చూస్తే ముచ్చట.

నాకనిపిస్తుందికదా? - ఒక మంచిపనిచేశావ్. ఎందుకు విచారించాలి? అని.

అయినా నేనేం చేశాను?

దేశం కోసం కష్టపడ్డాను.

ఈ ముప్పై ఆరు కోట్ల మందిలో నా కృషి 1/36 కోటివంతు.

'దేశం' అంటే అర్థం తెలీనివాళ్ళు ముప్పయి కోట్ల మంది ఉన్నారని నా ఉద్దేశం.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసీ' అని సుఖాల మీదా, ఆశలమీదా జీవితాల్ని పేర్చుకునే పదిహేను కోట్ల వరలక్ష్మిలకీ, పదిహేనుకోట్ల వెంకట్రావులకీ ఎంత చెపితే ఏం అర్థమవుతుంది?

గాంధీజీ కంటిమెరుపు చూసి కదం తొక్కే యువకుల రక్తపు వేడి వీళ్ళకెలా అర్థమవుతుంది.

నేను నలుగురు పిల్లల్ని వదులుకున్నాను. వాళ్ళు పెద్దయితే ఎందుకు పనికి వచ్చేవారో తెలీదు.

కానీ దేశానికంతా ఉపయోగపడే తన జీవితాన్నే వదులుకొన్నాడీ మహాత్ముడు?

వదులుకున్నాడయ్యా బాగుంది. కానీ ఈ దేశాన్ని మీరేం చేశారు? అని అడుగుతారు.

నిజమే - ఏం చేశారు?

గాంధీ కంటే మహామహులు కూడబెట్టిన సామ్రాజ్యాన్ని చాప చింపులాగ చీల్చేశారు.

మహాత్ముని ముందు విశ్వమానవ మతాన్ని నటించిన నాయకులు కొందరు మనస్సులో మానవ మారణాయుధాల్ని వెయ్యింటిని తయారుచేశారు.

దేశాన్ని చీల్చేశారు.

దేశం కోసం జీవితాల్ని నాశనం చేసుకున్నవారి గుండెలు చీలిపోయాయి.

దేశం సంపాదించిన వారి తరం అయిపోయింది.

దేశాన్ని సంపీడన జరిపేవారి తరం వచ్చింది.

మా తరం వారి చర్యలు చరిత్రలో ఏమూలనో మిగిలిపోయాయి.

చరిత్రకు సాక్ష్యాలుగా మేం మిగిలిపోయాం.

మా త్యాగాలకి సాక్ష్యాలు. ఈ కుటుంబాలూ, పిల్లలూ.

మేం కోరిన దేశం ఇదికాదు.

మేం ఊహించిన 'భరతమాత' ఈమె కాదు.

మా హృదయాల్లో మెదిలిన మతం - విశ్వమానవమతం.

కానీ ఈ దేశంలో ప్రతివ్యక్తికీ ఒక మతం ఉంది. అందుకే ఈ మార్పు గుండెను చీల్చేసింది.

దేశానికి మంచిరోజులకు తపనపడ్డ మా ముసలి హృదయాలు ఈ అవ్యవస్థకి గిజగిజలాడాయి.

స్వాతంత్ర్యం విలువ నేర్చుకోవాలంటే ఈతరం 50 ఏళ్ళు వెనక్కిపోయి చూడాలి.

కానీ వాళ్ళు చూడరు.

చూసినా మా సాక్ష్యాన్ని అంగీకరించరు.

మేం ముసలివాళ్ళం అయిపోయాము.

మాతో మా అనుభవాలు, స్వాతంత్ర చరిత్ర ముసిలిదయిపోయింది -

గాంధీమహాత్ముడు సంఘాన్ని బాగుచేశాడు కాని - వ్యక్తిని బాగుచేయడం ప్రారంభించేసరికి వేళమించిపోయింది.

అతనికి జీవితం కురుచ అయింది.

ఓ గొప్పశక్తిని కాలం బంధించింది.

భారతదేశం ఆ 'శాపం' ఇప్పటికీ అనుభవిస్తోంది.

మాలాంటి ముసలివాళ్ళు అరిస్తే ఏం లాభం?

'వందేమాతరం' అని బలంతో, రక్తం కళ్ళల్లోకి చిమ్మేలాగు అరిచిన ఈ గొంతులు 'ఇది కాదర్రా భారతదేశం ఉండవలసిన తీరు' అని అరవలేకపోతున్నాయి.

నేను మూలబడ్డాను.

నా ఉద్రేకాలు పల్చబడ్డాక బాధ్యతలు బరువెక్కాయి.

వయస్సులో సంఘర్షణ, వృద్ధాప్యంలో సంతోషాన్ని తినేసింది.

వరలక్ష్మి ఏడుస్తుందంటే ఏడవదూ? -

50వ ఏట జైలులో నడుం మీద లాఠీ చివరసారిగా విరిగాక, 1947 ఆగస్టు 14 అర్ధరాత్రి గొంతు వెలుగు రాసేలాగ అరిచి, ఆకాశం ఎత్తు పెరిగిన ఛాతీలను విడుచుకు ఇంటికి వచ్చిన ఉదయం మొట్టమొదటిసారిగా నా పిల్లల్ని లెక్కపెట్టుకున్నాను -

వరలక్ష్మి ఏడుస్తుందంటే ఏడవదూ? -

రాజకీయాలు తిండిపెట్టాయా? అంటుంది.

పెట్టవు, పెట్టవు.

రాజకీయాలు పిల్లల్ని బ్రతికించాయా? అంటుంది.

బ్రతికించవు, బ్రతికించవు.

రాజకీయాలు కూడూగుడ్డా ఇచ్చాయా? అంటుంది.

ఇవ్వవు. కూడూగుడ్డా తీసేశాయి.

మరి రాజకీయాలవల్ల ఏమొచ్చింది? ఈ ఏభయ్యో ఏట వరలక్ష్మి, పిల్లల జాలిచూపులు, ప్రపంచం, ముసలితనం సమిష్టిగా వేస్తున్న ప్రశ్న అది.

ఏమొచ్చింది? ఏమొచ్చింది?

లాఠీదెబ్బలూ, జైలులో ఉపవాసాలూ.

20 ఎకరాల మాగాణీ నష్టం.

20 ఏళ్ళ వయస్సు ఖర్చు.

మళ్ళీ ఆ ఇరవై ఏళ్ళు వెనక్కిపోయి బ్రతకగలిగితే ఎంత బావుణ్ణు.

చచ్చిపోయిన పిల్లలు బ్రతికివుంటే ఇల్లు ఎంత కళకళలాడేది.

అన్నట్టు ఎందరు చచ్చిపోయారో లెక్క తెలీదు. ప్రతిసారీ జైలునుంచి వచ్చినప్పుడు ఒకర్ని చూపేది. ఒక్కోసారి చూసేవాడినే కాదు.

పాపం! వరలక్ష్మి.

రాజకీయాలవల్ల ఏమొచ్చాయి? అని ఆమె అడిగితే -

గుండెధైర్యం - దేశాన్ని ప్రేమించే గొప్ప మనస్సు - అని తీవిగా చెప్పాలనిపిస్తుంది.

కానీ ఈ దారిద్ర్యం, నీ పిల్లలూ, ముఖం మీద వయస్సు పెట్టిన వాతలూ చూడు అని హెచ్చరిస్తుంటాయి ఆమె కళ్ళు.

ఈ ఇరవై ఏళ్ళూ బయటి జాతివాళ్ళు హింసించారు.

ఇంటిలో ఆమెకళ్ళు, తను తీర్చలేని బాధలూ కోతపెట్టాయి.

దేశంకోసం ఒక బాధ

దేహంకోసం ఒక బాధ.

దేశానికి బానిసత్వం తప్పలేదని ఒక బాధ.

కష్టాలకి బానిసత్వం తప్పలేదని మరొక బాధ.

అన్నీ బాధలే!

తీరేవయినా తెచ్చిపెట్టుకున్న బాధలు అప్పటివి - తెచ్చిపెట్టుకోకపోయినా వదలని బాధలు ఇప్పటివి -

బాధ! బాధ! బాధ!

దేశం బాగుపడాలేదు, చావాలేదు.

నాకు మాత్రం చచ్చినంత పనయింది.

పిల్లలు చచ్చారు.

తండ్రి చచ్చాడు.

ఆశలు చచ్చిపోయాయి.

చివరివరకు ఎదురు చూసి చూసి సుఖమూ ఉరిపోసుకు చచ్చిపోయింది.

ఈ ముగ్గురు పిల్లల్ని బాగుచేసుకోవాలని ఉంటుంది నాకు.

కాని - ఎలా? ఎలా?

చదువుకుని ఉద్రేకాలకి అమ్మేశానే.

మా తండ్రి మమ్మల్ని పాడుచేశాడని పిల్లలు ఏడవకూడదు.

కానీ - ఏందారి?

దారిద్ర్యం దారి వెదుక్కుంటూ వచ్చి నన్నే వరించిందే

పెళ్ళాన్ని ఇప్పుడయినా నవ్వుతూ పలకరించాలి - కానీ - ఏం చేయను?

ఆవేశంతో ముడి పడే కనుబొమలు నవ్వుతో విప్పారడం నేర్చుకోలేదే

భగవాన్! భగవాన్.

నా పిల్లల్ని ప్రేమించే మనస్సు ఇచ్చావు -

ప్రేమను నిలబెట్టుకునే శక్తిని ఇచ్చావు కావు.

మంచి పెళ్ళాని ఇచ్చావు.

మంచితనాన్ని చూసే తీరుబాటును నాకెందుకిచ్చావు కావు?

మంచి వయస్సునిచ్చావు -

దాన్ని ఉపయోగించే తెలివి నెందుకిచ్చావు కాదు? భగవాన్!

నా కూతురు ఉద్యోగం చేసి తెస్తే తినే బ్రతుకు ఇచ్చావా చివరికి.

వరలక్ష్మి చదువు చెప్పిస్తే చదువుకున్నది.

ఆ చదువూ నేను చెప్పించే స్థిమితం లేకపోయింది -

ఒక్కరోజు చదువుతోందా అని చూశానా?

వెంకూ చదువుకున్నాడు.

సుందరీ చదువుకుంటుంది.

అప్పట్లో చేసినది చదువుకయినా పెట్టానుకాదు -

డబ్బున్నప్పుడు చదువుకోవాలనే ధ్యాసలేదు.

పొలం ఉన్నప్పుడు ఒళ్ళు వంచాలన్న ఆలోచనే లేదు.

ఇప్పుడు డబ్బూలేదు, పొలమూలేదు. కనుకనే ధ్యాస, ఆలోచన ఉన్నా ప్రయోజనం లేదు.

భేష్! ఎంత చక్కగా అల్లావయ్యా భగవంతుడా ఈ జీవితకథని -

ఉన్నదేదో లేదనిపించక అది ఉంటే లేని పరిస్థితి ఉండేదికాదే అని తపన.

ఇన్ని కష్టాలున్నాయా నాకు?

కానీ ఇన్ని ఉన్నాయని నేననకూడదు.

అంటే జీవితంలో ఓడిపోయిన వాడికింద జమకడతారు.

డబ్బూ, శక్తి ఉన్నప్పుడు తిరిగి, ఇప్పుడు ఏడుస్తున్నాడు అంటారు.

డబ్బూ, శక్తి లేకపోవడమే నాలాటి వాళ్ళకి మంచిది.

డబ్బూ శక్తి ఉంటే వరలక్ష్మి ఇంకా మంచిపనులు చేసును.

నా మనసులో విచారం తెలిస్తే వరలక్ష్మి ఇంకా ఏడుస్తుంది.

ఇన్నీ తెలిసే చేశారా ఆ పనుల్ని? అంటుంది -

అందువల్ల చేతకానివాడిగా, ప్రపంచం దృష్టిలో, పెళ్ళాం దృష్టిలో బ్రతకడమే మేలు.

ఒరేయ్ హనుమంతయ్యా! నీకేం చేతకాదు .. ప్రజలు.

అవునవును, నాకేం చేతకాదు.

ఓరీ, హనుమంతగా నువ్వు వెధవ్వి. మనస్సు.

అవునవును, చవటవెధవని.

ఓహో! హనుమంతయ్యలవారూ! మీరెంత చేతకానివారు.. భార్య.

అవునవును. చేతకాని బడుద్దాయిని.

సదరు హనుమంతయ్యకి కుటుంబంపయి నదురూ బెదురూ లేదు. సంఘమనే న్యాయస్థానం.

చిత్తం మహాప్రభో, చిత్తం, చిత్తం.

మా నాన్నకేం తెలీదు. వాడు ఉత్త మొద్దవతారం. పిల్లలు.

అవున్రా, నేను మొద్దున్నర మొద్దుని.

వాహ్! ప్రపంచం దృష్టిలో, పెళ్ళాం దృష్టిలో, పిల్లల దృష్టిలో, సంఘందృష్టిలో ఏమీ చేతకానివాడుగా, మొద్దుగా బడుద్దాయిగా కనిపించడంలో ఎంతహాయి.

ఎవ్వరూ తనను ఏమిటని సలహా అడగరు.

ఎవ్వరూ తప్పు చేశానని నిందించరు.

చాలా గొప్ప, మంచి కవచాన్ని బహూకరించాడు దేవుడు.

గాయత్రి ఉద్యోగం చేసినా, కొడుక్కు ఉద్యోగం రాకపోయినా, పెళ్ళాం మెడలో పుస్తెలకి బదులు పసుపు కొమ్ము వేలాడుతున్నా - నా పెదాలమీద మాత్రం పదిలంగా చిరునవ్వు అలంకరించుకోవడం -

మనస్సులో విషణ్ణత

పైకి మాత్రం ప్రసన్నత -

ఇలా ముసలితనంలో దొంగవెధవలాగా బ్రతకడం నేర్చుకున్నాను -

"లాల్చీ విషయం ఆలోచించలేని రెండున్నర కోట్లమంది కంటే మనం నయం - హ్హ హ్హ హ్హ" అంటాను చేటంత మొహం చేసుకు నవ్వి.

"కొడుక్కి లాల్చీ లేకపోయిందే - కొని ఇవ్వలేక పోయానే" అని మనస్సులో ఏడుస్తాను.

ప్రపంచానికి సర్కస్ బఫూన్ హనుమంతయ్య.

మనస్సులో విషాద నిషా హమేషా.

ప్రపంచానికి బ్రతికి చచ్చిన రాజకీయవాది.

మనస్సులో చచ్చి బ్రతుకుతున్న తండ్రి.

అప్పుడు ప్రపంచం మనిషి.

ఇప్పుడు కుటుంబం మనిషి.

ఇప్పటికిప్పుడు భగవంతుడు ప్రత్యక్షమయితే అడగటానికి కోర్కెలు నా దగ్గర సిద్ధంగా ఉన్నాయి.

(అ)నా పిల్లలు నన్ను అసహ్యించుకోకుండా చెయ్యి.

(ఆ) నా పెళ్ళాం నా ఉద్రేకాన్ని క్షమించినట్టే నా చేతకానితనాన్ని క్షమించే ఓర్పుని ఇయ్యి.

(ఇ) కూతురు సంపాదిస్తే తినే దౌర్భాగ్యం నుంచి తప్పించు.

(ఈ) తరువాత - ఇన్నీ జరిగాక - ఈ దేశం బాగుపడేటట్టు చెయ్యి.

ఉఫ్! చివరికోరిక తీర్చకపోయినా బాధలేదు -

అన్నట్లు మరో కోరిక -

సైకిలు కావాలి నాకు.

పాతది, పాతది - నా అంత పాతసైకిలు -

ఇక్కడినుంచి పట్నానికి నాలుగు మైళ్ళు.

రోజూ చుట్టలు కావాలి.

చుట్టలు లేకపోతే ఆలోచనలు రావు.

'నేను బ్రతుకుతున్నాను' అని ఎప్పటికప్పుడు ఆలోచించుకోకపోతే బ్రతుకడం కష్టం.

ఆలోచనలకీ చుట్టలకీ లంకె.

చుట్టలు కొనడం ఒక సమస్య.

చుట్టలకోసం నడవడం ఒక సమస్య.

ఓ సైకిలుంటే బావుణ్ను.

రక్తంలో వేడివున్న ఇరవై ఏళ్ళూ రోజుకు ముప్పై మైళ్ళు నడవగలిగేవాణ్ణి.

ఇప్పుడు నడవాలంటే రక్తంలో వేడిలేని విషయాన్ని ఆలోచిస్తుంది మనస్సు.

ఆ ఆలోచన వచ్చాక నడువలేను నేను.

చుట్టోప జీవులకు సైకిలుండాలి.

నాకు సైకిలు లేదు,

అందువల్ల చాలా రోజులుగా గాయత్రికి ఓ అప్లికేషన్ పెట్టుకున్నాను.

జైలుకెళ్ళే రోజుల్లో పెళ్ళాన్ని 'అన్నం పెట్టవే' అని అడిగేవాణ్ణి కాదు.

నాన్నని 'డబ్బుకావాలి' అనేవాణ్ణి కాదు.

జీవితమంతా నేనొక్కటే అడిగాను - వెయ్యిగొంతులతో అడిగాను - 'స్వరాజ్యం' - బానిసత్వం విముక్తి.

ఇన్నాళ్ళకి - ఇప్పుడు మరొకటి అడుగుతున్నాను.

"సైకిలు - సైకిలు. చుట్టలు కొనుక్కోడానికి సైకిలు - నా అంత పాతసైకిలు"

అప్పుడు జాతివాళ్ళని పుచ్చించి, రెట్టించి, హెచ్చి అడిగాను.

ఇప్పుడు తలవొంచుకుని, సిగ్గుపడి భయపడుతూ నేను చదివించని, నేను బాగుపరచని, నేను ఉద్యోగం చూపని గాయత్రిని అడుగుతున్నాను.

"నాకో సైకిలు కొనిపెడతావమ్మా గాయత్రీ"

తలెత్తి విచిత్రంగా చూస్తుంది నావేపు - ఆ చూపులో "ఓరి చవటా - సైకిలు కొనుక్కోలేని -" అన్న వరలక్ష్మి చూపు ఉంటుందేమోనని భయం.

అందుకని తలెత్తి నేను చూడను.

ఆమే చూస్తుంది.

చూసి చూసి అడుగుతుంది.

"ఎందుకు నాన్నా సైకిలు?"

అమ్మో! ఎంత పెద్ద ప్రశ్న.

"చుట్టలకమ్మా - చుట్టలకి"

నవ్వుకుంటాను. ఆమె కూడా నవ్వుతుంది.

తనకీ తెలుసు ఆ ప్రశ్నకు సమాధానం అది కాదని ఆమెకీ తెలుసు.

"ముసలితనానికమ్మా ముసిలితనానికి" అని చెప్పాలోయ్ అంటూంటుంది నా మనస్సు.

"పట్నానికి నడవలేనమ్మా, అందుకు" అని నాన్న చెప్పాలనుకుంటుంది దాని మనస్సు.

కానీ నాన్న కోరికను కాదనదు.

"సరే నాన్నా! సరే సరే` అంటుంది.

నాన్నని తిరస్కరించటం, హీనంగా చూడటం నేర్పలేదు వరలక్ష్మి.

వాళ్ళకి బీదతనంలోంచి మంచి గుణాలు పుట్టుకొచ్చాయి.

నా మంచిగుణాలవల్ల బీదతనం పుట్టుకొచ్చింది.

నేను బీదవాణ్ణయాక మంచివాడినయాను.

వాళ్ళు మంచివాళ్ళు కాబట్టి బీదవాళ్ళయారు.

మంచితనం అక్క బీదతనం.

రెండు రోజుల్లో కొని ఇస్తానంది గాయత్రి సైకిల్ని.

అదొక్కటే నా ఆస్తి-

వృద్ధాప్యంలో సుఖం.

వృద్ధాప్యంవల్ల సుఖం.

వృద్ధాప్యం వస్తే సుఖం.

సరాసరి ముసలి వాళ్ళలాగా దేవుడు పుట్టిస్తే బావుణ్ణు. రెండురోజుల్లో సైకిలు కొని పెడతానంది గాయత్రి. నా స్వర్గానికి రెండురోజుల దూరం.

నా సంతోషానికీ నాకూ 48 గంటల వ్యవధి.

స్వర్గం, స్వర్గం.

సైకిలు వల్ల స్వర్గం.

## (3)

***గాయత్రి***

మల్లెపువ్వులాంటి జీవితం చుట్టూ ముళ్ళ కంచెలు చుట్టుకున్నాయి - అంటూ నన్ను చూసి ఏడుస్తుంది అమ్మ.

ఇంత వయసొచ్చినా పెళ్ళి చేయలేకపోయామే.. అమ్మ బాధ.

ఇంత చిన్న వయస్సులోనే ఉద్యోగమా - అని నాన్న బాధ.

పెళ్ళికి వయస్సు మించిపోతోంది.

ఉద్యోగానికి వయస్సు మిగిలిపోతోంది.

అయినా ఆడదానికి పెళ్ళొక్కటేనా సమస్యా?

పెళ్ళిని భూతద్దంలో పెద్దదిగా చూపించి, సుఖాన్ని ఉరితీస్తుంది సంఘం.

అమ్మనీ, నాన్ననీ, అన్నయ్యనీ పోషించే యోగ్యత ఆడదానికి ఉండకూడదూ?

అమ్మకి చీరకొనిస్తే కళ్ళనీళ్ళు తుడుచుకుంటూ కావలించుకుంటుంది.

నాన్నకి చుట్టలు తెస్తే నవ్వుతూ అందుకుంటాడు.

ఆ నవ్వు ఎన్ని సంవత్సరాల పోరాటానికి అర్థమో తెలుసు నాకు.

ఇన్నాళ్ళకి సైకిలు కావాలని నోరువిడిచి అడిగాడు నాన్న.

ఎప్పుడూ అడగని నాన్న ఇప్పుడు అడిగాడు.

కొనాలి, కొనాలి.

నాన్న సంతృప్తి ఖరీదు యాభై రూపాయలు.

తీరుస్తాను. తీరుస్తాను.

అన్నయ్య తనకేమీ అడగడు.

ఎప్పుడన్నా అవసరం వస్తే 'చెల్లాయి! మరో ఉద్యోగానికి అప్లికేషన్ పంపాలి. ఓ రూపాయి ఇవ్వు' అంటాడు.

కళ్ళెత్తి చూడడు నన్ను.

పుచ్చుకోడానికి సిగ్గుపడతాడు.

ఇస్తూ నేను బాధపడడం -

బ్రతుక్కి బరువెక్కువవుతోంది.

సుఖానికి ఉక్కపోస్తోంది.

నాకు తెలీకుండానే నా జీవితంనుంచి యౌవనం రాలిపోయింది.

పదేళ్ళు పెద్దదానిలాగ కనిపిస్తానని ఆఫీసులో సుజాత అంటుంది.

అవును, కన్పించనూ మరి?

నా శరీరం పది ఏళ్ళు పెరిగిపోయింది.

నా మనస్సు పది జీవితాలను గురించి ఆలోచించేంత పెరిగిపోయింది.

స్త్రీకి కష్టాల బరువు తగదు.

స్త్రీకి ఇష్టాల కరువు తెగదు.

అద్దంలో చూసుకుంటే పాత చెక్కిళ్ళ ఎరుపు గుర్తుకొస్తుంది.

ఇప్పుడు కళ్ళల్లో నీడలు మాత్రం మిగిలాయి -

అబ్బో! ఎన్ని కష్టాలు! ఎన్ని బాధ్యతలు?

నాకు వచ్చే తొంభై రూపాయలమీద అయిదుమంది బ్రతకాలి.

కానీ నెలకు ముప్ఫైరోజులయితే బాగానే ఉంటుంది.

నెలకు ముప్పై యుగాల వ్యవధి -

అయిదు మందీ అయిదు మహాసముద్రాలు.

ముప్ఫై యుగాలలో అయిదు సముద్రాలను ఈదాలి.

సుందరి పెద్ద ఉప్పెన.

ఉద్రేకాల పుట్ట.

కుటుంబంలో అందరినీ ఆదుకోవడం ఒక ఎత్తు! సుందరిని అదుపులో ఉంచడం ఒక ఎత్తు.

యౌవనంలో అంత బలం, అందంలో అంత పదునూ ఉంటుందని తెలీదు నాకు.

నాన్నగారి ఉద్రేకమంతా అందమయి, అమ్మ మంచితనం యవ్వనమయింది.

సుందరిని చూస్తే నాకు భయమేస్తుంది.

అంత అందాన్ని వృధాగా ఖర్చుచేస్తుందేమోనని.

స్త్రీ అందానికి పరాకాష్ట అనుభవం.

అనుభవానికి నాంది యవ్వనం.

అందం, యవ్వనం కలిసిన కుందనపుబొమ్మ సుందరి.

అందుకే భయం నాకు.

దాని కళ్ళలో ప్రతి విషయాన్నీ తృణీకరించే విసురూ.

పెదాలవంపు - నాన్నలాగే.

నా కష్టాల్ని చూసి మిగతా వాళ్ళంతా విచారిస్తే - సుందరి కోపంతో, కసితో కసురుకుంటుంది.

ఎవరిమీదో పగతీర్చుకోవాలన్నట్టు, ఎవరో మమ్మల్ని దారిద్ర్యంలో పారవేశారన్నట్టు మండిపడుతుంది.

ఇంకా దారులు వెదుక్కోని ఉద్రేకాలు దాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూంటాయి.

"బాగా చదువుకోవాలి సుందరీ, చదువుకుంటే -" అనబోతే -

"ఎందుకూ చదువు - చదివి నీలాగ త్యాగాలు చెయ్యడానికా? అంతకంటే నాకీ వెధవ చదువు వద్దు" అంటుంది రుసరుసలాడుతూ.

నివ్వెరపోతాను నేను -

"అదేమిటే? నాన్ననీ అమ్మనీ పోషించడం తప్పటే!" అంటే -

కోపంలోనే నవ్వి, నన్ను జాలిగా చూసి ముద్దుపెట్టుకుంటుంది.

"తప్పులేదక్కా, కాని తప్పులూ, ఒప్పుల్నీ లెక్క కట్టుకుంటే జీవితం గడిచిపోతూంటుంది. నేనెంత అందంగా ఉన్నానో చూడు నాకంటే నువ్వు రెండేళ్ళు పెద్ద. కానీ ఇరవై ఏళ్ళ పెద్దదానిలాగా అగుపిస్తావు. ఈ త్యాగాలకీ, ప్రేమలకీ ఇంత అందాన్ని ఖర్చుచెయ్యలేను బాబూ!" అని కళ్ళుమూసుకుంటుంది.

నిజమే. సముద్రపు నురుగులాగ మెత్తటి, స్వచ్ఛమైన అందం దానిది.

ఒడ్డుకు తేలిపోయిన నాచులాగ నా యవ్వనం తేలిపోయింది.

తెలిసి తెలిసి దాన్ని నాలాగ ఎందుకు పాడవమనాలి?

ఇలా ఆలోచిస్తే ఎన్నో తెలిసిన వేదాంతిలాగ కనిపిస్తుంది సుందరి.

జీవితంలో ఏదో ఒకటి మిగులుతుంది మనకి.

కర్తవ్యాన్ని నిర్వర్తించిన సంతృప్తా?

కర్తవ్యాల ప్రసక్తిలేని సంతోషమా?

నేను మొదటిదానికి బలి అయ్యాను.

సుందరి రెండవదానికి వెలి అయింది.

"అవునమ్మా - నువ్వు నాలాగ కాకు. నేనయిందే చాలు. ఈ కుటుంబానికి ఈ మాత్రం త్యాగం చాలు" అంటే నా కనుకొలకుల్లో నీటిని గుర్తిస్తుంది సుందరి.

వేడి రక్తం పొంగి నీరయి గడ్డకట్టి కనుకొలకుల్లో నిలిచి పోయిందని తెలుసు నాకు.

నాకన్నీళ్ళ విలువ దానికి తెలుసు.

నేనేడుస్తే అది చిన్నపిల్లలాగ భోరుమంటుంది.

"నీలాగ నేను తెగించలేనక్కా. ఇలా సుఖాన్ని పాడు చేసుకోవాలంటే భయమేస్తుంది నాకు. ఏం చేయను?" అంటుంది.

ఎవరూ ఏమీ చెయ్యవద్దు.

నేను చేసింది మీకు ఉదాహరణ అయితే చాలు,

స్త్రీ వయస్సు విలువయినదని చెప్పడానికి ఎవరూ లేక పోయారు నాకు.

విలువయినదని తెలపడానికి సుందరికి నేను ఉదాహరణగా మిగిలాను.

అది బాగుపడుతుందని విచారం నాకులేదు.

అదయినా బాగుపడుతుందని సంతోషం నాకు.

సుందరిదేం తప్పు?

బ్రతకడానికి - సుఖంగా బ్రతకడానిక్కాకపోతే - ఎందుకీ బ్రతుకు?

ఇంకొకరికి సహాయ పడడమంటే - మనం చావడంకాదు.

ఈమాట అన్నప్పట్నుంచీ సుందరి అంటే ముచ్చట నాకు.

అది తలలో పువ్వులు పెట్టుకుంటే నల్లటి జుత్తు వెనుక నక్షత్రాల మెరపులాగో, మిణుగురుల కాంతిలాగో కనిపిస్తాయి పువ్వులు.

నా జుత్తు అప్పుడే అక్కడక్కడ తెల్లబడుతోంది.

ఆఫీసుకి వెళ్ళేటప్పుడు పువ్వులు పెట్టుకుంటే బాగుండదు.

నాకు పువ్వులు పెట్టుకోడానికి వ్యవధేలేదు.

అది పల్చటి చీర కట్టుకుంటే రెపరెపలాడుతూ సీతాకోక చిలుకలాగ ఉంటుంది.

నేను పల్చటి చీర కట్టుకుంటే ఆఫీసులో అందరూ ఏదో రుచికరమైన ఆహారాన్ని తినడం మరిచిపోయినట్టు చూస్తారు.

అది నవ్వుతే, వెన్నెల పరిమళించినట్టు -

నేను నవ్వుతే, కన్నులు పరితపించినట్టు -

ఒక్కొక్కప్పుడు అనిపిస్తుందికదా?

నేను ఈ కుటుంబంలో 'సుందరి' అయి పుడితే ఎంత బాగుండేదని.

కాని దాన్ని చూసి నాకు ఈర్ష్య ఎందుకు?

అసలు ఈర్ష్య లేనేలేదు.

దాని సంతోషాన్ని చూస్తే నాకు గర్వం.

ఎందుకంటే నా యవ్వనాన్ని ఖర్చుచేసి ఆ యవ్వనానికి బంగారపు పూత పూస్తున్నాను.

ఇద్దరు స్త్రీల వయస్సుల సొగసు అది.

ఆమె అందంలో నా పాలు ఉంది.

మేమిద్దరం ఒకటే అసలు. 'గాయత్రీ సుందరి'

'గాయత్రీ సుందరి' అనే స్త్రీలో కష్టం భాగాన్ని గాయత్రీ, సుఖం భాగాన్ని సుందరీ అనుభవించాలని నిశ్చయించుకున్నాం.

ఇప్పుడు మా స్థానాలు మార్చుకుంటే 'గాయత్రీ సుందరి' చచ్చిపోతుంది.

సుందరిలో కోరికలు ఇప్పుడిప్పుడే చిగురిస్తున్నాయి.

కోరికలతో భయం పెరుగుతుంది కాబోలు.

సుందరికి రోజూ ఎక్కడినుంచో ఉత్తరాలు వస్తాయి.

వస్తాయని అమ్మ చెప్పింది.

ఉత్తరాలతో భయమూ వస్తుంది కాబోలు.

ఉత్తరాల్లో ఏముంటుందో?

అమ్మో! ప్రేమ ఉంటే ఇంకేమైనా ఉందా?

నేను అందంగా లేను.

ఆ విషయాన్ని అంతా ఒప్పుకుంటారు.

నేను అందంగా లేనంటే ఈ ప్రపంచంలో ఒక్కరే ఒప్పుకోనిది.

ముకుందరావు.

అందానికి లేదే కొలతబద్ద అంటాడు.

నేను మరీ విచారంగా ఉన్న రోజున, ఎంతో అందంగా ఉన్నారు మీరు అంటాడు.

రోజంతా ప్రెస్సులో పనిచేసి పనిచేసి డొక్కుపోయిన ముఖంతో బయటికి వస్తాడు ముకుందరావు.

కానీ ఆశ్చర్యం - అతనూ పూర్తిగా అలిసిపోయిన రోజునే అందంగా అవుపిస్తాడు.

"మన అందాల్ని శరీరాలకి పొదగడం మరిచిపోయాడు దేవుడు. మనసులలోనే నిలిచిపోయాయి" అంటాడు ముకుందరావు ఒక్కోసారి.

నవ్వొస్తుంది నాకు.

అవున్నిజమే - ఏదో ఒక తృప్తికావాలి బ్రతకడానికి.

పట్టణంలో ఆఫీసు.

రోజూ బస్సులో వెళ్ళాలి.

ఇంకా నాలుగుమైళ్ళు వెనకనున్న ఊరునుంచి బయలుదేరుతాడు ముకుందరావు.

బస్సులో ఎప్పుడూ ఒకే చోట కూర్చుంటాడు.

నల్లగా ఆఫీసులో అచ్చు సిరామరకలతో నిండిన బట్టలు ఎవరికీ అంటకుండా దూరంగా కూర్చుంటాడు.

నేనూ దూరంగా ఎవరికీ అంటకుండా - నా బాధల, బాధ్యతల, బరువుల మరకలు అంటకుండా దూరంగా కూర్చుంటాను.

నేను ప్రపంచాన్ని భయం భయంగా చూస్తాను.

అతను ప్రపంచాన్ని క్షమించినట్టు ప్రశాంతంగా చూస్తాడు.

నేను స్త్రీని కావడం, అతను పురుడు కావడమే తేడాయేమో.

ఇంకా ఆలోచిస్తే నాకు తెలియని రహస్యమేదో అతనికి ఈ ప్రపంచం గురించి - తెలుసుననిపించింది.

ఏమిటో అడిగితే బాగుండును.

కానీ మొదట్లో మేమిద్దరం మాట్లాడుకోలేదు.

మొదటిరోజు ఒకరినొకరం చూసి ఇద్దరం జాలిపడ్డాం.

కొంతకాలానికి ఒకరి కష్టాన్ని ఒకరు ఊహించుకున్నాం.

అటు తరువాత కళ్ళు సానుభూతుల్ని మార్పిడి చేసుకున్నాయి.

మరీ దుఃఖంగా ఉన్నరోజున - అతని కళ్ళు పరామర్శించేవి.

మరీ దిగులుగా కనిపించిన రోజున - నా కళ్ళు అతనికి ఏవో ధైర్యాన్ని చెప్పేవి.

'కళ్ళ' భాష చాలా విచిత్రమయింది.

టైఫాయిడ్‌తో - 20 రోజులు మంచం పట్టి శల్యంగా 21వ రోజున బస్సు ఎక్కితే - ఆ రోజున మొట్టమొదటిసారిగా పలకరించాడతను.

"జ్వరం పూర్తిగా తగ్గిపోయినట్టేనా?" అన్నాడు పలకరించి.

మాట్లాడితే స్వగతం పలికినట్టుంటుంది. ఎదురుగ్గా ఉన్న వ్యక్తికి తప్ప పక్కవాడికి వినిపించదు.

నేనాశ్చర్యపోయాను - ఆ గొంతువిన్నాక. ఇన్నాళ్ళూ మాట్లాడకపోవడంవల్ల ఎంత సంతృప్తిని పోగొట్టుకున్నాను అనుకున్నాను.

"మీకెలా తెలుసు నా జ్వరం సంగతి?" అన్నాను నిర్ఘాంతపోతూ.

నవ్వాడు.

ఆ రోజే నాకు ప్రపంచంలో మంచి 'అండ' దొరికినట్టు పొంగిపోయాను.

బీదతనంలో అంత అసంతృప్తి, నిజాయితీ ఉన్నదేమో!

"మీ కళ్ళు చెప్పాయి" అన్నాడు.

ఎన్నో నెలలుగా మా కళ్ళు చేసుకున్న పరిచయాన్ని మాటల్లోకి తర్జుమా చేసుకున్నాం.

మండు వేసవిలో చలవపందిరిలాగ -

వేసవి దాటని వేడి బ్రతుకు మీద వెన్నెల వర్షాన్ని కురిపించినట్టు అతని నవ్వు, పలకరింపు -

హెచ్చు మాట్లాడడు.

అడిగితే కానీ తనెవరో చెప్పడు.

తన కష్టాల్ని, సమస్యల్ని అడిగితేకాని చెప్పడు. నవ్వుతాడు.

అర్థం చేసుకో గలిగితే అతని జీవితాన్నంతా ఆ నవ్వులో కుదించి దాచుకున్నాడు.

నేనే తొందరపడి, ఆరాటపడి 'మీరు నాకు మిత్రులు' అంటే -

"మీకు తెలీదుగాని ఆరునెలల క్రిందటే మీరు నాకు మిత్రులు" అన్నాడు.

నా జీవితానికి పెద్ద సముదాయింపు ముకుందరావు.

ఒకరి ఇంటి విషయాల గురించి ఒకరం మాట్లాడకూడదని మాటలు కలిసిన రెండోరోజే అనుకున్నాం -

ఆ కొద్ది క్షణాలు కష్టాల పునరుక్తిలో కలిసిపోవడం ఇష్టంలేక -

కానీ మా ఇద్దరి బ్రతుకులూ వాటితోనే నిండిపోయాయే!

అందుకని మేమిద్దరం హెచ్చు మాట్లాడుకోం.

"మీరివాళ చాలా అలసిపోయినట్టున్నారు" అంటాడు.

నవ్వుతాను.

అటువంటి సముదాయింపు నాకు కొత్త.

"ఒళ్ళువంచి చేసే పనేమో - మీరూ పూర్తిగా నలిగి పోయారు., సాయంకాలమయేసరికి పని ఎగవేయడం నేర్చుకోకూడదా?" అంటాను ఎప్పుడయినా.

నవ్వుతాడు.

ఆ నవ్వును సంపాదించుకోడానికి బస్సుకోసం వేచి ఉండే రెండు క్షణాలలో నాలో ఎక్కడలేని ఉత్సాహం, హాస్యం తలయెత్తుతుంది.

రోజులో అన్నీ మరిచిపోయి గడిపే క్షణాలు అప్పటివే.

బస్సు రెండు జీవిత కాలాలపాటు ఆలశ్యమయితే బావుణ్ణనిపిస్తుంది.

బస్సుకోసం వేచి ఉండడం, వేచి ఉన్నంతసేపూ సరదాగా కాలక్షేపం.

వచ్చాక దానిలో ఎక్కడం. ఎవరి గమ్యస్థానాల్లో వారు దిగిపోవడం.

వాహ్! జీవితమంత గొప్ప వేదాంతం ఇమిడివుంది మా స్నేహంలో.

అతని గురించి నేనేం తెలుసుకోలేదు.

నా గురించి అతనేమీ అడగలేదు.

అతనిలో ఓ మంచి అన్నయ్య, తండ్రి, పరిరక్షకుడు కనిపిస్తారు నాకు.

అతని నవ్వు పెద్ద ఓదార్పు.

నాలో అతనికేం కనిపిస్తాయో.

నన్ను ఎలా అభిమానిస్తాడో?

ఎప్పుడూ చెప్పడు.

నేనడగను. అడిగితే ఏం సామాధానం చెప్తాడో తెలుసు.

నవ్వు.

దాని అర్థాన్ని కనుక్కోవటం ఇంకా చేతకాలేదు నాకు.

రేపు నా పుట్టినరోజని నిన్న చెపితే ఆశ్చర్యంగా చూశాడతను.

అతన్ని చూస్తూంటే నాలో ఏదో తెలీని చిలిపితనం కలిగింది.

"రేపు మీ నవ్వు తప్ప నాకేదన్నా బహుమతి ఇవ్వండి" అన్నాను.

అతనింకా ఆశ్చర్యపోయాడు.

"ఏమిటి కావాలి?" అన్నాడు.

"ఎప్పుడూ నా అంత గడగడా మాట్లాడరు. నేను చాలనేవరకు మీరు రకరకాల విషయాలు చెప్పాలి"

"నాకేమీ లేవు."

"ఏదో ఒకటి. సముద్రం గురించి మాట్లాడండి. ఆకాశం గురించి, లేకపోతే నా గురించి."

అతనింకా నిర్ఘాంతపోతున్నాడు. బస్సు దిగబోతూంటే అన్నాడు.

"రేపు సాయంకాలం మీ గురించి మాట్లాడతాను" అని.

నా గురించి ఏం మాట్లాడతాడు?

ఏమో! ఏమో?

అతను ఏం మాట్లాడినా బాగుంటుంది.

మాట్లాడతానని తనే అనడం బాగుంది.

రేపు.. రేపు.. రేపు..

రేపు 24 నిముషాలకి కుదిస్తే బావుణ్ణు.

నవ్వే రబ్బరు బొమ్మ రేపు నవ్వుకి అర్థం చెబుతుంది రేపు.

ఈ రేపుకి జీవితంలో ప్రత్యేకస్థానం.

ఇట్లాంటి రేపులు రెండు చాలు - సుఖంగా బ్రతకడానికి.

"రేపు మాట్లాడతాను. మీ గురించి"

అబ్బ! ఎప్పటికి రేపు!

## (4)

***వెంకటరావు***

రోజూ ఉదయం లేచినప్పుడల్లా 'నిన్నలాంటి నేడును గడవనివ్వకు భగవాన్!' అనుకుంటుంటాను.

కానీ గడిచేవన్నీ అవే!

వెయ్యి 'నిన్న'లలాంటి వెయ్యి 'రేపు'లు -

ఎప్పుడూ ఈ రొటీన్‌లో మార్పురాదు.

రోజూ ఉద్యోగం కోసం ఊరంతా తిరగడం తప్పదు.

రోజూ బస్సుకోసం చెల్లెల్ని డబ్బు అడక తప్పదు.

రోజూ జాలి చూపెట్టే అమ్మ కళ్ళని ఎదుర్కోక తప్పదు.

కష్టాలలో సుఖాన్ని సాయంకాలం బోధించి, నవ్వుతూ భుజం తట్టే నాన్న మాటలూ తప్పవు.

చివరికి - రోజంతా గడిచాక - అందరూ నిద్రపోయాక నిశ్శబ్దం ఒడిలో తల దాచుకుని భోరుమని మనస్సు ఏడవకా తప్పదు.

దారిద్ర్యానికి ఊడిగం చేస్తున్నాను.

మగాడికి పని లేకపోవడమంత దౌర్భాగ్యం మరొకటి లేదు -

ఏడవడం, చేయని పాపాలకి శిక్ష అనుభవిస్తున్న నేరస్థుడిలాగ కుంగిపోవడం, అదీ నేను చేస్తున్న పని.

నేను బి.ఏ చదివాను.

గాయత్రి మెట్రిక్కే చదువుకుంది.

అది ఉద్యోగం చేసి ఇంకా పోషిస్తున్నందుకు అంతా బాధపడుతున్నారు.

నేను ఉద్యోగం చేసి ఇంటిని పోషించనందుకు అంతా బాధపడుతున్నారు -

ఒక రాత్రికి రాత్రి హఠాత్తుగా నేను గాయత్రినయిపోతే ఎంత బాగుండును?

దొంగతనాలు చేసినవాళ్ళకి, మోసాలు చేసినవాళ్ళకి దేవుడు కొన్ని శిక్షలు విధిస్తాడు.

హత్యలు మాత్రం చేసినవాళ్ళయితే ఏ ప్రభుత్వ ఉద్యోగులుగానో పుట్టిస్తాడు.

మరి హత్యలూ, దొంగతనాలూ, మోసాలూ అన్నీ చేసినవాడిని 'నిరుద్యోగి'గా ఇంత పెద్ద కుటుంబంలో చెల్లెలి పోషణలో బ్రతికే నిరుద్యోగిగా పుట్టిస్తాడు కాబోలు!

బాధపడవద్దని గాయత్రి ఓదారుస్తూనే ఉంటుంది.

కానీ చెల్లెలి ఓదర్పు అవసరమయిందే అని బాధ.

నిరుద్యోగం వల్ల బాధ.

అమ్మ జాలిని భరించలేక బాధ.

నాన్న ప్రోత్సాహాన్ని తట్టుకోలేక బాధ.

చెల్లెలి ఓదార్పుని ఊహించుకుని బాధ.

మెత్తటి బాధలు ఇవన్నీ -

మంచి అమ్మనీ, మంచి చెల్లెల్నీ, మంచి చదువునీ ఇచ్చి ఒక్కటిమాత్రం ఇవ్వలేకపోయాడు దేవుడు.

మంచి ఉద్యోగం - అదీ -

పోనీ చెడ్డదయినా - ఉద్యోగం -

ఉద్యోగం ఇచ్చి చెడ్డ అమ్మనీ, చెడ్డ చెల్లెల్ని, చదువులేమినీ ఇచ్చినా బ్రతికేవాణ్ణి.

చదువులేని వాళ్ళు కుటుంబాన్ని పోషించుకొనడం లేదూ?

"మా అమ్మనీ, మా నాన్ననీ నేను పోషిస్తున్నాను - మా చెల్లెలికి నేను పెళ్ళి చేస్తాను. మా చిన్న చెల్లెలికి చదువు చెప్పించుకుంటాను" అనే గర్వం కోసం రెండేళ్ళు మనస్సు తపస్సు చేసి విసిగిపోయింది.

ఇప్పుడు చెల్లెలే నన్ను పోషిస్తోంది.

చెల్లెలు తెచ్చిపెడుతూంటే డింగరాయి గొడ్డులాగ తిరుగుతూ ఉద్యోగం చేయకుండా కూర్చున్నాడని తిడుతున్నారు కొందరు.

ఉద్యోగం దొరికే అవకాశాలున్నా నేను పుచ్చుకోవడం లేదట.

ఎందుకు పుచ్చుకోనండీ!

ఏ ఉద్యోగమయినా చేస్తానండీ - బాబ్బాబూ -

మీవాడికి బూట్లు పాలిష్ చెయ్యాలా!

వెంకట్రావు బి.ఏ అర్ధణాకి పాలిష్ చేస్తాడు సార్!

నెలకి వెయ్యి బూట్లు పాలిష్ చేసి 500 అణాలు ఇంటికి తెచ్చుకుంటాను.

కడివెడు గంజి కాచి అమ్మకీ నాన్నకీ పోస్తాను.

పది అణాల చొప్పున పది సంవత్సరాలు దాస్తే చెల్లెలికి పెళ్ళవుతుందేమో!

నా డబ్బుతో అమ్మా, నాన్నా గంజి తాగితే, నా అర్ధణాల కూడికతో చెల్లెలి పెళ్ళి అయితే -

బాబ్బాబూ! నాయన్నాయనా!

మీ పాతచొక్కాలు కుట్టే ఉద్యోగం ఇవ్వండి.

బజార్నించి కూరలు తెచ్చే ఉద్యోగం ఇవ్వండి.

మీ కుక్కకి రోజూ పాలుపట్టే ఉద్యోగమన్నాసరే -

మీ కుక్కకి వెంకటరావు బి.ఏ పాలు పట్టడం ఎంత హోదానో చూడండి -

"మా కుక్కకి వెంకటరావు బి.ఏ పాలు పడుతున్నాడు" అని మీరు చెప్పుకోవచ్చు.

నా గర్వం ఏమిటంటారు?

చాలా ఉంది. చాలా ఉంది.

"వెంకటరావు బియ్యే - ఫలానా వారి కుక్కకి పాలుపట్టే వెంకటరావు బియ్యే - తన అమ్మనీ, నాన్ననీ పోషించుకుంటున్నాడు."

మీ కుక్కకున్న అదృష్టంతో పుట్టలేదు నేను.

కనీసం మీ కుక్కగా పుట్టినా బాగుండును.

మా గాయత్రిగా పుట్టినా బాగుండును.

అసలు పుట్టకపోయినా బాగుండును.

ఆత్మగౌరవం, వ్యక్తి మర్యాదలు పెద్దవాళ్ళకి - నిరుద్యోగులకి ఆత్మలేదు -

'ఉద్యోగం' అన్న కోరిక తప్పించి -
బతానీలు అమ్ముకు బ్రతికే కుర్రాణ్ణి చూస్తే ఈర్ష్యపుడుతుంది.
'చెనా 'చెనా' వాలా నాకంటే ఎంత గొప్పవాడు.
మాసిన 'బట్టల్ని మోస్తూ తిరి'గే గాడిదని చూసినా ఈర్ష్యే!
దానికి గౌరవం బాధ లేదు.
అది బి.ఏ చదువుకోలేదు.
అందుకని నిక్షేపంలాగ బట్టలు మోస్తుంది.
బియ్యే చదివిన వాడు బట్టలు మోస్తే ఊరుకోరు.
బాధ్యతల్నే మోయాలి.
కష్టాల్నే మోయాలి.
వాహ్?
"నీకేం ఉందయ్యా అమ్మడానికి"
డామ్ ఫూల్ వెంకట్రాయా!
నిరుద్యోగ చక్రవర్తీ!
అయ్యో! నా దగ్గర చాలా ఉన్నాయండీ అమ్మడానికి.
నా మనస్సుంది -
నేను మానవుణ్ణి - అందుకు సాక్ష్యం?
మా అమ్మని ప్రేమిస్తున్నాను.
కష్టాలకి ఏడుస్తున్నాను.
'సుఖం లేదా?' అని ఏడుస్తున్నాను.
గాడిదని కాలేదే అని ఏడుస్తున్నాను.
బియ్యే చదివానే అని ఏడుస్తున్నాను.
నేను బియ్యేని.
పూర్వకాలంలో ఎవరో డాక్టరు దెయ్యానికి తనని అమ్మేసుకున్నాడట.
ఇప్పుడేదైనా దెయ్యం ఉంటే ఉద్యోగం ఇచ్చే పుణ్యానికి నా జీవితాన్ని అమ్మేసుకుందును.
కానీ దెయ్యాలూ మన బతుకుల్ని కొనవు.
దెయ్యాల సామ్రాజ్యంలో నిరుద్యోగ రోగం అంటుకుంటుందేమోనని వాటి బాధ.
'ఇండియన్ రిపబ్లిక్' అనే ఈ ఆంగ్లో ఇండియన్ దేశంలో ఆరుకులాలున్నాయి -
బ్రహ్మ, క్షత్రియ, వైశ్య, శూద్రులు -
పంచములు
నిరుద్యోగులు.
నిరుద్యోగుల్ని పంచములు కూడా ముట్టుకోరు.

హరిజనుల్ని గాంధీగారు బాగుచేశారు.

పంచములు 'హరి' జనులయితే నిరుద్యోగులు 'హర' జనులు.

హరిజనులకు 'గాంధీ' గారు పుడితే, హరజనులకు 'సింధీ'గారెవరో పుట్టాలి.

ఒక్క త్యాగం చెయ్యటానికి మాత్రం అవకాశం మిగిల్చాడు దేవుడు.

మేనమామ కూతుర్ని కుంటిపిల్లగా పుట్టించడం -

అలివేలును తల్చుకున్నప్పుడల్లా దేవుడి గొప్పతనానికి జోహార్లు అర్పించాలనిపిస్తుంది.

అలివేలును నేను పెళ్ళిచేసుకుంటే గాయత్రికి తన బావమరిది నిస్తానని మామ లంకె.

ఆ బావమరిదికి తల్లీ, తండ్రీ లేరు.

మావయ్యే చదువు చెప్పించి, పోషిస్తున్నాడు.

అలివేలుకి కాలు కుంటి.

కుంటిపిల్లను, పిల్లలను వదిలించుకోడానికి తన బావమరిది 'ఎర'

అలివేలుని ఏమీ అనాల్సిన పనిలేదు.

మా సుఖాలకీ, మా నిస్సహాయతకీ తనవకాశాలకీ మధ్య మామయ్య బిగించిన లంకె ఇది.

ఉద్యోగం చెయ్యలేకపోయినా, నా అంతట నేను బ్రతకలేకపోయినా 'గాయత్రి' జీవితానికి పరిపూర్ణత ఇచ్చే అవకాశం మిగిలింది.

మావయ్య బావమరిది పట్నంలో ఎమ్మే.

"అతన్ని పెళ్ళిచేసుకుంటావమ్మా గాయత్రీ" అంటే నవ్వుతుంది.

"అలివేలుకు కాదన్నయ్యా కుంటి. అతనికే" అంటుంది.

నిజమే. నిజమే.

అలివేలుకి కాలు కుంటి.

బావమరిదికి మనస్సు.

మావయ్యలాంటి బావమరిది.

చచ్చిపోయిన అత్తయ్యలాంటి అలివేలు.

వాళ్ళనాన్న కుటిలత్వం చూసి ఏడుస్తుంది.

నేను కనిపిస్తే ఏడుస్తుంది.

ఏడుస్తూ అంటుంది.

"గాయత్రి సుఖానికి నీ సుఖాన్ని వదులుకోకు బావా - మా నాన్న మాటలకేంలే" అంటుంది.

అట్లాంటి మంచి మనసిచ్చి కుంటితనం ఎందుకిచ్చాడు దేవుడు.

మనస్సు మంచితనం మరీ అందంగా కనిపించడానికి కాబోలు.

కొందరికి మంచి మనస్సిచ్చి కుంటి వయస్సిచ్చాడు.

ఏడ్చే మెత్తటి కళ్ళు కోరికలతో నలిగిన కళ్ళు నా వేపు తిప్పి "నిజంగా నేను నీకు కావాలా బావా! కావలిస్తే నీ ఇష్టం" అంటుంది.

రక్తమంతా ఎరుపెక్కి, అసలే ఎర్రటి ముఖం కెంపులాగ ఎరుపెక్కిపోతుంది.

ఆ ఆప్యాయతకి, ఆ మనస్సు గొప్పతనానికి పెళ్ళి చేసుకుంటేనేం అనిపిస్తుంది -

అలివేలు కావాలి నాకు.

అలివేలుకి నేను కావాలి.

కానీ బావ అక్కరలేదు గాయిత్రికి -

నాకు పెళ్ళి వద్దంటుంది.

ఎందుకు వద్దంటుందో తెలీదు నాకు.

నాన్నా, అమ్మా పెళ్ళి గురించి ఆత్రుత పడరు.

"పోనీ, డబ్బు ఇస్తావా మామయ్యా అలివేలుని పెళ్ళి చేసుకుంటే" అంటే ఎగిరి గంతేస్తాడు.

డబ్బుకు నేను అమ్ముడు పోతే ఒక కుటుంబం నిలుస్తుంది.

డబ్బుకోసం కుటుంబాల్ని అమ్ముకునేవాళ్ళు కొందరు.

తాము అమ్ముడుపోయి కుటుంబాల్ని నిలుపుకునే వాళ్ళు కొందరు.

కానీ అమ్మకి మావతో సంబంధం ఇష్టంలేదు.

ఆ విషయం అంతటితో ఆగిపోయింది.

అయినా నాకెందుకు పెళ్ళి?

నా నిరుద్యోగం - నా చేతకానితనం ఇప్పటికే నలుగురినీ బాధిస్తోంది.

ఈ బాధను మరో వ్యక్తికి కూడా పంచాలి.

అలివేలుకు పెళ్ళికాదేమో అన్న బాధ ఒక్కటే ఉందిప్పుడు.

నేను పెళ్ళిచేసుకుంటే దానికీ ఎన్నో బాధలు.

(అ) నన్ను పెళ్ళిచేసుకుని బావ బాధ పడుతున్నాడేనని -

(ఆ) నాకు ఉద్యోగం దొరకడంలేదని.

(ఇ) ఆడదానికి పెళ్ళి తప్పదుకదా - అయ్యో - అని.

(ఈ) ఆకలివల్ల, దారిద్ర్యం వల్ల.

నేను పెళ్ళి చేసుకోకపోవడంవల్ల లాభాలు.

(అ) బాధలు పడేవారిలో ఒకరి సంఖ్య తప్పుతుంది.

(ఆ) నాకు ఉద్యోగం దొరకడం లేదన్న బాధ నాకే ప్రత్యేకంగా ఉంటుంది.

(ఇ) ఇంకొకర్ని కష్టపెడుతున్నాననే బెంగ ఉండదు.

(ఈ) ఆమెని కూడా పోషించాలన్న కష్టం ఉండదు. అదేమిటి ఇవన్నీ లెక్కలు వేసుకుంటున్నానేమిటి!

ఒక్క మంచి, గొప్ప, అసలయిన ప్రశ్న ఉండనే ఉంది.

నేను పుట్టడంవల్ల లాభాలేమిటి?

నేను పుట్టకపోవడం వల్ల నష్టాలేమిటి?

ది యూస్ ఆఫ్ వెంకట్రావు బియ్యేస్ ఎగ్జిస్టెన్స్ ఈజ్ మెనీ ఫోల్డు - సైకాలజిస్టు.

సృష్టిని చేయగల జీవుల సంఖ్య పెరిగెను - శాస్త్రజ్ఞుడు.

ఇరవై సంవత్సరముల వయస్సు దాటిన వ్యక్తులు - వచ్చే జాతీయ ఎన్నికల వరకయినా (ఓటు చేయుటకై) బ్రతికి యుండుట మేలుకదా? - రాజకీయనాయకుడు.

జనాభా ఎక్కువగా ఉండడంవల్ల విదేశీ సహాయాన్ని ఎక్కువగా అర్థించవచ్చు - ప్రభుత్వం.

20 వ శతాబ్ధము నందు ఎందుకూ పనికిరాని కొన్ని విచిత్ర జంతువులు బ్రతికినవని చెప్పుటకు - 'రేపటి' చరిత్రకారుడు.

బీద, దీన హీన స్థితి వర్ణించడానికి మంచి 'కవితాసామగ్రి' - అభ్యుదయ కవి.

ప్రాణం లేని ప్రాణి నిర్జీవజీవి వంటి స్రరియలిస్టు ఆర్ట్‌కు చక్కటి ఉదాహరణ - చిత్రకారుడు.

భారతదేశంలో మానవశక్తి అధికంగా ఉన్నదనడానికి ఆధారం - ఎకనామిస్టు.

బ్రతికి ఉన్నా చచ్చినట్టే లెక్క కనుక చచ్చేవరకూ బ్రతికి ఉండడమే మంచిది, చచ్చిపోవలసి వచ్చినప్పుడు ఎలాగూ బ్రతకలేడు కనుక అభ్యుదయ వేదాంతి.

పిల్లల్ని కనడానికి, పెళ్ళిచేసుకోడానికి పనికి వస్తాడు కనుక బ్రతకడానికి అర్హుడు - స్త్రీ.

పుట్టిన కొడుకుల్లో బ్రతికినవాడు వీడొక్కడే, వాడు బ్రతక్కపోతే నాకు బ్రతుకులేదు - తల్లి.

బ్రతికి ఉంటే ఎప్పటికయినా ఉద్యోగం చేయకపోతాడా? తండ్రి.

చచ్చిపోవాలని కోరిక పుట్టడం, పుట్టినా చచ్చిపోలేకపోవడం, మనిషి పరిపూర్ణతకి చిహ్నం - వెస్టర్న్ ఫిలాసఫర్ కమ్ హ్యూమనిస్టు.

పుట్టినా చచ్చిపోలేనివాళ్ళు ఇద్దరే ఉన్నారు ఈ దేశంలో - నిరుద్యోగి.

బీద ఎన్.జి.వో

ఒకడు కనుచీకటితో, ఒకడు పెనుచీకటితో చచ్చిపోతూంటాడు.

ఒకడికి మనస్సుతో బాకీ తీరదు.

ఒకడికి ప్రభుత్వంతో బాకీ తీరదు.

ఎప్పటికన్నా ఉద్యోగం దొరకదా అని నిరుద్యోగి మనస్సు.

ఎప్పటికన్నా ఉద్యోగం తరగదా అని ఎన్.జి.వో మనస్సు.

భారతీయ కర్మసిద్ధాంతానికీ, ఆశావాదానికీ ప్రత్యక్ష సాక్షులు నిరుద్యోగులు.

గాయత్రి తన ఆఫీసులో ఉద్యోగం దొరుకుతుందేమో ప్రయత్నిస్తానంది -

గాయత్రీ, దీ టైపిస్టు - ప్రయత్నిస్తే వెంకట్రావు బియ్యేగారికి ఉద్యోగం.

గాయత్రిగారు వెళ్ళి మరో సావిత్రిగారి భర్తగారిని అడుగుతారు.

"మాకో బడుద్దాయి అన్నయ్య ఉన్నాడు - వాడికో ఉద్యోగం"

"పిప్పరమెంట్లు పంచడమా ఉద్యోగమంటే?"

"కాదండీ కాదు"

"ప్రపంచంలో బడుద్దాయిలు చాలామంది ఉన్నారు"

"ఉన్నారండీ. ఉన్నారు"

"బడుద్దాయిలందరూ ఓ సంఘంగా చేరి - 'బడుద్ధాయిలుగా తయారవటం - వాటి ఉపయోగాలు' మీద స్కూళ్ళు నడిపితే బావుంటుంది"

"ఓహోహో! తమరెంత బాగా సెలవిచ్చారు!"

"బడుద్ధాయిలంతా బడిపంతుళ్ళుగా చేరితే బాగుంటుంది."

"ఆహాహా! ఏం తెలివి మీది!"

మనస్సులో - (ఇప్పుడంతే జరుగుతోందండీ!)

"బడుద్ధాయిలందరూ రాజకీయ నాయకులయితే బాగుంటుంది"

"ఒహో హోహో! ఎంత ఎంత బాగా చెపుతున్నారు!" మనస్సులో (ఇప్పుడదే చేస్తున్నారండీ!)

"నేనన్నీ బాగా చెప్తున్నానా?" "చిత్తం. చిత్తం. మీరెప్పుడూ బాగానే చెప్తారు."

"నువ్వు మంచిదానివి కనుక అలా అంటున్నావు. మీ బడుద్ధాయి అన్నయ్య పేరేమిటి?"

"వెంకట్రావు బియ్యే."

"వాణ్ణి రేపోసారి రమ్మను. వాడు పూర్తిగా బడుద్ధాహ్యి అవునో కాదో చూస్తాను."

"చిత్తం.. చిత్తం?"

రేపు నా వెధవత్వానికి టెస్ట్.

టెస్టు వన్. ఈ ప్రపంచాన్ని బాగుచేయాలంటే ఏం చెయ్యాలి వెంకట్రావు బియ్యే?

"చిత్తం. చిత్తం. తెలివైన వాళ్ళనుకుంటున్న వాళ్ళందరినీ ఉరితీయాలండి"

"రైట్. ఒక మార్కు - నువ్వు ఫూల్ వే"

మనస్సులో: (ప్రపంచంలో అంతా వాళ్ళే!)

టెస్ట్ టూ: ప్రపంచమంతా మహా సముద్రంలాగ కనిపించాలంటే ఏం చెయ్యాలి వెంకట్రావు బియ్యే?

"చిత్తం. మీరు పది గ్లాసుల సారా తాగాలండీ"

"రైట్.. రైట్.. రెండు మార్కులు. నువ్వు డబుల్ ఫూల్‌వి"

మనస్సులో : (ఈ వెధవకి నేను నిజంగా తాగుతానని తెలీదు!)

టెస్ట్ త్రీ: మనదేశం బాగుపడాలంటే ఏం చెయ్యాలి వెంకట్రావు బియ్యే?

"చిత్తం చిత్తం. మీరు రాష్ట్రపతి కావాలి"

"రైట్. రైట్. రైట్. మూడు మార్కులు. నువ్వు ట్రిబుల్ ఫూల్‌వి"

మనస్సులో: (కలల్లో నేను పదిసార్లు రాష్ట్రపతిని అయిన సంగతి వీడికి తెలీదు)

"ఓహోయ్ వెంకట్రావు బియ్యే - నీ వెధవత్వం రుజువయిపోయింది నీకు ఉద్యోగం ఇచ్చాం"

అమ్మో! ఉద్యోగం వచ్చింది.

ఉద్యోగం! ఉద్యోగం!!

ఉద్యోగంతో సంతోషం వచ్చింది.

సంతోషంతో సంరంభం వచ్చింది.

వెంకట్రావు బియ్యే, వెంకటాద్రి మెట్రిక్ ఫెయిల్డ్ కింద ఉద్యోగి.

వెంకట్రావు బియ్యే, వెంకటాద్రి కళ్ళు కదిపితే కదుల్తాడు.

వెంకటాద్రి తుమ్మితే వెంకట్రావు బియ్యే లేచి నిలబడి తుమ్మును గౌరవిస్తాడు.

వెంకటాద్రి తుమ్మకీ, వెంకటాద్రి కుర్చీకీ, వెంకటాద్రి హోదా ఉంది.

అయినా వెంకట్రావు బియ్యే ఉద్యోగి

ఆహా! ఆహా! ఓహోహో!

లలలా లాలా లూలాలాలా లూలూలూ

లులులూ లలాలు లలా లాలా లూలూలూ -

రేపటికి గాయత్రి మేనేజర్ని కలిసి -

'గాయత్రి మేనేజరు' అంటే -

గ్రామరు తప్పు కాదటయ్యా బాబూ.

కాదు - కాదు తెలుగులో నా కెప్పుడూ మంచి మార్కులొచ్చేవి.

గాయత్రి మేనేజరు - గాయత్రి ఆఫీసుకు మేనేజరు.

ఉదా: వెంకట్రావు ఉద్యోగం - వెంకట్రావు సంతోషానికి ఉద్యోగం - వెంకట్రావు మనస్సుకి - డూ వెంకట్రావు మెదడుకి - డూ వగైరా.

రేపు సరిగ్గా గడిస్తే - అబ్బ! ఎల్లుండికి నేను మనిషినవుతాను.

వెంకట్రావు బియ్యే విల్ బికమ్ ఎ మాన్.

ఎ'మాన్' ఆఫ్టరాల్ -!

అనగా - రేపు ఇంటర్వ్యూ సరిగా జరిగితే - ఎల్లుండికి -

## (5)

***సుందరి***

నీ నవ్వులో వెయ్యి వసంతాలు -

నీ యవ్వనం నందనవనం

నీ కన్నులలో వెన్నెల వన్నెలు.

- ఇలా ఎన్నయినా చెప్తాడు వేణూ.

నాలో ప్రతికదలికకీ కొత్త అందం ఉందంటాడు.

నాలో ప్రతిమార్పుకీ కొత్తపదాన్నీ, కొత్తభావాన్నీ అలంకరిస్తాడు.

వేణూనే ప్రేమించానో, వేణూలో కవినే ప్రేమించానో అర్థం కాదు.

'జీవిత రహస్య మార్గములలో వదలని కోరికలాంటిదానివి నీవు' అన్నాడు ఒకరోజు.

అలా అతనంటే ఎంతో బావుంది.

ఆ రోజు ఎంతో సంతోషించాను.

అలా ఇదివరకే ఎవరో కవి మరెవరో ప్రేయసిని అనేశారని తరువాత తెలిసింది.

అయినా వేణూ అన్నాడు కనక బాగుంది.

వదలని కోరిక -

వణికే ఆశలు -

ఇలా ఎన్నో మాటల్ని పేరుస్తాడు వేణు.

ఎన్నో భావాల్ని కూర్చుతాడు.

ఎన్నో భావాల్ని ఊహించి, అన్నీ చక్కగా ఒకదాని వెనక ఒకటి అమరుస్తాడు.

వేణు మాట్లాడితే గుడిలో గంటలు కదిలినట్టు -

ఒడిలో పంటలు ఒరిగినట్టు -

'మాట్లాడు మాట్లాడు' అనాలనిపిస్తుంది.

***స్త్రీకి అందమైన మగాడి కంటే, అందాన్ని వర్ణించగల మగాడు ప్రియుడు కావడంలో తృప్తివుంది.***

అందం. అందం.

అందంలేని ఆడది ఎలా బ్రతకగలదో అర్థంకాదు నాకు.

పిటపిటలాడే యౌవన మదమన్నా ఉండాలి.

ప్రియతముడయిన ప్రియుని కౌగిలన్నా ఉండాలి.

వేణూ నవ్వుతాడు.

అతని కళ్ళూ వేరుగా నవ్వుతాయి -

అతనిలో రెండే అత్యంత ప్రియమయినవి నాకు.

ఆ కళ్ళు -

ఒంపులు తిరిగి నుదుటిని పకరించే ఉంగరాల జుత్తు.

అతను ఉద్రేకపడి ఇటు తల తిప్పినప్పుడల్లా ఉంగరాల జుత్తు తొందర పడుతుంది.

ఆ కళ్ళని చూస్తే నాకూ మత్తు కమ్ముకుంటుందేమోనన్న భయం.

యౌవనానికి వసంతకాలం ఇదేనంటాడతను.

'ఇదే ఇదే' అని వంత పాడుతుంది మనస్సు.

ఇంత సుఖం జీవితంలో ఎవరన్నా అనుభవించారా?

నిజానికి జీవితానికి సుఖం ఉంటుందని తెలీనివాళ్ళు చాలామంది ఉన్నారు.

ఉదాహరణ: గాయత్రీ, అన్నయ్య.

జీవితమంతా సుఖమే అనేవాళ్ళున్నారు.

ఉదాహరణ: నేనూ, వేణూ.

ఒహోహో! ప్రేమలో ఎంత తియ్యదనం ఉంది.

ప్రేమగురించి నాకూ ఏమీ తెలిసేదికాదు మొదట.

'18 ఏళ్ళు వచ్చినా ప్రేమగురించి తెలీదా!' అని నవ్వాడు వేణు.

అప్పుడు సిగ్గుపడ్డాను.

ఆ తర్వాత వేణూ, సినీమాలు మరికొన్ని చిన్న చిన్న పుస్తకాలు 'ప్రేమ' పాఠాల్ని నేర్పాయి.

ఇంత చక్కని 'ప్రేమ' ఉండగా 'కష్టాలో' అని ఏడుస్తారెందుకో కొందరు.

"అవి కష్టాలుకాదు. ప్రేమలేదన్న విచారం. ప్రేమించాలన్నా నాలాంటి వ్యక్తి దొరకవద్దూ?" అంటాడు వేణు.

వేణూ ఏం మాట్లాడినా అందంగా, ఒక గేయంలాగ, పాటలాగ, పల్లవిలాగ ఉంటుంది.

పెదాల్ని విలాసంగా కదిపి, తనవేపు అందర్నీ ఆకర్షించుకుంటాడు.

నిజమే. నిజమే. ప్రేమ లేకపోవడమే కష్టం అంటే అనాలనిపిస్తుంది.

నయం. నయం. కష్టాలంటే ఏమిటో నాకు ఇంత త్వరగానే తెలిసిపోయింది.

55 ఏళ్ళ తర్వాత నాన్నకి కష్టాలు తెలిశాయి.

నలభయ్యేళ్ళకి అమ్మకి తెలిశాయి.

అక్కయ్యకి 20 ఏళ్ళకే తెలిశాయి.

సరి. అన్నయ్యే ఓ పెద్ద కష్టం.

నన్ను దేవుడు - అంతకుమించి వేణూ - కష్టాలబారి నుంచి తప్పించారు.

అద్దంలో నన్ను నేను చూసుకుంటే ఎంతో గర్వం కలుగుతుంది.

నాలాంటి దాన్ని వేణూ ప్రేమిస్తున్నందుకు

నేను అందంగా పుట్టినందుకు

అందాన్ని త్వరగానే గుర్తించినందుకు -

అందాన్ని సద్వినియోగం చేసుకోగలుగుతున్నందుకు

"చూడమ్మా అక్కయ్య కష్టాలు! నువ్వు చదువు పూర్తిచేసుకు ఉద్యోగం చేస్తే" అంటుంది అమ్మ.

అమ్మ కళ్ళనీ, ఆమె దుఃఖాన్నీ చూసినప్పుడు ఏమీ అనాలనిపించదు.

కానీ మనస్సు నవ్వుకొంటుంది.

నవ్వుకోదూ మరి? ఉద్యోగం చేసి ఆ నలుగురిని పోషించడానికి చదువు.

"అందమైనవాళ్ళు ఉద్యోగం చేయకూడదు. అందానికే ప్రపంచం ఊడిగం చేయాలి" అంటాడు వేణూ.

ఎంత నిజం ఆ మాట!

నేనెందుకు ఉద్యోగం చేయాలి?

నేనెందుకు పోషించాలి అంత సంసారాన్ని?

రోజూ వేళకి భోజనం లేక రాత్రీ పగలూ ఆఫీసు పని చేసి చేసి అక్కయ్యలాగ శల్యంలాగ అయిపోవాలి.

ఓహో! ఆ అమ్మాయ్ కష్టపడుతోందే - అని అంతా అనుకోవాలి.

వేణులాంటి వాళ్ళెవ్వరూ స్నేహితులుగా ఉండరప్పుడు.

మల్లెపువ్వులు పెట్టుకోవడానికి తీరిక ఉండదు.

జార్జెట్ చీరెలు కట్టుకోవడానికి అవకాశం ఉండదు.

ఛీఛీ! ఉద్యోగం చెయ్యడంకంటే చావడం మంచిది.

మెట్రిక్‌తో అమ్మ చదువును ఆపమంటే, అక్కయ్యే కాలేజీలో చేర్పించింది.

నెలకి చాలా ఖర్చు మరి.

పట్నంలో చదువు.

ఇక్కడికి 40 మైళ్ళలో పల్లె.

హాస్టల్‌లో ఉండడం.

పాపం, అంత డబ్బు పంపాలంటే అక్కయ్యకి కష్టమే.

అక్కయ్యని చూస్తే జాలేస్తుంది నాకు.

ఒక్కొక్కప్పుడు దుఃఖమూ వస్తుంది.

చిన్నప్పుడు నాకంటే అందంగా ఉండేది అక్కయ్య.

పట్టుదలతో వంపు తిరిగిన పెదాలు ఇంకా అందంగా ఉండేవి.

మరి ఎలా అయిపోయిందప్పుడు?

ఈ కుటుంబం ఎలా గడుస్తుందన్న బెదురుతో పిరికి చూపులు చూసే కళ్ళు.

నీరసించిన పట్టుదలతో వణికే పెదాలూ -

మిసమిస పోయిన వళ్ళు.

20వ ఏటనే 40 ఏళ్ళ ముసిలిదయిపోయింది.

రేపు తన పుట్టినరోజని ఊరంతా అంటుంది.

ఏ పుట్టిన రోజయినా దానికి సుఖం తెచ్చిపెట్టిందిలేదు.

ఈ పుట్టిన రోజూ అంతే.

అమ్మ మీద ప్రేమకీ, అక్కయ్య మీద ప్రేమకీ నేనంత త్యాగం చెయ్యలేను.

త్యాగం చేయలేను. చేయలేను.

అక్కయ్యలాగ తయారు కాను.

ఉద్యోగం చెయ్యను.

నేనిలా ఉంటే చాలు.

నేనూ పెళ్ళి చేసుకుంటాను.

భర్త ఉద్యోగం చేస్తే, అతనికి నేను ఉద్యోగం చేస్తాను.

అక్కయ్య అలా ఎందుకయిపోయిందా అని విచారం నాకు.

అవును, అవకపోతే ఎలాగ?

ఎవరో ఒకరు కాకపోతే కుటుంబం ఎలాగ గడుస్తుంది?

అక్కయ్య లేకపోతే కుటుంబం నాశనమయిపోయేది.

కుటుంబం నాశనం కాకుండా చూడటానికి అక్కయ్య నాశనమయిపోయింది.

ఇప్పుడు నేనూ నాశనం కావాలి.

అమ్మో! అంత త్యాగమే!

నా వల్లకాదు బాబూ!

నన్ను నేను పాడుచేసుకోను బాబూ!

"అమ్మా! సుందరీ మేమంతా చచ్చిపోతున్నామమ్మా!" అదిగో అమ్మ ఏడుస్తోంది.

"చచ్చిపోకండి అక్కయ్య ఉంది."

"అక్కయ్య చచ్చిపోయింది"

"చచ్చిపోయిందా?"

"అవును. బాధ్యతల్ని భరించలేక చచ్చిపోయింది."

"అయితే అన్నయ్య ఉన్నాడు."

"అన్నయ్య దారిద్ర్యం బరువుతో రెండేళ్ళ క్రిందటే చచ్చిపోయాడు."

"మరి.. మరి.. నాన్న:

"నాన్న పదేళ్ళ క్రిందటే.."

"అయ్యో! నేనా? నేనా మిగిలింది -"

"అవును. నువ్వేనమ్మా సుందరీ! నువ్వే ఈ కుటుంబానికి మిగిలింది"

"నేను చచ్చిపోను. చచ్చిపోను"

"అక్కయ్యలాగ ఈ ఇంటిని పోషించవూ?"

"పోషించాలని ఉంది. అక్కయ్యలాగ చచ్చిపోవాలని లేదు"

అమ్మో ఈ త్యాగానికి ఎంత ఖరీదు.

చావు -

ఇంత అందంతో

ఇంత యవ్వనంతో -

వేణూలాంటి ప్రేమికుని ప్రేమతో -

ఇంత చదువుతో -

అమ్మో - నాకు సాధ్యంకాదు.

"నేను త్యాగం చేయలేనమ్మా. అక్కయ్య కాలేను. అన్నయ్య కాలేను"

"అయితే మేమే చచ్చిపోవాలి -"

"ఏమో! ఏమో మీ ఇష్టం"

"నీ తల్లి నీకుండదు"

"వేణూ ఉన్నాడు"

"నీ నాన్న నీకుండడు"

"అందం ఉంది"

"నీ అక్కయ్య?"

"యవ్వనం ఉంది"

"నీ అన్నయ్య?"

"చదువుంది"

ఓహో? చదువుల్తో ఎంతలాభం వచ్చింది నాకు.

ఇంత గొప్ప గుణాల్ని బీద కుటుంబపు క్షేమానికి ఆహుతి చెయ్యకూడదని అర్ధమయింది.

18 ఏళ్ళలోనే 180 ఏళ్ళ విజ్ఞానం వచ్చేసింది.

బీదవాళ్ళు కమ్మని నేను చెప్పానా?

బీదతనాన్ని కోరుకున్నానా?

నేను బీదగా లేనే! - బాగానే ఉన్నానే!

అది నీ బాగుకాదు ఇడియట్! మీ అక్కది - మనస్సులో మళ్ళీ మంచిభాగం.

అందంగానే ఉన్నానే!

అది నీ అందం కాదు ఫూల్. మీ అక్కది

ఏమో! ఏమో!

నాకు బాగు. నాకు రక్ష. నాకు శ్రేయస్సు.

నేను బ్రతకాలి - నేను బ్రతకాలి.

అందంగా బ్రతకాలి.

వేణూతో బ్రతకాలి.

వేణూకోసం బ్రతకాలి.

ఇంత తియ్యటి బ్రతుకు వదులుకోలేను.

మీ అక్కయ్య ఎముకల చుట్టూ ఎండిపోయిన మాంసం నీ కండల చుట్టూ పేరుకుంది - యౌవన మదం కింద నలిగిపోతున్న మంచి మనస్సు (మ.మ)

మీ అక్కయ్య చెక్కిళ్ళ ఎరుపు రెట్టింపయి నీ చెక్కిళ్ళలో పేరుకుంది - (మ.మ)
మీ అక్కయ్య యౌవనం విరిగిపోయి, నీ యౌవనం గట్టిపడింది - (మ.మ)
మీ అక్కయ్య చచ్చిపోయి, నిన్ను తయారుచేసింది - (మ.మ.)
అయితే? అయితే?
అక్కయ్య ఎలాగూ నాశనమయింది.
నేనూ ఇపుడు నాశనం కావాలా?
కృతజ్ఞత చాలదా?
అక్కయ్య నాశనమవడానికి కారణం; నేను పెరిగాక నేనూ నాశనమవడమే అయితే - నా కోసం ఎందుకు నాశనం కావాలి?
వాహ్వా! ఎంత బాగా వాదిస్తోంది వయస్సు!
***మంచి డిఫెన్స్ లాయరు యవ్వనం!***
***బీద, ముసిలి పబ్లిక్ ప్రాసిక్యూటరు 'త్యాగం'***
జీవితం అనే న్యాయస్థానంలో త్యాగానికి యౌవనం జవాబు చెప్తోంది.
విధి అనే న్యాయమూర్తి నిర్ఘాంతపోతున్నాడు.

శలవలకి ఇంటికొచ్చిన నాలుగురోజులూ చీదరే!
ఎంతసేపూ ఇక్కడ కష్టాలూ, ఇబ్బందులూ, బాధ్యతలూ -
అక్కడ అందం, స్వర్గం, ఆనందం, సినిమాలూ.
మనసులో వేణూని తోడు తెచ్చుకున్నాను కనక బ్రతుకుతున్నాను.
పైకి బీదకుటుంబంలో సుందరిని.
మనస్సులో సౌందర్యాధి దేవత.
వేణూ ప్రేయసి.
ఓహో! బీదతనం జీవితాన్ని ఎలా బెదిరిస్తుంది?
***లొంగిపోతే మనిషి బీదతనానికి బానిసయి పోతాడు.***
***లొంగని మనిషికి బీదతనం బానిసయిపోతుంది.***
అక్కయ్యా, అన్నయ్యా అంతా లొంగిపోయారు.
నేను లొంగిపోలేదు.
అసలు ***బీదతనం మనస్సులోంచి ప్రారంభమవుతుంది.***
బీద, దీన రాజకీయ బాధితుడి కూతురు సుందరి - మనస్సులో రాణి.
బీద, దీన నిరుద్యోగి చెల్లెలు సుందరి - మనసులో రంభ.
భలే! భలే!
బీదవాళ్ళ మధ్య ఇంత ధనవంతురాల్ని ఎలా సృష్టించావయ్యా భగవంతుడా!
'30 సంవత్సరాల వరకు ప్రేమించాలి' అని దేవుడు అన్నాడు.

30 తర్వాత ఏం చేయాలి?

అంట్లు తోమాలి.

మిస్. సుందరీ, ది క్వీన్ ఆఫ్ బ్యూటీ మారిపోయి మిసెస్ సుందరమ్మా, ది మెయిడ్ ఆఫ్ అంట్స్ (అంట్లు)

పేడ పిడకలు చేయాలి.

పిల్లల్ని కనాలి.

వాళ్ళు 'మ్మొర్రో' అని ఏడుస్తూంటే 'వెధవల్లారా - నా ప్రాణాలు కొరుక్కుతినేస్తున్నార్రరో' అని ఏడవాలి.

వేణూ అంట్లు తోమనిస్తాడా?

లేకపోతే అతనే తోముతాడు.

ప్రబంధ కవియగు వేణుగోపాలుడు అంట్లు తోమును.

తీరిక సమయంబుల పిల్లలకు పాలు పట్టును.

తదుపరి ప్రేమ కవిత్వమును వ్రాయును -

నవ్వొస్తుంది భవిష్యత్తు గురించి ఆలోచిస్తే.

భవిష్యత్తు మన గురించి ఇప్పటికే ఆలోచించేసి ఉంటుంది.

సుందరి అందముగా నుండునని వ్రాయగా నేను అందంగా నుండలేదా?

వేణూని ప్రేమించినట్టు వ్రాసి ఉంది కదా

మరి పిల్లలు? - కష్టాలు? - అంట్లు? ఏడుపులు?

వద్దు బాబూ - వద్దు.

పిల్లలు వద్దు.

కష్టాలు వద్దు.

మరేం కావాలి?

ప్రేమ కావాలి.

వేణూ కావాలి.

వేణూ పిల్లల్ని కనడు.

కవిత్వాన్ని కంటాడు.

నేను కలలు కంటాను.

మగపిల్లల్ని కనడమా?

ఆడపిల్లల్నా?

కలకి ఆడామొగా భేదం లేదు.

'కల రావడం అంటే కోరికలు ఎక్కువ కావడం' అని సైకాలజీ లెక్చెరర్ అంటాడు.

నాకొకసారి కోడినయినట్టు కల వచ్చింది.

పిల్లల కోడిమాత్రం కాదు.

కోడినయి ఇల్లెక్కి 'కొక్కొరోకో' అని అరవబోతే ఆ మాటే రాలేదట!

'కొక్కొరోకో' అనడానికి బదులు 'ఒక్క నేనే!' అన్నానట.

'ఒక్క నేనే' అంటే?

నాకే సుఖం.

నాకే సంతోషం - అనా?

ఏమో? నేను అరిచినా తెల్లవారలేఅని కోపం వచ్చిందట.

కోపం వచ్చి అరవటం మానేశానట.

నా కోపం చూసి చీకటికి నవ్వొచ్చిందట.

పక్కున నవ్వితే తెల్లటి పళ్ళలో వెలుగు కనిపించిందట.

అదే తెల్లవారడమన్నమాట!

ఇంతలో నేనో కుంపటి దగ్గరకి వెళ్ళాను.

దానిని చూడగానే నాకు మరో విషయం గుర్తుకొచ్చింది.

కోడీ, కుంపటీ.

నా కోడీ కుంపటీ లేనిదీ తెల్లవారదని వెనకటికి ఓ ఇల్లాలు అనుకొందట.

అది గుర్తుకొచ్చింది.

కానీ తెల్లవారిపోయిందే!

ఏమిటో వెధవ కలలు.

వెధవ ఆలోచనలు.

ఆశలు ఎక్కువయితే - కలలు కంటాము.

పిల్లల్ని కనడం కన్నా కలలు కనడమే నయం.

కోడికల వేణూకి చెప్పాలి.

వేణుకి కలలు వస్తాయా!

ప్రతి కలలో నేనే కనిపిస్తానంటాడు.

అప్పుడే ఇక్కడికి వచ్చిన వారం రోజుల్లో పది ఉత్తరాలు వ్రాశాడు.

ఉదయం, మధ్యాహ్నం నాకు ఉత్తరాలొస్తే అమ్మ ఆశ్చర్యపోతోంది.

అక్కయ్య నిన్న రాత్రే చెప్తోంది.

అక్కయ్య నన్ను అడుగుతుందేమోనని భయం వేసింది.

అక్కయ్య నా వేపు సూటిగా చూసింది. ఏమీ అడగలేదు.

అలా చూడకుండా, అడిగితేనే బావుంటుందనిపించింది తర్వాత.

మాటల్లో అడగడానికి వీలులేని వాటిని చూపుల్తో అడుగుతుంది.

అక్క కళ్ళల్లో 'ఎక్స్‌రే' శక్తి ఉంది.

కళ్ళు తప్పించుకు పారిపోయాను.

మళ్ళీ సాయంకాలం ఉత్తరం, వేణూ దగ్గర్నుంచి.

ఇక అక్కడ ఉండలేడట.

రేపే వచ్చేస్తానన్నాడు.

వచ్చేసి?

"వచ్చేస్తాను. నన్నేం చేసినా నీ ఇష్టం" అన్నాడు.

వస్తే ఎలాగ? అక్కయ్యకి తెలిస్తే ఎలాగ?

అమ్మకి తెలిస్తే ఏం దారి?

వచ్చి ఏం చేస్తాడు? ఎక్కడుంటాడు?

అక్కయ్య కిదంతా చెప్పేస్తే?

తనకి లేని ప్రేమ నాకు ఉందని ఆమె మనస్సు ఏడుస్తుందేమో!

ఛీ..ఛీ!

అక్కలాగ పవిత్రంగా ఉండలేక పోయినందుకు నేనే ఏడుస్తున్నానేమో!

అవును. నేనే ఏడుస్తున్నాను.

ప్రేమవల్ల ఏడుస్తున్నాను.

ప్రేమతో ఏడుస్తున్నాను.

ప్రేమవల్ల ఎంత భయం? ఎంత బెంగ?

దొంగతనంగా భయం.

దొంగతనంగా బెంగ.

ఎవ్వరూ చూడకుండా ఏడవాలి.

భగవంతుడా!

ప్రేమవల్ల బాధకంటే దారిద్ర్యంవల్ల బాధ ఎంత సుఖం.

అక్క బాధలో సుఖం ఉంది.

నా సుఖంలో బాధ ఉంది. రేపు. రేపు.. రేపు.

నా జీవితంలో రేపు చెరిగిపోతే బాగుండును.

హఠాత్తుగా రేపు ఎల్లుండయిపోతే!

అయ్యో! ఒక్క క్షణం గడిచిపోయింది.

రేపు! ఇష్టంలేని రేపు వేపు ఒక్కొక్క అడుగు వేస్తోంది కాలం.

ప్రేమతో ఉక్కిరి బిక్కిరయిన మనస్సుకి రేపు అగ్ని పరీక్ష.

ప్రేమ గొప్పతనానికీ, త్యాగం గొప్పతనానికీ రేపు తీర్పు.

రేపు.. రేపు.

వద్దు

●●●

## (6)

**రెండవ రోజు హనుమంతయ్య**

ఒక్కక్షణంలో ప్రాణం పోయేది.

నయం! నేను చచ్చిపోలేదు.

కోరికలు చచ్చిపోయాయి.

నేను చచ్చిపోతే బాగుణ్ణని అనుకునేవాళ్ళున్నారేమో!

కొందరికి మరికొందరు బ్రతికి సంతోషాన్ని కలిగిస్తారు.

నాలాంటివాడు చచ్చిపోయినా సంతోషించే వాళ్ళున్నారు.

లారీ నాకు తగిలిందో, నేనే లారీకి తగిలానో గుర్తులేదు.

సంతోషమనే సారాని ఆరుపీపాలు తాగాను.

ఉత్సాహమనే నల్లమందుని పది తులాలు వేసుకున్నాను.

కోరిక తీరుతుందనే ఆలోచనతో మత్తెక్కిపోయాను.

50 ఏళ్ళ జీవితంలో ఇవాళంత మంచిరోజు లేదనుకున్నాను.

50 జీవితంలో ఇవాళంత చెడ్డరోజుకూడా లేదు.

రేపు తెల్లవారేసరికి 'ప్రముఖ రాజకీయ నాయకుడు హనుమంతయ్య దుర్మరణం' వార్త.

'ప్రముఖ' అని మనకి వాడరు - మంత్రులకి, ఇంకా పెద్దవారికి.

'సాదా రాజకీయ బాధితుడు హనుమంతయ్యగాడి చావు'

నయం. నయం. బ్రతికిపోయాను.

సైకిలుకొనే సరదాలో సైకిలుకంటే వేగంగా వెళ్ళాను.

లేక పరుగెత్తానా?

కాదు. కాదు. ముసలి హనుమంతయ్య నడుస్తూనే ఉన్నాడు.

కోరికల్తో పూటెక్కిన మనస్సు లంఘించి పారిపోయింది.

మనస్సు వెనుక నేనూ

నా వెనక లారీ.

సామాన్లు మోసే లారీ వెనక

కోరికల్ని మోసే లారీ ముందు.

సామాన్లు మోసే లారీ కోరికల్ని మోసే లారీని గుద్దేసింది.

కోరికల్ని మోసే లారీ పాతది.

కోరికలంత పాతది.

అందుకని లారీ పడిపోయింది.

కోరికలు చచ్చిపోయాయి.

కోరికల లారీ పడి, చటుక్కున లేచింది.

చుట్టూ చెదిరిపోయిన కోరికల్ని వెదుక్కొంది.

తిన్నగా చెప్పవయ్యా బాబూ!

సరే. సరే.

రూపాయల రూపంలో ఉన్న కోర్కెల్ని వెదుక్కొంది.

టూకీగా జరిగిన టాకీ ఇది -

హనుమంతయ్య అను రాజకీయ బాధితుడు లారీక్రిందపడెను.

పడుటతోడనే పెక్కు గాయములు తగిలెను -

తగిలినతోడనే దిగ్గున లేచెను.

జేబునుంచి తుళ్ళిపోయిన 50రూపాయలను వెదుక్కుని, లెక్కపెట్టుకుని, జేబులో పెట్టుకుని మళ్ళీ పడిపోయాడు.

ది ఫాల్ ఆఫ్ హనుమంతయ్య.

ది ఫాల్ ఆఫ్ డైజైనర్స్.

శరీరానికి గాయాలు బాగా తగిలినట్టున్నాయి.

ఒక కన్ను కనిపించడంలేదు. కట్టు కట్టేశారు.

కాలు కదలడం లేదు.

తలకీ గాయం తగిలిందన్నారు ఎవరో.

తలకేమిటి? మనస్సుకి గాయం తగిలింది.

తల గాయం బాగుచేయడానికి మందులున్నాయి.

మనస్సు గాయం నుంచి బాగుచేయడానికి మందుల్లేవు.

ఇదేమిటి? ఇక్కడంతా లోషన్ వాసన.

ఆసుపత్రిలో పడేశారు కాబోలు.

పదిమంది డాక్టర్లు నా చుట్టూ మూగారు.

పదిమంది డాక్టర్లు చేత ఎప్పుడన్నా జన్మలో నాకు వైద్యం చేయించుకోగలనా?

ముగ్గురు పోలీసులు వచ్చారు.

అందరూ 'ప్చ్' అంటున్నారు.

పోలీసులు ఇదివరకు జైలుకు తీసుకువెళ్ళడానికి వచ్చారు.

ఇప్పుడు సానుభూతి చూపడానికి వచ్చారు.

"పూర్‌మేన్! పూర్‌మేన్!"

"నీ మొహం. ఇప్పుడే నేను రిచ్‌మాన్"

ఎంతమంది డాక్టర్లు వచ్చారో చూడు.

ఎంతమంది పోలీసులో చూడు.

ఎంతమంది మనుషులో చూడు.

పేపర్లలో ప్రకటనలు.

చచ్చిపోతే పెద్దబొమ్మ వేసే వారేమో!

ఓహో! ది ప్రముఖ రాజకీయ పీడిత ఆఫ్ ఫలానా ఫలానా ఊర్ - డైడ్

ఇంగ్లీషు సరిగ్గా రాదు నా మొహానికి.

వెంకటరావుకి ఇంగ్లీషు వచ్చు.

పేపర్లో ఆ విషయం చదువుకొంటాడు.

చదువుకుని సంతోషిస్తాడు.

మా నాన్న బ్రతికుండి డబ్బు సంపాదించలేదు.

పేరు సంపాదించలేదు.

చచ్చిపోయిన పత్రికల్లోకి ఎక్కాడు.

- ఇవాళ చెడ్డరోజు కదూ?

అదృష్టానికి అతి దగ్గరగా వచ్చి తప్పిపోయాను.

కీర్తి నన్ను వరించబోయి దూరంగా వెళ్ళిపోయింది.

కీర్తి లారీటైరు రూపంలో వచ్చింది.

పోనీ ఇదంతా నీ అదృష్టమే.

ఆసుపత్రిలో మంచి పరుపు.

"ఇప్పుడెలా ఉంది సార్?"

"మంచి పళ్ళరసం తాగుతారా మిష్టర్ హనుమంతయ్య?"

లారీల కంపెనీ మేనేజరు వచ్చి చేతులు కట్టుకుని నిలబడతాడు. నన్ను చూసి భయపడతాడు.

"ఫస్టాస్ ద్రాక్షపళ్ళ జూస్ తాగుతారా సార్" ప్రశ్న.

ఓహోహో ఒక కాలు విరిగిపోతే బావుణ్ణు.

జీవితమంతా కాళ్ళు విరిగిపోతూ ఉంటే -

"ఎప్పుడూ పళ్ళరసం తాగు హనుమంతయ్యకు నేను మరల కాళ్ళు విరిగెను."

"ఎప్పుడూ పళ్ళరసం తాగు హనుమంతయ్యకే ఇప్పుడు గంజినీళ్ళు మాత్రమే ఇవ్వడమయినది."

ఛ ఛ! ఒక్కసారే కాలు విరగాలి.

అందరి జాతకంలో ఈ రాజభోగం ఉండదు.

'హనుమంతయ్య కాలు విరిగి రాజు అవును' - అని దేవుడు రాసిపెట్టాడు.

హనుమంతయ్య ఆసుపత్రిలో రాజు అయ్యాడు.

మంత్రిగారు వస్తున్నారు.

మంత్రిగారట.

నన్ను చూడడానికే - అమ్మో! అమ్మో!

"ఎందుకండీ మంత్రిగారు వస్తున్నారు?"

"మిమ్మల్ని చూడడానికేనండీ హనుమంతయ్యగారూ!"

అమ్మో! ఇంత సంతోషంతో ఈ ముసిలిగుండె పగిలిపోదూ?

ది మంత్రి అప్పల్నరసయ్యా కేమ్.

ఈ హనుమంతయ్యకి ఓ న మ ' వచ్చు.

అప్పల్నరసయ్యకి 'ఓ న' మాత్రమే వచ్చు.

అందుకే అప్పల్నరసయ్య మంత్రి అయిపోయాడు.

"పంతులు కేటయిపోనాది?" అని మంత్రిగారంటున్నారు.

"వాట్ హేపెండ్ టు ది పంతులూ?" అని మంత్రిగారి ప్రత్యేక కార్యదర్శి అయిన ఒకానొక పంతులు ఇంగ్లీషులోనికి అనువదించాడు.

మంత్రిగారి భాషని అర్థం చేసుకునే యోగ్యత ప్రజలకి లేదు కనుక - దానిని వెంటనే ఇంగ్లీషులోనికి తర్జుమా చేస్తారు.

దాన్ని తెలుగులో అర్థం చేసుకుని ప్రజలు సమాధానాలు చెప్తూంటారు.

ఇప్పుడు "పంతులు కేటయిపోనాది?" అన్నాక -

"అవునండి. లేటయిపోయింది చచ్చిపోవడం" అన్నాను.

మంత్రిగారు నవ్వారు విట్టుకి.

మంత్రిగారు తన చేత్తో కట్టు కట్టిన భుజాన్ని కట్టారు.

నీకేం ఫరవాలేదన్నారు.

"కొల్లకొ తొంగో. నీకేటీ ఫరవాలేదు."

'తొంగో' అన్నమాటకి తన డిక్షనరీలో పదం దొరక్క గిలగిలా కొట్టుకుపోయాడు. మంత్రిగారి తర్జుమాదారుడయిన పంతులు.

అయినా యధాశక్తిన ఇంగ్లీషులో అన్నాడు.

"కామ్లీ 'టొంగో' డోంట్వర్రీ"

అప్పుడు మంత్రిగారు లేచారు.

పోలీసులు మంత్రిగారికోసం లేచారు.

నాకోసం రాలేదు వాళ్ళు.

మంత్రిగారికోసం వచ్చిన పోలీసులు మంత్రిగారితో వెళ్ళిపోయారు.

నేను మిగిలిపోయాను.

"లోషన్ కంపులో హనుమంతయ్య."

మంత్రిగారు తట్టిన భుజం మీద బంగారుపూత పూసినట్టయింది.

"నర్స్! నర్స్!"

"ఏమి సార్? గమ్మున నిద్రపొమ్మా"

"అదికాదు - నర్స్! మంత్రిగారు ఎందుకొచ్చారు?"

"ఏమీ? రాక ఏమి చేస్తురు? - లారీలోనివి ఇన్నూరు పంచదార బ్లాకు బస్తాలు కదా?" అర్థమయింది - అర్థమయింది.

లారీ మంత్రిగారిది.

బస్తాలు బ్లాకువి.

'బ్లాకు' అనగా నలుపు.

నల్ల బస్తాలు - 'నల్ల' అనగా అరవంలో 'మంచివి' నర్సు అరవది.

'మంచి పంచదార బస్తాలు మంత్రిగారివి' అంటున్నది.

ఆ బస్తాల సంగతి ఎవరికీ తెలియదట.

మంచి బస్తాలుకదూ? - అందుకని.

ఓహ్హో అర్థమయింది.

నల్లబస్తాలను మంత్రిగారి లారీ తీసుకు వెళ్తుండగా బీద హనుమంతయ్య దానికింద పడెను.

మంచి బస్తాలు రహస్యంగా నుండుటకై మంత్రిగారు స్వయంగా వచ్చి పలకరించారు.

"బస్తాల లారీ విషయం మరిచిపో హనుమంతయ్య" మంత్రిగారి కార్యదర్శి.

"చిత్తం. చిత్తం."

"అసలు లారీయే లేదను."

"చిత్తం. చిత్తం."

"ఏదో చెట్టుకి గుద్దుకున్నానను."

"చిత్తం. చెట్టుకు గుద్దుకుంటే కాలు విరుగుతుంది కాని -"

మనస్సు విరుగుతుందా?

"చెట్టుకు గుద్దుకోక పోతే చెట్టుమీంచి పడ్డాననవయ్యా"

"చిత్తం చిత్తం నేను చెట్లెక్కనండి"

కోరికల చెట్టుకి ఎక్కుతాను.

వాటిమీంచి పడతాను.

"ఇదివరకు ఎక్కకపోతే ఇప్పుడు ఎక్కాలను."

"చిత్తం. చిత్తం."

"మంత్రిగారు గాంధీగారి అనుచరులు."

"అమ్మో! అలాగా?"

"గాంధీయన్ ఫిలాసఫీ ప్రచారకులు."

"అమ్మెమ్మో! అలాగా!!"

"నువ్వు గాంధీభక్తుడివే."

"చిత్తం. చిత్తం. గాంధీ వల్లే ఇలా ఉన్నాను."

"మంత్రిగారు తనని క్షమించమంటున్నారు. "

"మంత్రిగారే! నన్నే!"

"అవును. గాంధీ భక్తులయిన మంత్రిగారే!"

"ఓహ్హో! ఓహ్హో! అలాగా - అలాగా"

"ఏమంటావు?"

"క్షమించేశాను. క్షమించేశాను. పదిసార్లు క్షమించేశాను"

మొదట నన్ను నేను క్షమించుకున్నాను.

మంత్రిగారు వెళ్ళిపోయారు.

మంత్రిగారి కార్యదర్శిగారు వెళ్ళిపోయారు.

ఎంత రాజభోగం.

ఎంత అదృష్టం

మంత్రిగారు క్షమాపణ చెప్పారు.

నల్లబస్తాలకోసం క్షమాపణ చెప్పారు.

నేనూ గాంధీగారి శిష్యుణ్ణి.

గాంధీగారు ఎందర్ని క్షమించారు. ఎందర్ని ఉద్ధరించారు?

నేను మంత్రిని క్షమించాను.

"ఏమండీ నర్సుగారూ!"

"యస్, యస్."

"నా పిల్లలు వచ్చారండీ?"

"నీ పిల్లలా?"

"అవునండీ పెళ్ళాం కూడా"

"పెళ్ళాం పిల్లలా?"

"అవునండీ నాకు పిల్లలున్నారు"

న్యూస్. న్యూస్. లారీకింద పడ్డ ప్రముఖ రాజకీయ బాధితుడికి పిల్లలు -

ఎందరయ్యా బాబూ!

"ముగ్గురు. ముగ్గురు"

"వాటే పిటీ! పిల్లలు. పిల్లలు"

లారీనుంచి తప్పించుకోలేనివాడివి పిల్లల్నెందుకుకన్నావయ్యా.

లారీ బాధితుడు.

రాజకీయ బాధితుడు.

పిల్లల బాధితుడు.

ఓహో! ఎన్ని రకాల బాధితుడు.

"సార్! సార్ నా జేబులో 50రూపాయలు ఉండాలి సార్."

"అవునవును ఉండేవి" - నర్సు.

"ఉండేవి అంటారేం? - ఇప్పుడు లేవా?"

"లేవు. ఉండవు"

"అదేం? అదేం? అమ్మో అమ్మో"

"ఆసుపత్రి ఖర్చులకు జమకట్టాం. ఇంకా మాట్లాడితే నువ్వే నూర్రూపాయలు ఇవ్వాలి"

మంత్రిగారు క్షమాపణ చెప్పుకున్న వ్యక్తికి డబ్బు బాధ.

నా ఆశలు ఖర్చయిపోయాయి.

నా ఏభయ్యీ పోయాయి.

"సార్! సార్! దయతలచండి సార్. నా ఏభై నా కిచ్చేయండి సార్. దానితో సైకిలు కొనుక్కోవాలనుకున్నాను సార్."

"ఏమీటీ? ఏమీటేమిటీ? ఏమిటేమిటీ?"

"సైకిలు సార్. సైకిలు"

"డాక్టర్! డాక్టర్ పేషెంటు ఏదో అంటున్నాడు డాక్టర్"

"ఏమిటి నర్స్" "పేషెంటు సైకిలు తొక్కుతాడట..."

"హహ్హహ్హ! హ్హహ్హహ్హ! హ్హహ్హహ్హ"

"సారీ మిస్టర్ హనుమంతయ్య! ఇంక నువ్వు సైకిలు తొక్కలేవు"

"అదేమిటండీ. మళ్ళీ ఏభై సంపాదించుకుంటాను"

"అయినా తొక్కలేవు హనుమంతయ్య సారీ!"

"అదేమిటండీ డాక్టరుగారూ! అదేమిటండీ?"

"నీ కాలు విరిగిపోయింది హనుమంతయ్య. ఇంక బాగుపడదు హనుమంతయ్య. సారీ, సారీ"

"అయ్యో, అయ్యో, అయ్యో - నా కాలు.. నాకాలు"

"రాదు. రాదు"

"నా కాలు రాదా డాక్టరుగారూ! నా కాలు.. నా కాలు.. సైకిలు... కోరికలు.. నా కాలు.. నా కాలు.."

(7)

***వెంకటరావు***

నిరుద్యోగం గురించి ఏడిచి ఏడిచి అలసిపోయాను.

ఇంక పెళ్ళి గురించి ఏడుస్తాను.

ఇచట ఏడుపు అనగా ‘చింతించుట.‘

నాలో ‘సెన్సాఫ్ హ్యూమర్‘ ఉందని కాలేజీ కుర్రాళ్ళు అనేవారు.

సెన్సాఫ్ హ్యూమరా? వేరే?

హ్యూమర్ ఆఫ్ సెన్స్.. ఆ!

ఇదీ అదీ కాదు. నాన్సెన్స్!

బుట్టెడు నాన్సెన్స్ ఉంది మెదడులో -

ఏడుపులో నవ్వడం హ్యూమర్ -

ఏడుస్తూ నవ్వడం.

ఏడవలేక నవ్వడం.

నాన్నకి కాలు విరిగితే నవ్వుతాడు.

‘వరే వరే నాకాలు విరిగిపోయిందో హోయ్!‘ -

‘హహహ!‘

ఏం సెన్సాఫ్ హ్యూమర్.

‘గూడ్! గూడ్! నాకు ఉద్యోగం దొరకలేదొచ్చి - హ్హ హ్హ హ్హ!‘

ఏం సెన్సాఫ్ హ్యూమర్!

ఓరి వెధవల్లారా! మాకు లేంది చెప్పి ఏడిస్తే హ్యూమరా!

గాడిదగుడ్డు హ్యూమర్.

అలివేలునడిగితే ‘నాలో అదీ ఉందే‘ అంటుందేమో.

కాలు కుంటయినా, ఆ కుంటిని కప్పిపుచ్చే మంచి గుణాలున్నాయి దానికి.

అమృతంలాగ నవ్వుతుంది.

వెన్నలాంటి మనస్సు. వెన్నకాదు. పోనీ - జున్ను.

వెన్నకంటె జున్ను అంటే నాకిష్టం.

ఎప్పుడన్నా ఎక్కువ విచారం కలిగితే అలివేలు దగ్గరికి వెళ్తాను.

నాకు ఎక్కువ విచారం ఎప్పుడూ కలుగుతూంటుంది.

ఎప్పుడూ అలివేలు దగ్గరకే వెళ్తూంటాను.

కష్టాల బాధితునకు అలివేలు నవ్వు రిలీఫ్ -

కష్టాల వేసవిలో మాడిన వెంకట్రావు అలివేలనే చలవ పందిరి కింద తల దాచుకొనును.

కష్టాలొస్తే అలివేలును చూస్తాను.

అలివేలును చూడాలంటే కష్టాలు రావాలి.

అందువల్ల కష్టాల్ని ఆహ్వానిస్తాను.

ఇవాళో పెద్ద కష్టం -

నాన్నకాలు విరిగిపోయింది,

"అలివేలూ! అలివేలూ! నాన్న కాలు విరిగిపోయింది"

"ఊరుకో బావా! ఏం చేస్తాం - కష్టాలు తప్పవు మనకి"

"అలివేలూ! నాన్న కాలు ఎప్పటికీ రాదు"

"ఊరుకో బావా!"

"నాన్న బ్రతికి బయటపడ్డాడు. అలివేలూ! నాన్న.. నాన్న.."

"ఊరుకో బావా! ఊరుకో, ఊరుకో"

అక్కడికి ఆ బాధ తగ్గుతుంది.

వెంటనే అలివేలు దగ్గరికి బయలుదేరితే -

అలివేలు నాన్న కనిపించాడు.

వేసవికాలంలో రైలింజన్‌లో ఉన్నట్టు -

భిలాయ్ ఉక్కు కర్మాగారంలో ఫర్నీస్ ముందు నిలిచినట్టు -

ఆధునిక మైదాన్ మామయ్య -

"మామయ్యా! నాన్న కాలు విరిగిపోయింది"

"అవున్రా బావ కెందుకూ సైకిలు, ఇంత వయస్సులో?"

"చుట్టలకి మామయ్యా - చుట్టలకి"

"బుద్ధిలేక - అని చెప్పవేం?"

బుద్ధిలేక చెప్పలేదు.

బుద్ధి ఎక్కువగా ఉంటే మామయ్య అవుతారు.

బుద్ధి తక్కువయితే నాన్న అవుతారు -

మరో హెచ్చు బుద్ధిగా ఉంటే నిరుద్యోగి అవుతారు.

'బుద్ధి' ఆలోచనే లేనివాళ్ళు అలివేలు అవుతారు.

మామయ్య

'బుద్ధి'స్టు.

బుద్ధితో మామయ్య డబ్బు గడిస్తాడు.

బుద్ధితో ఈ వెంకయ్య కష్టాల్ని గడిస్తాడు.

కష్టాలు రచయితలకి ఉపయోగపడతాయట.

కొందరు కష్టాలకోసం రచయితలవుతారు.

మరికొందరు కష్టాలవల్ల రచయితలవుతారు.

నిరుద్యోగి 'కష్టాలు' రచనలుగా కావు.

రచనల్ని రూపాయలుగా మార్చుకోవచ్చు.

కష్టాలు మారవు.

"నన్ను కొనుక్కుంటావా మామయ్యా!"

"ఏమిట్రా నీ డొంకతిరుగుడు?"

"వెంకట్రావు బియ్యేని. అలివేలుకి కొనుక్కుంటావా?"

"డబ్బియ్యను - కేశవుల్ని గాయత్రికి ఇస్తాను"

ఒహోహో! నా జీవితం ఖరీదు మరొక జీవితం.

నిరుద్యోగి జీవితానికి బదులు ఎమ్మే గ్రాడ్యుయేటు జీవితం.

"ఎమ్మే గ్రాడ్యుయేట్ ఖరీదెంత మామయ్యా?"

"ఆరువేలు పెట్టుబడి పెట్టి చదువు చెప్పిస్తున్నానోయ్"

"కేశవులు వద్దు - ఆరువేలు ఇవ్వకూడదూ!"

"కేశవుల్లాంటి మొగుడు దొరకవద్దూ గాయత్రికి?"

ఆరువేలూ దొరకవు మరి.

ఆరువేలు ఇస్తే నాలుగువేలకి మొగుడుని చూసుకుని -

రెండువేలతో కుటుంబానికి కావలసిన సంతోషాన్ని కొనుక్కుంటాం.

"ఈ పితలాటకం నాకు తెలీదురా బాబూ!"

"నష్టపోతున్నావు మామయ్యా! ఎమ్మే గ్రాడ్యుయేట్ ధర బజారులో పన్నెండువేలు."

"అబ్బా!"

"బ్లాకులో మరి రెండు"

ఆలోచిస్తాడు మామయ్య.

"మరయితే డబ్బిస్తే అలివేలుని పెళ్ళిచేసుకుంటావా?"

"చేసుకుంటాను. ఇంత త్వరగా పెళ్ళి జరిగిపోతుందా?"

"జరగదు. జరగదు"

పెళ్ళి త్వరగా జరగదు.

కానీ కాలం జరిగిపోతూంటుంది.

అవసరాలు జరిగిపోతాయి.

తప్పు! అవసరాలు పెరిగిపోతాయి -

అవసరాలు పెరిగితే మనుషులు తిరుగుతారు.

ప్రతివాడికి నీలాంటి మామయ్య ఉంటే ఎంత బావుణ్ణు.

ప్రతిమామయ్యకీ అలివేలు ఉంటే -
నిరుద్యోగికొక మామయ్య.
మామయ్య కొక అలివేలు.
ఒక్కొక్క అలివేలుతోపాటు ఆరువేలు.
"పెళ్ళి తర్వాత, డబ్బు అవసరం"
"అంత సుళువుగా ఇస్తానా నేను?"
"నా మాటను తాకట్టు పెట్టుకో"
"నిరుద్యోగి సంతకానికి విలువ ఉంది. "
"అయితే ఎల్లుండి సంతకం పెడతాను."
అలివేలుతో ఆలోచించి సంతకం పెడతాను.
నా మనస్సుతో సంప్రదిస్తాను.
నా ఆకలితో సంప్రదించాను - యస్.యస్.
నా కష్టాలతో సంప్రదించాను. యస్. యస్.
పరిస్థితుల్తో - యస్.యస్.
మనస్సుతో సంప్రదిస్తే - రెండు ప్రశ్నలు వేసింది.
(అ) అలివేలు ఏమంటుంది?
(ఆ) ఆ డబ్బువల్ల ఏం లాభం? - ఆ లాభం నిర్ణయించుకోకుండా కష్టాల్ని ఎందుకు భరించడం?
"అలివేలూ! నిన్ను పెళ్ళిచేసుకుంటానమ్మా"
"నిజమా బావా! నిజమా! నిజమా!"
మొదట సంతోషం.
"అవునమ్మా నిజం. నువ్వు నా అలివేలువి."
మళ్ళీ ఆలోచిస్తుంది.
"కానీ బావా నేను కుంటిదాన్ని"
"నేనూ కుంటివాణ్ణే"
"అదేమిటి! అదేమిటి"
నీకు కాలులేదు.
నాకు డబ్బులేదు.
నీకు కాలురాదు.
మంచి భర్త వస్తాడు.
నాకు డబ్బు వస్తుంది.
"సరే బావా. సరే-సరే."
"నన్ను పెళ్ళిచేసుకొంటే ఏం చేస్తావు అలివేలూ? - ఒక్కమాటలో చెప్పు"

"పిల్లల్ని కంటాను బావా! - పిల్లల్ని"

పాపం. అలివేలుకి చెప్పడం తెలియదు.

కష్టాల్ని కంటుంది.

ఇంతవరకు కలలు కని ఇప్పుడు కష్టాల్ని కంటుంది.

"ఇంకేం చేస్తావు అలివేలూ?"

"వంట చేస్తాను బావా - వంట"

"ఇంకా?"

"పెద్ద కుంకం బొట్టు పెట్టుకొని నీకు నమస్కారం చేస్తాను బావా"

"ఇంకేం చేస్తావు?"

"నన్నెప్పుడూ కుంటిగానే పుట్టించమని దేవుణ్ణి ప్రార్థిస్తాను"

"అదెందుకూ?"

"నీకు నా మీద జాలి ఉండడానికి"

"నీమీద నాకెప్పుడూ ప్రేమ ఉంది అలివేలూ!"

"అది నాకొద్దు బావా! జాలి కావాలి. జాలి. జాలి. నా కాలు కుంటి లేకపోతే నువ్వు పెళ్ళిచేసుకోవుగా?"

"కాదు అలివేలూ! కుంటిలేకపోయినా చేసుకునేవాణ్ణి కానీ కుంటిలేకపోతే మీ నాన్న నాకిచ్చేవాడు కాదు."

కుంటి అలివేలుకి కుంటి వెంకట్రావుని ఇచ్చారు.

కుంటిలేని అలివేలుకి కుంటి వెంకట్రావు మొగుడు కాదు.

"కుంటీ" ఈజ్ ఏ బ్లెసింగ్ ఇన్ డిస్ గైజ్.

"అవునమ్మా అలివేలూ! కుంటిదానివి కనకే నన్ను పెళ్ళిచేసుకున్నావు. కుంటిలేకపోతే ఇంకా మంచి మొగుడు వచ్చేవాడు"

"వద్దు వద్దు నువ్వే కావాలి బావా నాకు. అందుకే కుంటి కావాలంటున్నాను."

అమ్మో! అలివేలుకి తెలివుంది.

కుంటి మొగుడి కోసం తనూ కుంటిదవుతోంది.

డబ్బులేక కుంటివాడయిన వెంకట్రావుని డబ్బుండి కుంటిదయిన అలివేలు పెళ్ళి చేసుకుంటుంది.

"అలివేలూ! నీకు డబ్బున్నా మంచి మనస్సుంది."

"బావా! నీకు డబ్బులేకపోయినా మంచి మనస్సు ఉంచుకున్నావు."

"ఎల్లుండి నిన్ను పెళ్ళిచేసుకుంటాను అలివేలూ"

"ఎల్లుండి! ఎల్లుండి"

"అవును. ఎల్లుండే! ఒక దస్తావేజు కాగితం మీద మనకి పెళ్ళయిపోతుంది."

నిరుద్యోగి సంతకం ఒక జీవితాన్ని నిర్ణయిస్తుంది.

నిర్ధనుడికి, నిస్సంతోషికి పెళ్ళి.

అప్పుడు ధనం, సంతోషం వస్తుంది.

"మరి అత్తయ్యకి, గాయత్రికి తెలుసా బావా ఇది?"

తెలీదు. తెలీదు.

తెలీకూడదు. తెలీకూడదు.

"అయితే ఎలా?"

"ఏం?"

"వాళ్ళు బాధపడరూ?"

హ్హా హ్హా హ్హా -

వాళ్ళు బాధపడకుండా ఉండడానికే ఇదంతా -

వాళ్ళు బాధల్ని ప్రేమించారు.

తెలిస్తే, వాటిని పోగొట్టుకోడానికి ఇష్టపడు.

నన్ను వాటిని పోగొట్టనివ్వరు.

రహస్యంగా వాటిని చెదరగొట్టేస్తారు.

వాళ్ళ బాధలమీద 'కసి' తీర్చుకొంటాను.

"అంటే.. అంటే?"

మామయ్య డబ్బును పెళ్ళిచేసుకుంటాను.

తరువాత నిన్ను పెళ్ళిచేసుకుంటాను.

డబ్బుతో వాళ్ళ కష్టాలు, నీతో నా కష్టాలూ తీరిపోతాయి.

పెళ్ళి! పెళ్ళి!

ఎల్లుండి పెళ్ళి.

నిరుద్యోగికి పెళ్ళి.

***

***గాయత్రి***

భారతదేశంలో గాయత్రి అనునొక బీద తరగతి అమ్మాయ్ ఇవాళే పుట్టింది.

భారతదేశంలో త్యాగం పుట్టింది.

భారతదేశంలో కష్టం పుట్టింది.

భారతదేశంలో గాయత్రి పుట్టింది.

గాయత్రి అనే ఆరుపౌన్ల అమ్మాయి పుట్టగానే వాళ్ళ అమ్మ ఘొల్లున ఏడ్చింది.

'ఓ అయ్య చేతుల్లో పెట్టాలిక' అని ఏడిచింది.

ఆడది కదా అని ఏడ్చింది.

కానీ అప్పుడు ఏడ్చాను కదా అని ఇప్పుడు ఏడుస్తోంది.

'ఓ అయ్య' లేడు కదా అని ఏడుస్తుంది.

ఆడవాళ్ళు పుట్టగానే ఏడుస్తారు.

ఆడవాళ్ళు ఏడుస్తారు.

ఆడవాళ్ళకి కష్టాలు పుట్టి ఏడుస్తారు.

నా పుట్టినరోజు ఎవరికీ గుర్తుండదు - ఒక అమ్మకి తప్ప.

"ఈ రోజే నువ్వు పుట్టావని ఏడ్చానమ్మా!" అని ఏడుస్తుంది.

"ఎందుకు పుట్టానమ్మా?" అని నేనేడుస్తాను.

పుట్టినరోజున ఏడవడం ఒక కార్యక్రమం.

అయినా గాయత్రి పుట్టినరోజులు ఎవరూ గుర్తుంచుకోరు.

గాయత్రి కష్టాలు పడిన రోజు.

గాయత్రి ఆత్మహత్య చేసుకొన్న రోజు -

గాయత్రి మనిషిగా చచ్చిపోయినరోజు

ఇవి చారిత్రక ఘట్టాలు.

ఒక పుట్టినరోజు నాడు నాకూ, కష్టాలకూ పెళ్ళయ్యింది.

ఒక పుట్టినరోజు నాడు కష్టాలవల్ల నేను ఆత్మహత్య చేసుకున్నాను.

ఒక పుట్టినరోజు నాడు స్త్రీగా బ్రతికే గాయత్ని చచ్చిపోతుంది.

యంత్రం బ్రతికి ఉంది.

గాయత్రికాదు - గాయంత్రం -

ఇవాళ నా పుట్టినరోజు.

నా కష్టాలకి మూడవ వార్షికోత్సవం.

నా ఆత్మహత్యకు రెండవది.

నా చావుకు మూడవది.

కిందటి సంవత్సరం ఇదేరోజు పువ్వులు పెట్టుకుంటే మేనేజరు కోప్పడ్డాడు.

మేనేజరు ఉద్యోగానికే కాదు -

పువ్వులకి కూడాను.

"పుట్టినరోజునాడు పువ్వులు ఏ నెసిసిటీ?"

"కాదు. కాదు"

"పుట్టినరోజుకీ పువ్వులకీ సంబంధం లేదు"

"లేదు. లేదు."

మీ పుట్టినరోజుకి అన్ని పువ్వులు చచ్చిపోవడం"

"......"

"ఉద్యోగులు పువ్వు పెట్టుకోకూడదు"

"అలాగే. అలాగే"

"ఇతర ఉద్యోగుల దృష్టి డిస్టర్బ్ అవుతుంది"

"అవునవును"

''ఇలా అందంగా కనిపించకూడదు''

''నాకు అందంలేదు సార్''

''ఉన్నట్లు నటించకూడదు''

''యస్. యస్''

ఆ రోజు టేబులు మీదే పువ్వులు వాడిపోయాయి.

టేబులు మీదే వేడుకలు ఊడిపోయాయి.

ఆ రోజు నుంచీ పువ్వుల మీద విరక్తి పుట్టింది.

పుట్టినరోజూ, మేనేజరూ, పువ్వుల మీద కోరికను హత్య చేశారు.

ఇవాళ పుట్టినరోజు.

కష్టాల గురించి ఆలోచించకూడదు.

నేను పుట్టినప్పుడు అమ్మ ఏడ్చిన విషయం ఆలోచించ కూడదు.

అసలు ఆలోచనే కూడదు.

ఇవాళ ముకుందరావు నా గురించి మాట్లాడతాడు.

ఎప్పుడూ మాట్లాడని ముందరావు ఎప్పుడూ మాట్లాడే గాయత్రి గురించి మాట్లాడుతాడు.

ఆరునెలల సంపాదనలో 30 రూపాయలు మిగిలాయి.

కొనాయి చీరకోసం కోరిక.

అమ్మో! ఇంకా ఒక కోరిక మిగిలివుంది.

కొనాయి చీరకోరిక.

నా తెల్లటి ఒళ్ళుకి ఆకుపచ్చటి అంచు చీర.

నా తెల్లటి ఒళ్ళుకి ఒక పచ్చటి కోరిక అంచు.

ఆ అంచు లేకపోతే చీర అంతా తెలుపే.

తెల్లటి చీరలు గంగా భాగీరథీ సమానురాళ్ళే కట్టుకుంటారు.

మనస్సు తెల్లబడకుండా కోరిక అంచు ఉంది.

20 రూపాయలకి కొనాయి చీర -

''చీర కొనుక్కుంటానమ్మా''

''కొనుక్కో అమ్మా కొనుక్కో! ఎన్నాళ్ళకి కొనుక్కుంటానని అన్నావు తల్లీ కొనుక్కో''

''చీర కొనుక్కుంటానన్నయ్యా''

''కొనుక్కో అమ్మా కొనుక్కో నాకు కొనే తాహతు లేదమ్మా, నువ్వైనా కొనుక్కో''

''చీర కొనుక్కుంటానమ్మా చెల్లీ''

''కొనుక్కో అక్కా కొనుక్కో నాకు కోయంబత్తూరు చీర కొనుక్కోవాలని ఉంది. నీలిరంగు చీర నా ఒంటికి బాగుంటుంది''

''పోనీ నువ్వే కొనుక్కో''

''వద్దక్కా! నువ్వే కొనుక్కో''

"చీర కొంటాను నాన్నా!"

"కొనుక్కో అమ్మా కొనుక్కో"

అబ్బ! అందరూ 'సరే' అన్నారు.

"అమ్మా, అమ్మా!"

"ఏం నాన్నా?"

"నా కోరిక తీర్చవూ?"

"ఏమిటి నాన్నా?"

"రేపు తీరుస్తానని నిన్న అన్నావు కదమ్మా!"

"ఏమిటి నాన్నా అది."

"సైకిలమ్మా సైకిలు - చుట్టలకి సైకిలు"

"మరచిపోయాను నాన్నా"

"మరిచిపోకమ్మా, ముసలివాణ్ణి"

చుట్టలు మరిచిపోకు.

ఈ 24 గంటల్లో మరచిపోలేదు నేను.

సైకిలు కోసం 24 గంటల్లో మరచిపోలేదు నేను.

సైకిలు కోసం 24 యుగాలుగా బ్రతికాను.

"అలాగే నాన్నా. అలాగే!"

పుట్టినరోజు నాడు నాన్నకి తృప్తికలిగిస్తాను.

నాపుట్టినరోజులన్నీ మరొకరికి తృప్తినివ్వడంతో గడిచిపోతున్నాయి.

ఒక్కటి తప్ప.

మొదటి పుట్టినరోజు నాడు తప్ప.

ఆ ఒక్కరోజే పుట్టి ఎవరికీ తృప్తినివ్వలేకపోయాను.

క్రిందటి పుట్టిన రోజు నాడు ఉద్యోగంలో చేరి కుటుంబం అంతటికీ తృప్తి ఇచ్చాను.

ఇప్పుడు నాన్నకి.

"కొని ఇస్తాను నాన్నా! సైకిలు తప్పకుండా ఇస్తాను."

మీ తృప్తికే బ్రతుకుతున్నాను నాన్నా!

నా తృప్తికి నేనిదివరకే చచ్చిపోయాను.

నా తెల్లటి చీరకి ఆకుపచ్చంచు అనుకున్నాను.

దాని చివర నల్లంచు కూడా ఉంది.

ఆకుపచ్చకంటె దట్టమైన నలుపు.

కొట్టవచ్చే నలుపు.

నల్లంచు ఆకుపచ్చంచు తెల్లచీర జీవితం.

నాకు ఆకుపచ్చంచు తెల్లజీవితమే ఇష్టం.

కానీ నల్లంచు చిరిగిపోదు.

ఒహ్హో! ఏం చీర, ఏం చీర.

పుట్టిన రోజునాడు ఆలోచించవద్దనుకుంటా నేమిటి?

వచ్చే పుట్టినరోజుకి, "పుట్టిన రోజు నాడే ఎక్కువ ఆలోచించాలి" అనుకుంటాను.

పుట్టినరోజు ఆలోచనలు -

(అ) నేనెందుకు పుట్టానో?

(ఆ) పుట్టి నేనందర్నీ బాధపెట్టానో?

(ఇ) 'తృప్తి' అంటే ఏమిటో?

(ఈ) 'సంతోషం' అంటే ఎలా ఉంటుందో?

(ఉ) నేనెప్పుడు చచ్చిపోతానో? అన్ని పుట్టినరోజులకీ ఇవ్వాళ్టికీ తేడా ఉంది.

అన్ని పుట్టిన రోజులకీ దుఃఖాలే ఉన్నాయి.

ఈ పుట్టిన రోజునాడు చిన్న సంతోషం కూడా ఉంది.

ముకుందరావు నా గురించి మాట్లాడతాడు.

అమృతం లాంటి ముకుందరావు అమృతంలాంటి మాటలు మాట్లాడతాడు.

అమృతం లాంటి ముకుందరావు హాలాహలం లాంటి చేదు 'గాయత్రి'తో అమృతంలాగ మాట్లాడుతాడు.

తన చీర కోరికకు మరి 20 రూపాయలు చేరిస్తే నాన్న కోరిక అవుతుంది.

20 ఏళ్ళ వయస్సు కోరిక అది.

నాన్నకోరిక వయస్సు 50 ఏళ్ళు.

20 రూపాయలు -

ఎక్కణ్ణించి? ఎక్కణ్ణించి?

దేవుడు 20 రూపాయల్ని ఇవ్వడు.

ఇరవై కష్టాల్ని ఇస్తాడు.

పెళ్ళి చేసుకుంటే 20 మంది పిల్లల్ని ఇస్తాడు.

20 సార్లు మధ్యతరగతి బ్రతుకుని ఇస్తాడు.

కానీ 20 రూపాయలు ఇవ్వడు.

మేనేజరు 50 రుపాయలు ఇస్తాడు.

ఒక రోజు నేను నవ్వితే వంద ఇస్తానన్నాడు.

నేను నవ్వనని అందరికీ తెలుసు.

మేనేజరుకీ తెలుసు.

మేనేజరుకి నవ్వు కావాలి.

నూర్రూపాయలకి కొనుక్కుంటానన్నాడు.

బీదదాని నువ్వు ఖరీదు నూర్రూపాయలే?

కాని విచిత్రం.

ఆ రోజు నవ్వలేకపోయాను.

తరువాత అర్ధమయింది.

బీదదానికి వెయ్యి ఇచ్చినా నవ్వు బయటికి రాదని -

వెయ్యి కష్టాల్నిచ్చి జీవితం నుంచి 'విధి' ఆ నవ్వును కొనుక్కుంది.

వెయ్యి తృప్తులతో ఆ నవ్వును సంపాదించాలి.

ఆ రోజు నవ్వలేదు.

ఇవాళ ఇరవై కావాలి.

మేనేజరు ఇస్తాడేమో?

ఏడిస్తే 20 ఇస్తానని అంటే?

భోరున ఏడవ వచ్చు.

ఏడుపు నా జన్మహక్కు.

నేనెప్పుడూ చేసేది అదే

"సార్! సార్ 20 రూపాయలు అప్పుకావాలి సార్"

"20 రూపాయలూ"

20 రూపాయలే.

ఇరవయ్యి రూపాయలా?

"ట్వంటీ? బీస్?"

"అవునుసార్, ఇరవై"

"ఏం చేస్తావు గాయత్రీ ఇరవై?"

"మా నాన్నగారికి సైకిలు కొంటాను సార్!"

"సైకిలా! 20 కి సైకిలా?"

"50కి సార్ - నా దగ్గర 30 ఉన్నాయి."

"వండర్. వండర్. 50కి సైకిలు"

"పాతది"

"పాతది 50 కి సైకిలు"

"నాన్నకి సార్!"

"నాన్నకి పాతై 50 కి సైకిలు - వైనాట్ యూ టేక్ హండ్రెడ్?"

మేనేజరు కళ్ళలో ఎంతో దయ కనిపించింది.

మేనేజరు మెల్లకన్ను కూడా కనిపించింది.

మేనేజరు ఒక కన్ను మూసి, ఒక కన్ను తెరుస్తున్నాడు.

అదేదో భాష.

గాయత్రిదేం చూడలేదు.

మేనేజరు నవ్వాడు.

మేనేజరు నవ్వితే ఆఫీసు వణుకుతుంది.

మేనేజరు నవ్వితే నిశ్శబ్దం సణుగుతుంది.

మేనేజరాసురుని సింహాసనం ఏడుస్తుంది.

పులి బుర్ర నోట్లు - పదని రెండిచ్చాడు.

"సఫిషియంట్?" అంటున్నాడు.

"యస్. సార్! యస్. యస్."

"మీ నాన్నకి సైకిల్ కొను"

"యస్ సార్. థాంక్యూ సార్. యస్... థాంక్స్ ... యస్.. యస్...'

## (8)

**త్వరగా ఇంటికి పరిగెత్తి పోతుంది మనస్సు.**

నేను నడిచినా మనస్సు పారిపోతుంది.

"నాన్నా నాన్నా.. ఇదిగో ఏభై"

"అమ్మా! అమ్మా! తెచ్చావా అమ్మా!"

"సైకిలు కొనుక్కో నాన్నా"

"ఓహో! నా జీవితంలో పెద్ద కోరిక తీరిపోతుంది అమ్మా - ఇప్పుడే వెళ్తాను."

"నా పుట్టినరోజు నాన్నా! నీకు దండం పెడతాను."

"వెయ్యేళ్ళు వర్ధిల్లమ్మా"

నవ్వొస్తుంది - నవ్వు - నవ్వు - నవ్వు.

శీఘ్రమేవ కళ్యాణ ప్రాప్తిరస్తు - అనరేం?

అనరు. అనరు.

దానికంతా చిన్న లిటిగేషన్ ఉంది.

అమ్మయ్య! నాన్నకు సంతోషం వచ్చింది.

నాకు ఆయాసం వచ్చింది.

సైకిలుతో సంతోషం.

ఇక ముకుందరావు ఎదురు చూస్తూంటాడు.

త్వరగా పోతే త్వరగా సంతోషం వస్తోంది.

ముకుందరావు గురించి ఆలోచిస్తే మనస్సు సగం బాగుపడుతుంది.

ముకుందరావు చూడ్డంవల్లనేమో ప్రపంచం ఈకాస్త అయినా బాగుంది నాకు.

రోడ్డంతా ఇవాళ కొత్తగా ఉంది.

మామిడి చెట్టుకి మనస్సుండి గాలితో మాట్లాడుతున్నట్టుంది.

సైకిలు తొక్కే కుర్రాడు సాయంకాలం వెంటబడి పోతున్నాడు.

రెండు బస్సులు కాలం కంటే వేగంగా పోతున్నాయి.

రెండు కాకులు కాకి భాషలో తిట్టుకుంటున్నాయి.

న్యూస్‌పేపరు చదివే కుర్రాడు తను చదవడం ఎవరన్నా చూస్తున్నారా లేదా అని చూస్తున్నాడు.

రంగురంగుల చీర కట్టుకున్న పెదమ్మాయి చారల చారల పరికిణీ తొడుక్కున్న అమ్మాయివేపు ఈర్ష్యగా చూస్తోంది.

చెట్టుకింద ఓ కిట్టయ్య చుట్ట మజాను నెమరువేస్తున్నాడు.

ఓ మేక పది సీసాల సారా తాగిన వాడిలాగ కళ్ళు కదుపుతోంది.

పచ్చిపొలాలతో పచ్చని పరికిణీ రెపరెపలాడింది.

ఎవరో కిలకిలా నవ్వుతున్నారు.

ఆ నవ్వు 18 ఏళ్ళు పాతది తనకి.

గుర్తుకొస్తోంది. వస్తోంది.

మళ్ళీ కిలకిల.

సుందరి నవ్వు.

పచ్చపొలాల మధ్య పచ్చటి సుందరి.

ఏపుగా పెరిగిన పంట మధ్య ఏపుగా పెరిగిన యువతి.

పక్కనే ఎవరో?

ఎవరో? ఎవరెవరో?

సుందరి వేపు ఆశగా చూస్తున్నాడు.

సుందరివేపు ఆశగా నవ్వుతున్నాడు.

సుందరి వెనక నడుస్తున్నాడు.

సుందరి ఆగి వెనక్కి తిరిగి అతని కళ్ళలోకి చూస్తోంది.

ఆ కళ్ళకి అర్థం ఆడవాళ్ళకి బాగా తెలుస్తుంది.

తెలిసింది. తెలిసింది.

అమ్మో! అమ్మో! సుందరి ఇంతపని చేస్తుందా?

ప్రేమిస్తుందా?

"సుందరీ! సుందరీ!"

తలెత్తి చూసింది నన్ను.

చూసి చూడలేనట్టు నటించబోతోంది.

నటించలేకపోతోంది.

అతను నవ్వుతున్నాడు.

ఆమె నవ్వును పంచుకుంటోంది.

"సుందరీ!"

ఈ సారి వినిపించుకోక తప్పులేదు.

పంటపొలాల మధ్య నిలిచిపోయింది.

"సుందరీ! ఇక్కడెందుకున్నావు నువ్వు?"

"నేను..నేను.."

నోట్లోంచి మాట రావడంలేదు.

కళ్ళు మాట్లాడుతున్నాయి.

బెదిరిపోయి భయపడి కళ్ళు మాట్లాడుతున్నాయి.

"ఇక్కడెందుకు తిరుగుతున్నావు?"

''నేను..నేను..''

నోట్లోంచి మాట వస్తోంది.

కళ్ళు వెనకనున్న వ్యక్తివేపు తిరిగాయి.

వెనుకనున్న వ్యక్తికళ్ళు ఆకాశం వేపు తిరిగాయి.

''నువ్వు?''

''నేను..''

యవ్వనానికి మాటలు రావు.

భావాలు వచ్చు -

వయస్సుకి మాటలు ఉంటాయి.

భావాలు నలిగిపోతాయి.

సుందరి మాట్లాడడంలేదు.

ఎర్రబడిన ముఖం -

చెదిరిపోయిన కళ్ళు

వణుకుతున్న పెదవులు.

ఏవేవో చెప్పేస్తున్నాయి.

అవునవును. ఆ భాష అర్థమయిపోయింది.

అయ్యో సుందరీ!

బీద సుందరీ ఖరీదయిన ప్రేమ కావాలా నీకు?

తప్పు. తప్పు.

ఖరీదయిన యౌవనాన్ని చవకగా కోరికలకి అమ్మేస్తావా?

''సుందరీ! సుందరీ ఎంతపని చేశావు.''

''నేనేం చెయ్యలేదక్కా''

''ఎవరతను?

''అతను.. అతను.. అతనే''

''ఎవరతను?''

''అతను.. నేను.. నేను.. అతను..''

''ఎవరండీ మీరు?''

''నేను.. నేను.. నేనా?

''మీరు?''

''నేనా! నేనే.. నేను''

అప్పుడే చాలామంది రోడ్డుమీద నిలబడిపోతున్నారు.

*బీదవాళ్ళ కష్టాల్ని చూడడానికి ప్రపంచంలో ప్రేక్షకులు చాలామంది.*

*ఇతరుల కష్టాల్ని చూడటానికి ప్రపంచంలో ప్రేక్షకులు చాలామంది.*

*ఇతరుల కష్టాల్ని పంచుకుని తమ చేదు జీవితాల్ని మింగుతుంటారు.*

అర్థమయిపోయింది.

"సుందరీ! అలా పొలం వేపు వెళ్దామా?"

"రండి సార్ అలా పొలాలవేపు వెళ్దాం"

రోడ్డు మీద వారికి చిత్రాన్ని చూసే అవకాశం పోయింది.

"ఎవరండీ మీరు?"

"వేణుగోపాల్ - రచయితని"

చివరిమాటలో గర్వం

రచయిత అయితే ఆడవాళ్ళని పాడుచెయ్యటానికి అర్హత ఉన్నట్టు.

"నా మిత్రులు - నా క్లాసుమేటు"

"ప్రాణస్నేహితుణ్ణి - ప్రాణమన్నా ఇచ్చే స్నేహితుణ్ణి"

"ఆమె మంచికా, చెడుకా మీ ప్రాణం ఇస్తారు?"

అమ్మో! అమ్మో! ఇంత పెద్ద ప్రశ్నే.

"మీరు మమ్మల్ని అపార్థం చేసుకుంటున్నారు. మాది పవిత్ర ప్రేమ"

ఇలా మాట్లాడే అవకాశం వచ్చిందికదా అని రచయిత మురిసిపోతున్నాడు.

పవిత్ర ప్రేమ మనుషుల్ని చంపుతుందా?

పవిత ప్రేమ పొలాలలోబడి తిరుగుతుందా?

పవిత్ర ప్రేమ సిగ్గు కలిగించి, ముఖాల్ని ఎర్రబరుస్తుందా?

పవిత్రప్రేమవల్ల అలా ఏడవడం సాధ్యమా?

సుందరి ఏడుస్తోంది.

వేణూ మనసు చేతకాక ఏడిచింది.

"సంఘం మా ప్రేమను గుర్తించడంలేదు"

ఎందుకు గుర్తించాలి సంఘం నిన్ను?

ఓ దౌర్భాగ్య దామోదర చక్రవర్తీ.

ఆంధ్ర కవిశేఖరా!

అంధ కవిశేఖరా!

సంఘం ఎందుకు గుర్తించాలయ్యా నిన్ను?

సంఘం నువ్వు రొట్టిపెట్టి పోషిస్తున్న కుక్కా?

సంఘం నువ్వు పెంచి పెద్ద చేసిన బానిసా?

సంఘం అంటే పోలీసు స్టేషనా?

కిరాణా సామానులమ్మే దుకాణమా?

సంఘం దయాదాక్షిణ్యాలను పంచిపెట్టే సత్రమా?

సంఘానికి రిపోర్టు చేసే ప్రేమించావా నువ్వు?

సంఘం చావమంటే చస్తావా?

సంఘం అంటే అర్థం ఏమిటని అడగాలి.

సంఘం మీద 150 కంపోజిషన్లు వ్రాయించాలి.

సంఘం అనే శుద్ధ తెలివితక్కువ. చేతకాని, అర్థంలేని, పనికిమాలిన పదాని పట్టుకు వేలాడిన రచయితకి యావజ్జీవ కారాగార శిక్ష విధించాలి"

సంఘం మమ్మల్ని గుర్తించదు.

ఈపాడు సంఘానికి కళ్ళులేవు.

ఈ సంఘం గుడ్డిది.

ఈ సంఘం అవినీతితో కుళ్ళిపోయింది.

అంటే –

నీకు కళ్ళులేవు.

నువ్వు గుడ్డివాడివి.

నీలో ఒక భాగం కుళ్ళిపోయింది.

ఓ ఆంధ్రరచయితా! నేను ఆడదాన్ని.

మధ్య తరగతి ఆంధ్రదేశపు ఆడదాన్ని.

సంఘమంటే నాకు తెలుసు.

నీకు సంఘం గురించి మాట్లాడటమే తెలుసు.

నేను సంఘంవల్ల నాశనమవుతున్నాను.

నువ్వు సంఘాన్ని నాశనం చేస్తున్నావు.

'సంఘం' అన్నవాణ్ణి ఉరితీయాలి –

సుదీర్ఘంగా సమాధానం చెప్తోంది మనస్సు.

సమాధానం చెప్పడానికి పదిహేను నిమిషాలు పట్టింది.

అంత నిశ్శబ్దాన్ని వాళ్ళిద్దరూ భరించారు.

"సంఘం గురించి మాట్లాడడానికి మీరింకా 50 ఏళ్ళు బతకాలి. అప్పటికి సంఘం గురించి రెండు యుగాలక్రిందటే తెలుసుకున్న మాలాంటి ఆడవాళ్ళు ముసలివాళ్ళయిపోతారు. అప్పుడెవరయినా దొరికితే మీరు ప్రేమించవచ్చు."

వేణూ ముఖం తెల్లబడుతోంది.

సుందరి ముఖం నల్లబడింది.

ఆకాశంకూడా నల్లబడింది.

నా ముఖం ఎరుపు.

ఇంత ఉద్రేకం వచ్చిందేమిటి నాకు?

ఇంకా ఏదో అనబోతున్నాడతను.

"నన్నవమానిస్తున్నారు మీరు."

నవ్వొస్తోంది.. నవ్వొస్తోంది.

"మీలాంటివారివల్ల పురుషులందరికీ అవమానం కలిగిందని మీకనిపించటంలేదా?"

అమ్మో! ఉద్రేకంలో బాగా మాట్లాడుతున్నాను.

పెద్ద గొప్ప రాజకీయావాదిలాగా మాట్లాడుతున్నాను.

అతనిక్కోపం వచ్చింది.

"నిజానికి మీరు కారు మొగాళ్ళు, మీరు గాజులు తొడిగించుకుని..."

"అక్కయ్యా!"

కొత్తగా అరిచింది సుందరి.

వేణూనంటే చెల్లెలికి కోపం.

వేణూ మంచితనానికి అతను చెప్పిన మాటలే ఆమెకు నమ్మకం.

"నన్ను మీరు మాటల్తో హింసించారు. అవమానించారు"

నవ్వొస్తోంది మళ్ళీ.

"బాధని అనుభవించడంలోకూడా మీమీదే మీకు దృష్టి. మీ పాపాల్ని  జీవితమంతా అనుభవించాలి"

"అక్కయ్యా"

"ఇంకా మీరు గొప్పవారయితే మీ నీచత్వానికి సాక్ష్యాన్ని ఆమె తొమ్మిది నెలలు భరించాలి"

ఈసారి 'అక్కయ్య' అని అరవలేదు సుందరి.

ఛెళ్ళున కొట్టింది.

ఉద్రేకంతో, చెల్లెలి ఉద్ధుతంతో ముఖం తిరిగింది.

ఇదేమిటి? నేనే ఏడుస్తున్నానేమిటి?

సుందరి ఏడుస్తున్నది.

అతను ఏడవలేకపోతున్నాడు.

ఓహ్హో హ్హో! రచయితలు ఎట్లా నడిపించగలరు?

సుందరి నన్ను కొట్టాక ఏడుస్తోంది.

'నిజం'కు ఎప్పుడూ దెబ్బలు తగులుతుంటాయి.

'ఉద్రేకం' శిక్ష అనుభవిస్తూనే ఉంటుంది.

'మంచి' ఎప్పుడూ న్యాయస్థానంలో నిలబడుతూనే ఉంటుంది.

సుందరి కొట్టాక సంతోషం కలిగింది నాకు.

సుందరి కొట్టింది కనక సంతోషం.

మనస్సులో కుమిలిపోతోంది సుందరి.

నేను చెప్పిన మాటల్ని భరించలేకపోయింది.

నన్ను కొట్టితేకాని ఆగలేనంత బాధపడింది సుందరి.

అందుకే సుందరి కొట్టింది.

అందుకే సుందరి బాగుపడుతుంది.

వేణూ బాగుపడడు.

సుందరి యవ్వనాన్ని ప్రేమించాడు.

జీవితాన్ని ప్రేమించలేదు.

"ఇప్పటికిప్పుడు మీతో సుందరి వస్తుంది. స్టేషనుకు వెళ్దామా?"

"అక్కయ్యా!"

"ఏమండీ, నన్ను మీ ఇన్సల్ట్ చేస్తున్నారు."

నవ్వొస్తోంది.

"ఇప్పటికిప్పుడు సుందరి అనే మీ ప్రేయసి మీతో లేచిపోవటానికి సిద్ధంగా ఉంది ఏమంటారు?"

"మర్యాదగా మాట్లాడండి"

లేచాడు.

"అక్కయ్యా! అక్కయ్యా! నన్ను చంపెయ్!"

"ఇప్పటికిప్పుడు మీరు ప్రేమించిన సుందరి మీ భార్య అయిపోవడానికి సిద్ధంగా ఉంది. పెళ్ళి చేసుకోండి"

"మిమ్మల్ని మీరు అదుపులో పెట్టుకోండి"

ముందుకు వచ్చాడు.

నవ్వొస్తోంది. నవ్వొస్తోంది. ఉద్రేకం వస్తోంది.

ఆడది అబలకాదు.

తరతరాలనాటి శక్తి.

పల్లానికి జారే పెద జలపాతం.

జివ్వుమనే విద్యుత్తు.

"మా చెల్లెలు కొడితే నవ్వుతూ భరించాను. మీరు చెయ్యెత్తితే మిమ్మల్ని హత్యచేసి జైలుకి వెళ్తాను"

అతను ఆగిపోయాడు.

సుందరి తడిసిన కళ్ళను ఆశ్చర్యంతో నింపుకుంది.

"మీకు మనిషిగా బ్రతకడానికి హక్కులేదు. మీలాంటి రచయితలుండడం ఈ దేశం దౌర్భాగ్యం. వెళ్ళి సంఘాన్ని మీ ప్రేమగురించి ప్రశ్నించండి వెళ్ళండి. ఎదురుగ్గా ఉంటే మిమ్మల్ని ఏం చేస్తానో తెలీదు"

అతను ఆకులా రెపరెపలాడుతున్నాడు.

గాయత్రి చూడడంలేదు.

ఉద్రేకాలతో, అసహ్యంతో కట్టు తెగిన పెద్ద ప్రవాహంలాగా కనిపిస్తోంది.

సుందరిని చూడలేదు ఆంధ్రరచయిత

పవిత్ర ప్రేమ గురించి ఆలోచించలేదు.

సంఘం గుర్తించలేకపోవడాన్ని గుర్తించలేదు.

గాయత్రి అనే ఉద్రేకపు రాక్షసి కళ్ళు అతన్ని వెంటతరుముతున్నాయి.

ఆ పొలాల మధ్యనుంచి పరుగెత్తుతున్నాడు.

యవ్వనాన్ని, నిజాయితీని చూసి భరించలేక 'పాపం' పరిగెత్తుతోంది.

రోడ్డువరకు పరిగెత్తాడు.

దూరం నుంచి వస్తున్న బస్సును ఆపాడు.

దానిలో పడ్డాడు.

వెనక్కి తిరిగి చూడలేదు.

బస్సు కదిలిపోయింది.

నవ్వొస్తోంది. నవ్వొసోంది.

నేలన పడి రోజంతా నవ్వడానికి సరిపోయే నవ్వు.

ఇంత ఉద్రేకం ఉందా నాలో!

ఇంత కోపం ఉందా?

ఓహోహో ఎంత బలం ఉంది స్త్రీకి.

ప్రయత్నిస్తే స్త్రీ తనని తాను రక్షించుకోగలదు.

ప్రయత్నిస్తే స్త్రీ తనని తాను భక్షించుకోనూగలదు.

"సుందరీ! ఎందుకమ్మా ఏడుపు?"

చెల్లీ! ఏడవకమ్మా ఏడవకు.

నువ్వు కొడితే నాకేం బాధ లేదమ్మా -

యవ్వనం అనే చిన్నపిల్ల 'అనుభవం' అనే ముసలిజాన్ని కొట్టిందమ్మా -

చెల్లీ! చెల్లీ! ఏడవకు.

నీమీద నాకేం కోపంలేదు.

ఇవాళ బ్రతికిపోయావు నువ్వు.

ఈ జీవితానికి బ్రతికిపోయావు.

ఆంధ్ర రచయితనుంచి నీకు విముక్తి లభించింది.

సంఘం గుర్తింపు కోసం బ్రతికే ఆంధ్ర రచయిత.

చెల్లీ! చెల్లీ! ఏడవకమ్మా - ఏడవకు.

ఇలాంటి పుట్టినరోజు ఎప్పుడూ గడపలేదు.

ఇలాంటి పుట్టినరోజు ఎప్పుడూ రానివ్వకు భగవంతుడా!

సంతోషాన్ని ఆశిస్తూ ప్రారంభించిన రోజు దుఃఖంతో ముగుస్తుంది కాబోలు.

నాన్న కాలు విరిగింది.

50 రూపాయల్తో నాన్న సైకిల్ని కొనుక్కోబోయి కష్టాల్ని కొన్నాడు.

కష్టాలకి కొసరుగా కుటుంబానికి మనస్తాపాన్ని తెచ్చాడు.

చెల్లెలు తెలివితక్కువతనానికి తన యవ్వనాన్ని ఫణంగా ఇచ్చింది.

లేక ఇవ్వబోయిందో?

ఎలా చెపుతుంది? చెప్పదు. చెప్పదు.

ఈ కుటుంబం ఎప్పటికయినా బాగుపడుతుందా?

ఈ కుటుంబం బాగుపడితే నేను బాగుపడతాను.

బాగుబడకపోతే పోనీ.

తీరికగా నవ్వుకొనే విశ్రాంతి ఉంటుందా!

ఒదులుగా జడ అల్లుకునే వ్యవధి దొరుకుతుందా!

"నా పేరు గాయత్రి. నాకు కోరికలున్నాయి" అని ఆలోచించుకునే రోజు వస్తుందా?

ఇంకొక్క ఆశ మిగిలింది ఈ రోజుకి.

నా గురించి మాట్లాడుతానన్నాడు ముకుందరావు.

మంచి మాటల్తో పుట్టినరోజు బాగా ముగుస్తుందా?

"గాయత్రీ మిమ్మల్ని చూస్తే నా కష్టాలన్నీ తీరిపోయినట్టుంటాయి" అంటాడేమో!

"గాయత్రీ మీ నవ్వు వెన్నెల చల్లదనాన్ని గుర్తు చేస్తుంది."

"గాయత్రీ నిన్ను చూస్తే చచ్చిపోయిన మా చెల్లెలు గుర్తుకొస్తుంది."

"గాయత్రీ! మీరెంత మంచివారు"

ఇలా ఎన్నయినా చెప్పొచ్చు.

ఇందులో ఏం చెప్పినా ఈ బీద గాయత్రికి పది ఏనుగుల బలాన్నిస్తాయి.

పోవాలి... పోవాలి.

ఇక ఈరోజుకి ఈ కష్టాలు చాలు.

ఇక ఈ పుట్టినరోజుకి ఈ జ్ఞాపకాలు చాలు.

ముకుందరావు ముందు విశ్రాంతికి -

ముకుందరావు ఓదార్పుకి -

## (9)

**ప్రెస్సు నుంచి ఇవాళ** మంచి బట్టల్తో బయటికి వచ్చాడు ముకుందరావు.

ఎప్పటిలాగే ఇవాళా నవ్వుతున్నాడు.

ఇదివరకటి నవ్వు నిర్మలంగా ఉంటే -

ఇవాళ నవ్వులో ఆతృత, ప్రశ్న ఉంది.

ఆశ ఉంది.

ఆశ్చర్యంగా చూస్తున్నాడు నన్ను.

నాలో మార్పు ఉందా అని చూస్తున్నాడు నన్ను.

కన్నీళ్ళతో తడిసిన కళ్ళలో ఇంకా అందాన్ని వెదుకుతున్నాడు.

"ముకుందరావుగారూ! ముకుందరావుగారూ! 'ఇవాళ' వచ్చేసింది."

"అవును వచ్చేసింది."

"నడుద్దామా ఇవాళ? డబ్బు మిగుల్తుంది."

నవ్వేడు.

ఎవర్నో క్షమించినట్టు నవ్వుతాడు.

"పదండి పదండి"

ప్రతి అడుగుకీ ఆలోచనని పేరుస్తుంది మనస్సు.

ఏం మాట్లాడుతాడు నా గురించి?

ఏమిటి? ఏమిటి?

"ఇక్కడ రాళ్ళు బాగున్నాయి కూచుందామా?"

ముకుందరావు మాట్లాడుతున్నాడు.

మాటలు. మాటలు.

"కూచుందాం. కూచుందాం."

"గాయత్రీ!"

అదిగో మాట్లాడుతున్నాడు. మాట్లాడుతున్నాడు.

"ఏమండీ"

"గాయత్రిగారూ - 'గాయత్రీ' అనేదా"

అమ్మో! అమ్మో - మాట్లాడుతున్నాడు. ఎంత బాగా, తియ్యగా మాట్లాడుతున్నాడు.

"అనండి అనండి. మీ ఇష్టం - మీ ఇష్టం."

"ఒక్కమాటని చెప్పాలని ఇన్నాళ్ళూ ఆగిపోయాను"

ఎంత బాగా ప్రారంభించాడు.

"పది మాటలు చెప్పండి. పదిసార్లు చెప్పండి. పది రోజుల వరకూ చెప్తూ ఉండండి"

నవ్వాడు ముకుందరావు.

అదే నవ్వు - అతని జీవితమంతా ఆ నవ్వులో దాచుకుని.

"నాకో చెల్లెలుంది."

నేననుకున్నాను - 'అవునవును'.

"పిచ్చిది."

"అయ్యో! అయ్యో!"

"ఆమెను బ్రతికించడానికే పెళ్ళి చేసుకోలేదు ఇంత కాలం. కానీ మిమ్మల్ని చూశాక పోనీ నన్ను పెళ్ళి చేసుకుంటారా గాయత్రీ?"

అయ్యో! అబ్బా! ఎంతమాట విన్నాను.

గుండె రెండుగా చీలిపోతోంది.

ఈ భూమి బ్రద్దలయిపోతే బాగుణ్ణు.

ఈ రాళ్ళు కరిగి, నలిగి, నిప్పు సెగలు లేచి, లావా అయి శరీరంలో ఏ అణువూ మిగలకుండా కాల్చేస్తే బాగుణ్ణు.

ఈ గుండె హఠాత్తుగా ఫెటీల్మని పగిలిపోతే బాగుణ్ణు.

ఈ సాయంకాలం జీవితంలోంచి తొలిగిపోతే బాగుణ్ణు.

ఎంత దుర్దినం? ఎంత దుర్దినం?

అయిదేళ్ళ కిదట మరచిపోయిన ఆశ కదిలింది.

అయిదేళ్ళ కిందట చచ్చిపోయిన కోరికని గుర్తుచేస్తున్నాడు.

అయ్యో! అయ్యో! ఎందుకు వచ్చానిక్కడకు.

ఎందుకు అడిగాను ముకుందరావుని మాట్లాడమని.

నేను చచ్చిపోతే బావుణ్ణు.

చచ్చిపోతే బావుణ్ణు.

"ఏం? మీ కిష్టంలేదా గాయత్రీ?"

ఇష్టం లేక కాదు పిచ్చి ముకుందరావు.

పిచ్చి చెల్లెలున్న పిచ్చి ముకుందరావు.

ఇష్టం లేక కాదు, పిచ్చి గాయత్రి పెళ్ళి చేసుకోదలచిన పిచ్చి చెల్లెలున్న పిచ్చి ముకుందరావు.

"నాకు పెళ్ళికాదు - పెళ్ళికాదు."

ముకుందరావు తెల్లబోతున్నాడు.

కారణం వింటే ఇంకా తెల్లబోతాడు.

"ఏం? ఏం?"

"నేను పెళ్ళి చేసుకోకూడదు ముకుందరావుగారూ! నేను పెళ్ళిచేసుకుంటే మా కుటుంబమంతా నాశనమయిపోతుంది."

వాళ్ళ సుఖానికీ, నా పెళ్ళికీ అయిదేళ్ళ కిందటే తగాదా వచ్చింది - తీరిపోయింది.

నేను పెళ్ళి చేసుకోకూడదు.

"పెళ్ళి చేసుకుంటావా అమ్మా?" అని నాన్న అడగడు.

అమ్మకి ఆ విషయం గుర్తుకొచ్చినా మరిచిపోతుంది.

నాకు పెళ్ళయితే ఆ కుటుంబాన్నెవరు పోషిస్తారు?

నా సుఖం వేరయిపోతే వాళ్ళ సుఖాల్ని ఎవరు చూస్తారు?

అందుకని ఎవరూ నా పెళ్ళి గురించి బాధపడరు.

నేను బాధపడటం మరచిపోయాను.

నాకు పెళ్ళి కావాలన్న విషయం నాకు గుర్తులేదు.

ప్రేమ విషయం నాకర్థంకాదు.

పిల్లల విషయం ఆలోచించను.

"అయ్యో! అంత దుఃఖంలో బ్రతుకుతున్నారా మీరు?"

"దుఃఖం కోసం బ్రతుకున్నాను ముకుందరావుగారూ!"

పెళ్ళికోసం కాదు.

క్షమించండి. అప్పటి విషయాలు గుర్తుకొచ్చాయి.

బాధ ఎక్కువయింది.

నన్ను, చెల్లెలని పిలవండి.

ఎవరి భార్యనూ కాను నేను.

కానీ మంచి చెల్లెల్ని కాగలను.

ముకుందరావుగారూ మీ ఒడిలో తల ఉంచుకుని రోజంతా ఏడ్వనివ్వండి నన్ను.

ఇంత మనస్ఫూర్తిగా ఏడ్చి చాలా రోజులయింది.

ఇంత మంచి దుఃఖం అనుభవించి చాలా రోజులయింది.

నాకోసం నేను ఏడ్చి చాలా రోజులయింది.

మీ వంటి మంచి భర్త నాకు దొరకడు.

కానీ మీ వంటి మంచి అన్నయ్య చాలు నాకు.

ఒహో? దుఃఖములోనూ సుఖం ఇచ్చావు అన్నయ్యా!

దుఃఖం వల్ల సుఖం వచ్చింది.

ప్రతీ పుట్టిన రోజుకీ సంతోషం లేక ఏడ్చాను.

ఈ పుట్టిన రోజుకి సంతోషంతో ఏడ్చాను. అన్నయ్య, అన్నయ్య మంచి అన్నయ్యవి నువ్వు.

"అయ్యో! ఇంత కష్టమా మీకు? ఏడవకండి" నడుస్తున్నాం.

"ముకుందరావుగారూ! ఇవాళ నాపుట్టినరోజు"

"అలాగా! అలాగా!"

"ఇవాళంత దుఃఖం నేనెన్నడూ అనుభవించలేదు"

"ఇవాళంత సుఖమూ నాకెప్పుడూ కలగలేదు."

"ఓహో! ఓహో!"

"మా నాన్నకాలు విరిగిపోయింది"

"పాపం! పాపం"

"నా చెల్లెలి జీవితం చితికిపోయింది"

"పాపం! పాపం"

"నా చెల్లెలి జీవితం చితికిపోబోయింది"

"ఓహో! ఓహో!"

"ముకుందరావుగారూ. మా చెల్లెల్ని పెళ్ళి చేసుకోకూడదూ?"

"మీ చెల్లెల్నా?"

"అవునండీ. మా చెల్లెల్నే. నా మంచితనమంతా దుఃఖంగా మారిపోయింది. దాని మంచితనం అందంగా మారిపోయింది"

"..."

"మా చెల్లెలు నాకంటే తెలివైనది. అంతా సంతోషిస్తాం చేసుకుంటే"

"నాకు పెళ్ళి ముఖ్యం కాదు. మిమ్మల్ని చేసుకోవాలని ఆశపడ్డాను."

"మా చెల్లెలి పెళ్ళయితే కొంతయినా కుటుంబంలో సంతోషం ఉంటుందని ఆశపడ్డాను"

"...."

"మొదట్నుంచీ మీ స్నేహం నాకు సంతోషాన్ని కలిగిస్తోంది. ఇప్పుడు కూడా ఆ సంతోషం ఉండనివ్వండి"

"...."

"మీరు సరేనంటే నా పుట్టినరోజు నాడు ఓ ఒక్క సంతోషం మిగులుతుంది"

"..."

"ఇంకొకరికి సంతోషం కలగచేస్తున్నాననే సంతోషం"

"..."

"ముకుందరావు గారూ ముకుందరావుగారూ! మాట్లాడరూ!"

"..."

"మీ మాటమీద చెల్లెలి జీవితమంతా ఆధారపడి ఉంది"

"...."

"ముకుందరావుగారు"

పక్కకి తిరిగితే –

ఏరీ ముకుందరావుగారు.

మొదటి మాట విన్నప్పుడే నిలిచిపోయారు.

నిలిచిపోయి ఏదో ఆలోచిస్తున్నారు.

మనిషి నిలిచాక మనస్సు కదిలిపోతున్నట్టుంది.

ఆలోచించి ఎక్కడికో నడిచిపోతున్నారు.

పలకడంలేదు.

ఆయన కోరిక వల్ల నేను బాధపడ్డాను.

చెల్లెల్ని ఆయన పెళ్ళిచేసుకుంటే ఎంత బాగుండును?

నన్ను పెళ్ళిచేసుకుంటే?

వద్దు. వద్దు, ఆ ఆలోచనవద్దు.

ఈ జీవితానికి ఆ ఆలోచన వద్దు.

భగవాన్

ఈ పుట్టిన రోజుకీ ఏ ప్రత్యేకతా నిలపలేదా నువ్వు.

ఈ పుట్టినరోజూ ఇదివరకటి పాతవాటిలాగే గడిచి పోయిందా?

భగవాన్! భగవాన్.

ఈ పుట్టుక మీద విసుగు పుట్టింది -

వచ్చే పుట్టిన రోజుని నన్ను చూడనివ్వకు.

చూడనివ్వకు. చూడనివ్వకు.

***సుందరి.***

అబ్బ! ఇవాళెంత గడ్డురోజు.

ఎంత ఘోరం జరుగుతుందని భయపడ్డానో అంతా జరిగిపోయింది.

ప్రేమ కలలన్నీ చిరిగిపోయాయి.

ఛీ..ఛీ! ప్రేమ ఎంత చెడ్డది?

ఎంత గుడ్డిది?

అక్కని కూడా కొట్టగలిగే ధైర్యం ప్రేమించకపోతే వచ్చేదా?

అక్కని కొట్టాను.

నాకు కొట్టడానికి శక్తిని పెంచిన అక్కనే కొట్టాను.

అక్క చదువు నేర్పించింది.

చదువు ప్రేమను నేర్పించింది.

చదువు అక్కను కొట్టించింది.

నాకు చదువెందుకు నేర్పించావాక్కా?

చేసిన తప్పులకి ఏడవగలగడానికా?

ఎందుకూ పనికి రాని వ్యక్తిమీద నీ ప్రయత్నాలు ఎంత వృధా అయాయో చూశావా?

ఛీ..ఛీ మనిషికి ప్రేమ ఉండకూడదు.

మనిషికి సుఖం ఉండకూడదు.

ఉంటే కళ్ళు కనిపించవ్.

ప్రేమ లేని వ్యక్తి అక్కలాగా పవిత్రంగా ఉంటారు.

సుఖం లేని వ్యక్తి అక్కలాగా ఓర్పుతో ఉంటారు.

ఈ చదువు లేకపోతే ఎంత బాగుణ్ణు.

ఏమీ చదువు లేకుండా బ్రతకడంలో ఎంత సుఖం ఉంది.

అమ్మలో ఎంత గొప్పతనం ఉంది.

నాకీ చదువొద్దు.

నాకీ అందం వద్దు.

నాకీ ప్రేమ వద్దు.

నేను నేనయిపోతే, పాత నేనయిపోతే.

చదువుకుని నేను పాడయిపోయాను.

చదువుకోక అక్క బాగు పడింది.

ప్రేమకు పూర్వాపరాలు లేవు.

ప్రేమికులంతా ఇంతేనేమో!

లేకపోతే రచయితలంతా ఇంతేనేమో! కవిత్వం చెపితే ఏం లాభం? చిత్త శుద్ధి లేకపోయింతరువాత?

మనస్సులో నిజాయితీ లేనివాళ్ళు మాటల్లో నీతుల్ని చేరుస్తారు.

నీతిగా బ్రతికే వారికి నీతులు చెప్పడానికి తీరిక ఉండదు.

యౌవనం తరుచు మోసపోతుంది కాబోలు?

అనుభవం దానిని సరిదిద్దాలి.

అప్పుడు యౌవనం అనుభవాన్ని ఎదిరిస్తుంది.

అక్కని 'సుందరి' అనే ఫూల్ ఎదిరించింది.

ఎదిరించి ఏడుస్తోంది.

ఎదిరించినందుకు ఏడుస్తోంది.

ఇవాళెంత చెడ్డరోజో అంత మంచిరోజు.

చెడ్డ: అక్కని కొట్టడం.

మంచి: అక్క నన్ను మనిషిని చేయడం.

అక్క ప్రశ్న వేస్తే మాట్లాడడేం వేణూ!

ఇంత ప్రేమించే వేణూ!

"సుందరిని నువ్వు ప్రేమిస్తున్నావా"

"ప్రేమిస్తున్నాను. ప్రేమిస్తున్నాను"

"పెళ్ళి చేసుకుంటావా?"

"ఇప్పుడే ఇప్పుడే"

అంటాడనుకున్నాను.

కానీ అనుభవం ధాటికి కోరిక చెదిరిపోయింది.

"ప్రేమకాదు, కోరిక అది" అంది ప్రేమ.

అవును కోరికే.

ప్రేమంటే నీ కోసం అతను చావాలి.

కోరికంటే అతని కోసం నువ్వు చావడం - అంది అక్క. నిజమే. కోరికకు ఆడదే బలి అయిపోతుంది.

ఇప్పుడర్థమయింది.

వేణూ కవిత్వాన్ని ప్రేమించాను.

వేణూ మాటల్ని ప్రేమించాను.

వేణూ మనస్సుని ఎప్పుడూ చూడలేదు.

మాటల్నే చూపాడు.

మాటలే మనస్సనుకున్నాను.

మనస్సు మాటల్లో లేదు.

అందుకని మోసపోయాను.

ఆడది మనస్సుతో మాట్లాడినంత వేగంగా మగాడు మాట్లాడడు.

అందుకే ఆడదాని మనస్సు త్వరగా నలిగిపోతోంది.

సైకాలజీ అంతా అన్నయ్య చెప్పాడు.

"చెల్లాయి ఎంత తప్పు పనిచేశావ్" అన్నాడు.

ఇంకెప్పుడూ చెయ్యను అన్నయ్యా!

అక్కయ్య రక్షించిందన్నయ్యా.

"ఎంత తప్పు పని చేశావు చెల్లీ!"

నేను పాడవలేదు అక్కా!

నేను మోసపోయాను. ఇంకా నాశనం కాలేదు.

"చదువు ఎంత పాడుచేసిందే నిన్ను?" - అమ్మ.

అవునమ్మా! పాడయిపోయాను.

నీలాగ పవిత్రంగా ఉండడం తెలీక పాడయ్యాను.

నీ దగ్గర ఉంటే బాగుండేదాన్ని.

చదువు దగ్గరకి వెళ్ళి పాడయాను.

"చదువు పాడు చెయ్యలేదు నిన్ను. నీ ఆవేశం నిన్ను పాడుచేసింది" - అన్నయ్య.

అవును నేనే -

నన్ను నేనే పాడుచేసుకున్నాను.

మీరంతా డబ్బు లేక బీదతనం అనుభవిస్తే -

నేను తెలివిలేక బీదదాన్నయాను -

తెలివి దార్రిద్యం కంటే డబ్బు దార్రిద్యమే మంచిది.

ఇప్పుడు తెలివి దార్రిద్యం పోయింది.

డబ్బు దార్రిద్యమే నాకూ ఉంది.

ఇదే బాగుంది

నాకు ధనం వద్దు.

అందం వద్దు.

కోరిక వద్దు.

చదువు వద్దు.

వేణూ వద్దు.

**మూడవరోజు**

**హనుమంతయ్య**

బాగుందయ్యా! బాగుంది -

అంతే చేయాలి. అలాగే చేయాలి.

కష్టాలు పడేవాడికి కష్టాల మోతాదు ఎక్కువయిపోతే సుఖం అయిపోతుంది.

సుఖాన్ని ఎక్కువగా ఇవ్వలేకపోయినా కష్టాల్ని పెంచితే చాలు -

సుఖపడిపోతాం.

ఇంతకన్నా కష్టాలేం వస్తాయి నాకు.

కాలు విరిగిపోయింది.

సైకిలు కోసం తెచ్చుకున్న ఏభయ్యీ పోయింది.

అంతకుముందే నా ఆస్తి పోయింది.

వీటన్నిటికీ ముందు నా తెలివి పోయింది.

నా కూతురు సుందరి పాడవబోయింది.

ఓహ్హో! ఓహ్హో! హ్హో

ఎంత కొంత కారివయా?

నువ్వు నాకింతవరకూ కష్టాలనిచ్చి భయపెట్టావు.

ఇక నేను నీకు సవాలు చేస్తాను.

ఇక బాధపెట్టు చూస్తాను.

రెండో కాలు విరుపుతావా?

విరగనీ.

నా ఆస్తులు లాగుకుంటావా?

ఈ పిల్లలు తప్ప నాకు మరో ఆస్తిలేదు.

నాకు సుఖాల్లేవు.

డబ్బులేదు.

అహ్హాహ్హా - బీదవాళ్ళని కష్టపెట్టడం కూడా సమస్య భగవంతుడికి.

కష్టాలుపడే బీదవాడిని ఇంకేం చేస్తాడు?

"నాన్నా! నాన్నా! నీ ఫోటో పత్రికలో పడింది."

"పడిందా! పడిందా! ఏదీ ఏదీ!"

"క్రింద నీ గురించి ఏదో రాశారు నాన్నా!"

"చదువమ్మా. చదువు ఏం రాశారో!"

"హనుమంతయ్య అనునొక బీద రాజకీయ బాధితుడు ఆత్మహత్య చేసుకొనుటకై లారీకింద పడెను."

"అహా! అహా! ఎంత బాగా రాశారు. "

నేను ఆత్మహత్య చేసుకున్నానా?

నేను కాదయ్యా! నా కోరికలు ఆత్మహత్య చేసుకున్నాయి.

వాటిని బతికించుకోబోయాను.

కానీ చచ్చిపోయాయి.

50 రూపాయిల పెద్ద కోరిక చచ్చిపోయింది. అయితే అదీ నిజమే.

కోరికలు చచ్చిపోతే నేనూ చచ్చిపోయినట్టేగా?

అవునవును. హనుమంతయ్య చచ్చిపోయాడు.

కోరికలద్వారా హనుమంతయ్య మరణించెను.

రాజకీయ బాధితుడు, కోరికల బాధితుడగు బీద హనుమంతయ్య మరణించెను.

హ్హా హ్హా హ్హా హ్హా హ్హా

హ్హా హ్హా హ్హా హ్హా హ్హా హ్హా.

(10)

***వెంకటరావు***

ఇవాళతో ఇబ్బందులు బందీ తీరిపోవచ్చు.

ఇవ్వాళ్టితో ఇక్కట్ల టిక్కెట్టు చెల్లిపోతుంది.

అవసరాల కంపార్టుమెంటు విడిచి అవకాశాల కంపార్టుమెంటుమెంటుకు మార్పు.

ఆహా! మొదటి రోజుకి ఎన్నాళ్ళ నిరీక్షణ!

ఓహో! ఎప్పుడయినా రాదా ఈ రోజని తపన

పోనీ, పోనీ, పాతరోజులు ఎలాగయినా పోనీ.

ఇకనయినా మనిషి ననిపించుకోవచ్చు.

అమ్మా నాన్న నన్ను చూసి సిగ్గుపడనక్కరలేదు.

కొన్నాళ్ళకి జీతం పెరిగితే చెల్లెలు కూడా ఉద్యోగం చెయ్యనక్కరలేదు.

పక్క ఇళ్ళవాళ్ళు పరువు తీసే మాటలు పలకనక్కరలేదు.

జీవితం పరుగులో అప్పుడే పది అవకాశాలు వెనక బడ్డాను.

పది పదుల గజాలు ఇవాల్టినుంచీ ముందుకు ఉరుకుతాను.

ప్రతిసారీ నా కళ్ళలో దిగులు నా ఉద్యోగార్హతను పోగొట్టింది.

ప్రతిసారీ నా హృదయం పగిలి బాధాజ్వాలలు పైకి చిమ్మాయి.

ఉద్యోగం కోసం ఉవ్విళ్ళూరింది 23 ఏళ్ళ మనసు.

ప్రేమకోసంకాక, ఉపాధికోసం ఏడ్చింది 23 ఏళ్ళ వయస్సు.

శక్తికి పరీక్ష పెట్టలేదు ప్రపంచం -

అంతస్తుకి పరీక్ష పెట్టింది.

అయ్యో! అయ్యో! ఎప్పుడూ ఓడిపోవడమేనా అని బాధపడడం తప్పలేదు.

ఏమో ఏమో ఎప్పుడన్నా ఎదిరించి నిలువమా అన్న ఆశపోదు.

ఇవాళ కొత్తరోజు.

ఇవాళ గొప్ప రోజు.

ఉద్యోగం వచ్చిందని కాదు.

ఉద్యోగం వస్తుందని.

"ఉద్యోగం వస్తుందని నీకెలా తెలుసు వెంకట్రావు బియ్యే?"

నా చెల్లెలు రికమండేషన్ ఉంది.

నా చెల్లెలు నాకంటే తెలివైనది.

నా చెల్లెలు నా కంటే రెండేళ్ళ ముందునుంచే బ్రతుకుతోంది.

నా చెల్లెలు నన్ను పోషించగల స్తోమత గలది.

అంతకు మించి నా చెల్లెలు ఆడది.

ఎన్ని క్వాలిఫికేషన్లు.

ఇంటర్వ్యూ.

"నువ్వేం చెయ్యగలవయా గ్రాడ్యుయేటా? "

"ఎంత బాగా పిలిచారు?

"ఈడియట్? అనటానికి బదులు గ్రాడ్యుయేటా?

"నువ్వేం చెయ్యగలవు?"

గోళ్ళు గిల్లుకోగలను.

ఏడవగలను.

లెక్కలు వచ్చేవి.

నా అదృష్టానికి లెక్కలు కట్టుకోవడంలో లెక్కల శక్తి ఖర్చయిపోయింది.

హిస్టరీ వచ్చేది.

నా హిస్టరీ మిస్టరీలో ఆ స్టోరీ మరిచిపోయాను.

"వెంకట్రావు బియ్యే కెన్ రైట్ స్టోరీస్"

కథలు చెప్పగలను సార్.

అమ్మో! అమ్మో! అలా చెప్పకూడదు.

"మీరు చెప్పినవన్నీ చేస్తాను సార్"

"కాఫీ తెస్తావా?" అని అడిగితే -

అమ్మో! కాఫీలు తీసుకురావడానికి బియ్యే అర్హత చాలదు.

"అనవసరంగా చదువుకున్నాను సార్. లేకపోతే కాఫీలు తెచ్చేవాణ్ణి. క్షమించండి. నాకా అర్హత లేదు"

ఇంటర్వ్యూల గురించి ఆలోచించాలని లేదు.

ధనవంతుల ఆలోచనకి మారుపేరు 'అదృష్టం.'

బీదవాళ్ళ ఆలోచనకి మారుపేరు 'భయం.'

ఆలోచించవద్దు.

ఆలోచనా రహితుడగు వెంకట్రావు ఉద్యోగంబునకు చనె.

"సార్!"

మేనేజరుగారు తల ఎత్తారు.

నావేపే చూస్తున్నారు.

ఆయన కుక్కవేపు చూసిన మెజెస్టిక్ చూపే నా వేపు ప్రసరించారు.

"వాట్!"

అమ్మో! ఇంగ్లీషులో అడిగారు.

జవాబు సిద్ధం చేసుకున్నాను.

ఏం చెప్పాలో తెలీదు.

"ఐయాం గాయత్రీస్ సిస్టర్ సార్ - సారీ బ్రదర్ సార్!"

కూచోమని కళ్ళతో చెప్పారు.

గాయత్రి అన్నయ్యని కనక కూర్చునే యోగ్యత.

వెంకట్రావు బియ్యేకి ఆ అర్హత లేదు.

"ఏమి? వచ్చినావు?"

ఇంగ్లండు వెళ్దామని నాలుగు నెలలు ప్రాక్టీసు చేసిన ఇంగ్లీషులాంటి తెలుగునే మేనేజరుగారు మాట్లాడుతున్నారు.

"ఉద్యోగానికి సార్"

"ఏం ఉద్యోగం?"

"ఏమో! మా చెల్లెలు చెప్పింది సార్ - మీరు ఇవాళ రమ్మన్నారని"

మేనేజరుగారు నవ్వుతున్నారు.

నోరు విప్పి నవ్వుతున్నారు.

నోటిలో కిళ్ళీ ఎరుపు పెద్ద గనిలాగ కనిపిస్తోంది.

"మీ చెల్లెల్ని రమ్మన్నానుకాని నిన్ను కాదు"

అర్థమయింది. అర్థం కాలేదు.

అర్థమయ్యినట్టూ అర్థం కాలేదు.

"ఉద్యోగం నాకు సార్"

"అయినా మీ చెల్లెలితోనే మాట్లాడాలి"

భేష్! భేష్

నా ఉద్యోగానికి నా చెల్లెలికి ఇంటర్వ్యూ.

"మీ అన్నయ్య మంచివాడా కాడా?" ప్రశ్నవేస్తాడు గాయత్రిని.

"మంచివాడేనండి"

"సాక్ష్యం?"

"నేను"

ఈ ప్రపంచంలో నిరుద్యోగి చెల్లెలుగా పుట్టడమన్నా మేలే.

నిరుద్యోగి మాత్రం కాకూడదు.

**గాయత్రి**

ఛీ! ఈ బ్రతుకు మీద విసుగు పుట్టోంది.

ఈ ఉద్యోగం మీద విసుగు పుట్టోంది.

ఈ రొటీను మీద విసుగు పుట్టోంది.

ఇదివరకు పాడు బ్రతుకునీ, పాడు ఉద్యోగాన్నీ తలుచుకు ఏడ్చాను.

ఇప్పుడు ఈ బ్రతుకూ, ఈ ఉద్యోగం వద్దని ఏడవాలనిపిస్తోంది.
ఇదివరకు అసహ్యం పుడితే ఇప్పుడు చిరాకు పుట్టింది.
సుందరి కాలు జారబోయిన తర్వాత.
నాన్న కాలు విరిగిన తరువాత.
అన్నయ్య ఉద్యోగపు ఆశలు పోయిన తరువాత -
ఇన్ని బాధ్యతల్ని భరిస్తూ ఈ బ్రతుకు.
ఛీఛీ నాకు చచ్చిపోవాలనిపిస్తోంది.
చచ్చిపోతాను. చచ్చిపోతాను.
ఎప్పుడో ఒకసారి వీలుగా చచ్చిపోతాను.
చావడమన్నా తీరుబాటుగా జరుపుకుంటాను.
పుట్టినరోజునాడు తృప్తి దొరకలేదు.
చచ్చిన రోజయినా తృప్తి దొరికేట్టు చేసుకుంటాను.
ఈ కుటుంబానికి మరో ఆస్కారం దొరికాక చచ్చిపోవాలి.
అన్నయ్యకి ఉద్యోగం దొరికితే బాగుండును.
సుందరికి పెళ్ళి జరిగితే బాగుండును.
రాజకీయ బాధితులకు ప్రభుత్వం ఏదన్నా సహాయం చేస్తే బాగుండును.
అమ్మ దుఃఖం తీరితే బాగుండును.
కానీ -
నాకు మళ్ళీ యవ్వనమంతా వస్తే బాగుండదా?
నా కోరికలు కూడుకొంటే బాగుండదా?
నా ఆశలు నిలిస్తే బాగుండదా?
వద్దు. వద్దు బాగుండదు. బాగుండదు.
ఆశలకోసం ఆలోచించి అలసిపోయాను.
కోరికల కోసం ఊహించి విసిగిపోయాను.
ఆశలు వద్దు. కోరికలు వద్దు.
ఇంకేం కావాలి గాయత్రీ.
చచ్చిపోవాలి. చచ్చిపోవాలి.
చావుకావాలి చావడం కావాలి.
గాయ 'త్రీ' లోంచి ఏదో అర్థం వస్తోంది.
గాయములు తగిలిన చెట్టు.
కొమ్మలు విరిగిన చెట్టు.
కోరికలనే కొమ్మలు విరిగిన చెట్టు.

నా జీవితాన్ని నా పేరులోనే బంధించారు.
ఇన్నాళ్ళూ ముకుందరావు నువ్వు నా బ్రతుకుమీద ఆశ నిచ్చేది -
కానీ నిన్న ముకుందరావు ఏడ్చాడు.
సుందరి కుటుంబాన్ని సాకుతుందన్న ఆశ నా నడుమును నిలబెట్టింది.
కానీ నిన్నటి సుందరి నా నడుం విరగ్గొట్టింది.
అన్నయ్య ఉద్యోగం - పాపం పిచ్చి అన్నయ్య.
ఇవాళ ప్రయత్నమన్నా ఫలిస్తే బాగుండును.
మా మేనేజరు గుండె కరిగితే బాగుండును.
మేనేజరుకి గుండె లేదు.
కళ్ళు మాత్రం ఉన్నాయి.
అవి ఆడవాళ్ళను చూసినప్పుడే కదుల్తాయి.
నౌకర్లతో చేతుల్తో, ఆడవాళ్ళతో కళ్ళతో మాట్లాడుతాడు.
ఏ ఆడదయినా చెప్పులతో మాట్లాడితే బాగుండును.
చెప్పులతో మాట్లాడటమేమిటి నా మొహం
చెప్పిచ్చువాడు వైద్యుడు.
కొందరి వెధవత్వానికి నాతో మాట్లాడతానంటాడేమిటి?
పళ్ళు రాలాలంటే తుంటిమీద కొట్టాలన్నమాట.
పోనీ. పోనీ.
ఎలాగయినా అన్నయ్యకి ఉద్యోగం దొరికితే అంతేచాలు.
అన్నయ్య జీవిత లక్ష్యమంతా ఉద్యోగమే అయిపోయింది.
మంచి ఉద్యోగం కాదు - ఏదో ఒక ఉద్యోగం.
సాయంకాలం మేనేజరుగారు గదికి రమ్మన్నారు.
అన్నయ్య మంచి చెడ్డల్ని నా మాటల్తో తూకం వేస్తారు కాబోలు.
గాయత్రి అన్నయ్య అగుటచేత వెంకట్రావు ఉద్యోగమునకు అర్హుడు.
గాయత్రి అన్నయ్య ఆంజనేయులు అయినా, ఆషాఢభూతి అయినా ఉద్యోగమునకు అర్హుడు.
కాలం సాయంకాలాన్ని తరుముకు వచ్చింది.
ఆఫీసు గడియారం అయిదు గంటలకే నిద్రపోయింది.
ఉద్యోగులందరూ వెళ్ళిపోయే వరకూ ఆగమని బోయ్ చెప్పి వెళ్ళాడు.
చివరికి బోయ్ కూడా వెళ్ళిపోయాడు.
ఆఫీసు ఆ రోజుకు పనిచాలించి నిద్రపోవడం ప్రారంభించింది.
మేనేజరు గదిలో ఊదొత్తులు వెలిగాయి.
వెంకటేశ్వరుడి పటం, కాళ్ళుమాత్రం తలుపు సందులోంచి కనిపిస్తున్నాయి.

మేనేజరుగారు నల్లకోటు వేసుకున్నారు.

నల్లమేనేజరుగారి నల్లటి కోటు.

నల్లటి కోరికలు, నల్లటి బుద్దులు.

పిలుస్తున్నారు. పిలుస్తున్నారు.

"గాయత్రీ గాయత్రీ దేవీ "

ఓహో! పేరులో ఎంత మార్పు.

'స్టెనో' బికేమ్ గాయత్రీ

మేనేజరు తలుపు తెరిస్తే ఏవో వాసనలు శరీరాన్ని చుట్టేస్తున్నాయి.

టేబులు మీద ఏపిల్ పళ్ళబుట్ట పెట్టుకున్నారు.

మల్లెపువ్వులు తెచ్చి పెట్టుకున్నారు.

ఫ్లాస్కులో కాఫీ పెట్టుకున్నారు.

మేనేజరు ఇవాళ కొత్తగా అవుపిస్తున్నారు.

మేనేజరు పిలుపు కొత్తగా ఉంది.

"గాయత్రీ! కూచో"

మేనేజరు కళ్ళు కొత్తగా ఉన్నాయి.

మేనేజరు గొంతు కొత్తగా ఉంది.

గొంతు అధికారాన్ని మరిచిపోయి, ఆవేశాన్ని తెచ్చుకుంటోంది.

"కూచో స్టెనో!" అనడం కొత్త ఆ గొంతుకి.

'గాయత్రి' పేరు ఆ గొంతులో వణికింది.

మేనేజరుగారు నవ్వుతున్నారు.

మేనేజరుగారు నవ్వితే ఏడిచినట్టుంటుంది.

మేనేజరుగారు ఏడిచినా ఏడిచినట్టే ఉంటుందేమో?

మేనేజరుగారు ఎప్పుడూ ఏడవలేదు.

చాలామందిని ఏడిపించారు.

ఇప్పుడు ఏడిచినట్టు నవ్వుతున్నారు.

"మా అన్నయ్య ఉద్యోగం గురించి నాతో మాట్లాడతానన్నారట?"

"అవునవును. మాట్లాడాలి"

"బస్సుకు వేళవుతోంది"

"అవునవును. అవుతుంది."

"ఏ విషయం చెపితే వెళ్తాను"

"అవునవును వెళ్తావు"

కాదు. కాదు. వెళ్ళవు.

మేనేజరుగారు వణుకుతూ లేచారు.

పువ్వులు చేత్తో పట్టుకున్నారు.

నల్లటి చేతిలో తెల్లటి పువ్వులు.

పాపం చేతిలో మంచితనంలాగ -

ఏం చేస్తారు పువ్వుల్ని?

"తీసుకో" అన్నారు.

నన్నే! నన్నే!

పువ్వులు పెట్టుకోకూడదన్న మేనేజరుగారు పువ్వుల్నిస్తున్నారు.

ఎప్పుడూ నవ్వని మేనేజరుగారు నవ్వుతున్నారు.

ఎప్పుడూ వణకని మేనేజరుగారు వణుకుతున్నారు.

"నేను పోతాను సార్. రేపు ఏ విషయం చెప్పండి"

"గాయత్రీ"

గాలికి కిటికీ టప్పున కొట్టుకొంది.

మేనేజరుగారు ఉలిక్కిపడ్డారు.

నవ్వారు.

పువ్వుల్ని హుషారుగా మీదికి ఎగరేశారు.

అవి ఫాన్‌లో ఇరుక్కుని బెదిరిపోయాయి.

బెదిరిపోయి చెదిరిపోయాయి.

ఇంకా నవ్వుతున్నారు మేనేజరుగారు.

ఈ తలుపు ఎంతకీ రాదేం?

ఇంత బరువు తలుపులు గాలికి బిగిసుకుపోయాయేం?

గాలికి కాదు - కోరికకి -

మేనేజరుగారు నవ్వుతున్నారు.

పువ్వులు బెదిరిపోవడాన్ని చూసి నవ్వుతున్నారు.

నన్ను చూసికూడా నవ్వుతున్నట్టున్నారు.

"ఏంటండీ ఇది?"

"ఏది? ఏది?"

"నన్ను పోనివ్వండి"

వెళ్ళు వెళ్ళు

వద్దు. వద్దు.

వెళ్ళకు. వెళ్ళకు.

"మీ అన్నకు ఉద్యోగం కావాలా?"

"అవును సార్"

" పోనీ నీకే రెండు ఉద్యోగాలు ఇచ్చేదా?"

"అదేమిటి సార్?"

మేనేజరుగారు కళ్ళు చికిలించారు.

"ఒకటి టేబులు దగ్గర. ఒకటి ఇక్కడ -"

గుండె వేపు వేలు చూపెట్టారు.

ఏదో రిహార్సల్స్ వేసుకున్నట్టున్నారు.

తడువుకోకుండా చెప్పారు.

చెప్పి గర్వపడ్డారు.

గర్వపడి నవ్వారు.

నవ్వి దగ్గరకు వస్తున్నారు.

నాకు కోపం రావడం లేదు.

ఏడుపు వస్తోంది.

విసుగు వస్తోంది.

"నీకు నా మీద కోపం లేదు. నాకు తెలుసు"

మేనేజరుగారు నవ్వులో ప్రేమను మిళాయించారు.

అధికారంతో ఉన్న గొంతులో ప్రేమ నలిగిపోయింది.

ప్రేమ, జాలి, దయ, వణుకుదల - అన్నిటినీ కలిపి మసాలా చేశారు.

"గాయత్రీ! నువ్వు తెలివైన దానివి"

మేనేజరుగారి చేతులు కదులుతున్నాయి.

"గాయత్రీ! నువ్వు అందమైనదానివి"

మేనేజరుగారు కళ్ళు కదులుతున్నాయి.

"గాయత్రీ! నువ్వు మంచిదానివి"

మేనేజరుగారు కదులుతున్నారు.

కదిలి కదిలి దగ్గరకు వస్తున్నారు.

కర్పూర తైలం కమ్మని వాసన తెలుస్తోంది.

జాస్మిన్‌కో సెంటు మరీ దగ్గరవుతోంది.

మేనేజరు చీలిపోయి వెయ్యి మేనేజర్లుగా మారి పోయారు.

కళ్ళముందు మేనేజరుగారి విగ్రహం, ఆఫీసుగది నీళ్ళు నీళ్ళుగా కారిపోతోంది.

శరీరమంతా భగ్గున మండిపోతోంది.

మేనేజరుగారి చెయ్యి భుజం మీద వణుకుతోంది.

ఏడవాలంటే ఏడుపు రావడం లేదు.

మేనేజరుగారి రొమ్ము గుండెకు వత్తుకుంటోంది.

నిలవడానికి శక్తి చాలడం లేదు.

మేనేజరుగారు చెవిలో ఏదో చెప్పబోతున్నారు.

ఒళ్ళంతా కాలిపోతోంది.

మేనేజరుగారి చెయ్యితగిలిన స్థలాలు భస్మీపటలమయిపోతున్నాయి.

ప్రపంచం వెయ్యి వ్రక్కలై చీలిపోయింది.

మేనేజరుగారి పలకరింత చెవుల్లో గింగుర్లెత్తిస్తోంది.

ఇదేమిటి? - నేనిలా నీరుకారిపోతున్నానేమిటి?

నేను చచ్చిపోతున్నాను కాబోలు.

చచ్చిపోవడం అంటే ఇదే కాబోలు.

చచ్చిపోతున్నాను.

చచ్చిపోతున్నాను.

## (11)

***వెంకటరావు***

ఆహా! మేనేజరుగారు దయాస్వరూపుడు.

శాంతస్వభావి.

దైవసమానుడు

అందుకనే మా ఇక్కట్లు గుర్తించగానే ఆదుకోగలిగాడు.

ఆయన సమయానికి లేకపోతే గాయత్రి ఏమయేదో?

ముఖం తిరిగి కుర్చీలో కూలబడగానే ఆయన రిక్షాలో పంపబట్టిగానీ -

భగవాన్! భగవాన్!

నువ్వు దయామయుడివి

మేనేజరులాంటి దయామయుల్ని సృష్టించావు.

ముఖం తిరిగిపోయిందట. బోయ్ చెప్పాడు.

తిరిగే ఉంటుంది.

కష్టాలవల్ల, బాధలవల్ల నలిగిపోయింది.

పని వత్తిడివల్ల చిదికిపోయింది.

పాపం! పాపం!

ఎంత కరుణామయుడు మేనేజరు.

నాకు ఉద్యోగాన్నిచ్చాడు.

ఆమెను ఇంటికి దిగబెట్టిన బోయ్ తోనే ఉద్యోగం ఆర్డరు కూడా పంపాడు.

ఇక కష్టాలు గట్టెక్కాయి.

ఇక ఈ కుటుంబానికేం బాధలేదు.

ఇకనుంచి వెంకట్రావు ఉద్యోగి.

తన కుటుంబాన్ని తను పోషించుకోగలడు.

ఆహా! మేనేజరు దేవుడులాంటి వాడు.

గాయత్రిని రక్షించిన దేవుడు.

మా కుటుంబాన్ని రక్షించిన దేవుడు.

భగవాన్! ఈ దేశంలో మేనేజరులాంటి వాళ్ళని వెయ్యిమందిని సృష్టించు.

ఈదేశం బాగుపడింది.

కుటుంబాలు వర్ధిల్లుతాయి.

బీదలు తరిస్తారు.

భగవాన్! మేనేజరుకున్న మనస్సులాంటి మనస్సు వెయ్యిమందికియ్యి.

ఈ దేశం ధన్యమవుతుంది.

కుటుంబాలు సుభిక్షమవుతాయి.

పాపం! గాయత్రి.

రోజంతా పనిచేసి అలసిపోయింది. అలసిపోయి సొమ్మసిల్లింది.

కష్టాలు ఎంతకయినా దారితీస్తాయి.

ఇక ఇన్ని కష్టాలుండవు.

అందరి కష్టాలూ తీరిపోతాయి.

గాయత్రి మెల్లిగా కదులుతోంది.

గాయత్రి కళ్ళు కదులుతున్నాయి.

"చెల్లీ! ముఖం తిరిగిందా అమ్మా?"

పెదాలు కదులుతున్నాయి.

ఇంకా మాట రావడం లేదు.

పాపం. పాపం.

ఎంతగా నీరసించిపోయింది.

అదేమిటి? ఏడుస్తోంది.

చెల్లెలు ఏడుస్తోంది.

"ఎందుకమ్మా ఏడుస్తున్నావు? నీకేం బాధలేదు చెల్లీ! నన్ను చూడు - అన్నయ్యని."

"అన్నయ్యా"

బలహీనంగా గొంతు కదుపుతోంది.

ఏదో చెప్పాలనుకుంటున్నట్టుంది.

నేనూ ఓ విషయం చెప్పాలి.

మేనేజరు మంచితనం గురించి.

నా ఉద్యోగం గురించి.

"మేనేజరు.." గాయత్రే అంటోంది.

అరె చెల్లికే తెలుసు.

సస్పెన్స్ పోయింది.

"అవునవును. మేనేజరు చాలా మంచివారు చెల్లీ"

గాయత్రి కళ్ళు పెద్దవయాయి.

మళ్ళీ ఏడుస్తోంది.

అదేమిటి? అదేమిటి?

ముఖం కప్పుకు ఏడుస్తోంది.

"చెల్లీ! నాకు ఉద్యోగం దొరికిందమ్మా!"

సమాధానం దుఃఖం.

"ఇక నీకిన్ని కష్టాలుండవు"

దుఃఖం -

"నీకేమొచ్చింది చెల్లీ?"

ఏదో చెపుతున్నాయి పెదాలు.

మాట అర్థం కావటంలేదు.

దుఃఖం మధ్య భావం నలిగిపోతోంది.

"మేనేజరు చేతుల్లో.."

ఏమిటి ఏమిటేమిటి?

గాయత్రి చెదిరిన జుత్తుకి అర్థం తెలిసింది.

అలసటకు అర్థం తెలిసింది.

దుఃఖానికి అర్థం తెలుస్తోంది -

"గాయత్రీ!"

"అవునన్నయ్య - అవును. ఫ్లాస్కుతో బలంగా కొట్టాను. బయటికి రావాలంటే తలుపు వేసేశారు. తలుపు కేసి తల బాదుకున్నాను.

రక్తం వస్తే మేనేజరు భయపడ్డాడు.

నన్ను పట్టుకోబోయాడు -

తరువాత నేలన పడిపోయిన గుర్తు -"

ఇంకా చెప్తోంది.

ఏమిటేమిటో చెప్తోంది.

ఆ గండం నుంచి బయటపడ్డానంటోంది.

దేవుడు మేలు చేశాడంటోంది.

కానీ, అదేమీ వినిపించడంలేదు.

దారిద్ర్యం మీద ఐశ్వర్యం తిరుగుబాటే గుర్తుంది.

నిస్సహాయతను అధికారం ఎలా లోబరుచుకుంటుందో అర్థమయింది.

మేనేజరుగారి కళ్ళకు కొత్త అర్థాలు తెలిశాయి.

మేనేజరు నవ్వుకి వింత నిర్వచనం తెలిసింది.

చెల్లెలు బ్రతుకు ఒక్క క్షణంలో నలిగిపోవలసింది.

రక్తం ముఖానికి కళ్ళల్లోకి పాకింది.

చేతులు బరువైన ఆయుధం కోసం వెదుక్కుంటున్నాయి.

నిస్సహాయతకు 'తెగింపు' అనే అన్నయ్య ఉన్నాడు.

ఆ అన్నయ్య అధికారం మీద పగతీర్చుకోబోతున్నాడు.

చేతులు పిడికిళ్ళు తిరిగాయి.

పెదవులు పళ్ళకింద నలిగి రక్తం చిమ్మాయి.

మేనేజర్ని చంపితే ఏమవుతుంది?

జైలు - జైలు శిక్ష -

అంతేగా?

ఒక మంచిపనికి జైలుకు పోవడం చాలా చిన్నపని -

కర్రల్ని చీల్చే పాతగొడ్డలి కనిపించింది.

తలని చీల్చగలదా ఇది?

మళ్ళీ ప్రయత్నం ఉండకూడదు.

ఒక్కసారే - ఒక్క ప్రయత్నంలోనే -

దరిద్రుల బలాన్ని ఒక్కసారి గుర్తుచేసి

నిస్సహాయతకి పరాకాష్ట ఎలాంటిదో చెప్పి -

గాయత్రి దుఃఖాన్ని జ్ఞాపకం చేసి

మేనేజరు తలమీద ఒకే ప్రయత్నం -

కర్రల్ని చీల్చే గొడ్డలి ఇన్నాళ్ళకి తలని చీలుస్తోంది.

"ఎక్కడికి అన్నయ్యా ఎక్కడికి?"

"మీ మేనేజరు దగ్గరికి"

నా ఉద్యోగానికి నీ జీవితాన్ని అరణం తీసుకోబోయిన మేనేజరు దగ్గరికి -

గాయత్రి తుళ్ళిపడి లేస్తోంది.

ఈ గొడ్డలిని వదిల్తే లాభం లేదు.

త్వరగా పోవాలి.

ఈ రక్తం ఇప్పట్లో చల్లారదు.

"ఎక్కడికిరా వెంకు?"

నాన్న వస్తున్నాడు -

ఒంటికాలుతో గోడపట్టుకు కుంటుతూ వస్తున్నాడు.

"గాయత్రి మనస్సును చీల్చిన వాడి గుండె చీల్చడానికి నాన్నా"

ఏడుస్తున్నాడు నాన్న.

ఎప్పుడూ ఏడవని నాన్న.

ఆవేశం వల్ల కష్టాలు తీరవురా వెంకూ!

కోపం వల్ల కష్టాలే పెరుగుతాయి.

మనం బీదవాళ్ళం.

కోపం బీదవాళ్ళనే కాలుస్తుంది.

నాన్న ఏడుస్తున్నాడు.

ఏడుస్తూ అంటున్నాడు.

ఇంకా ఆగితే ఈ ఉద్రేకం చల్లారిపోతుంది.

గొడ్డలి పట్టు విడవకూడదు.

పరిగెత్తాలి - పరిగెత్తి మేనేజర్ని చంపి జైలుకి వెళ్ళాలి.

నా ఉద్యోగం ఇచ్చిన మేనేజరుకు మంచి బహుమతి ఇవ్వాలి.

"ఎక్కడికి నాన్నా! ఎక్కడికి?" అమ్మ వచ్చింది.

నాకాళ్ళకు చుట్టుకుపోతోంది.

కదలనివ్వడంలేదు.

గాయిత్రికి ఏమయినా మనిషి మిగిలింది.

చెడ్డవారయినా, చెడిపోయినా, కళ్ళకు కనిపిస్తే చాలు.

"నా కళ్ళకు కనిపించకుండా పోతావా నాయనా? " అంటోంది.

"నీకు తెలియదమ్మా..నేను.."

"వెంకూ ఇంత ఉద్రేకం నీవేం చేస్తున్నావో నీకు తెలియడంలేదు.

మీ అమ్మని చంపేస్తున్నావు.

నువ్వు జైలుకి వెళితే నేను బ్రతకలేను.

దరిద్రాన్ని సహించాను.

కష్టాల్ని సహించాను.

నాన్న జైలుకి వెళితే మీకోసం బ్రతికి ఉన్నాను.

మీరు జైలుకి వెళ్తారా?

జైళ్ళతోటే నా బ్రతుకు గడిచిపోవాలా?

నాకోసం బ్రతికి ఉండండి.

మీరు చెడిపోయినా, దొంగలయినా, నాశనమయినా నా కొడుకులు, నా కూతుళ్ళూ -

నాకళ్ళముందు బ్రతికి ఉండండి -

ఆ గొడ్డలితో నా జీవితం మీద వేటు వెయ్యకు.

నా ఒక్క ఆశనీ చంపెయ్యకు. "

**విష్కంభం**

ఈ నివేదికను అదృష్టదేవతా, దురదృష్టదేవతా కలిసి మూడోరోజు రాత్రి భగవంతుడికి సమర్పించారు.

దానిని చూసి భగవంతుడు నవ్వుకున్నాడు.

"సరిగ్గా వారి మానసిక భావాలను ఉన్నవి ఉన్నట్టు సిద్ధం చేశారా?"

"చేశాము" అన్నది దురదృష్టదేవత.

"మధ్య మధ్య వారి మనస్సుకి కూడా అందకుండా అంతరాంతరాళాల్లో మిగిలి కొట్టుమిట్టులాడే విపరీత, వింత భావాలను కూడా అక్కడక్కడ జోడించాము. వాళ్ళ సహజ స్థితికి మించి, మనస్సు పెరిగిన ఉన్నత స్థాయిలను కూడా చూపాము. ఇది వాస్తవంగా వారు ఊహించుకున్న చిత్రణ మాత్రమే కాదు. వారి సమాజ సమగ్రస్వరూపం ఇది -" అని వివరంగా చెప్పుకున్నారు ఇద్దరు దేవతలూ.

"ఇది వరకటి నీ కోరికను మళ్ళీ చెప్పు" అన్నాడు భగవంతుడు అదృష్ట దేవతను చూసి.

"పూర్తిగా దురదృష్టం, దుఃఖం, బాధ, దారిద్ర్యం ఆవరించిన కుటుంబాన్ని అదృష్టంలో ముంచి ఎత్తుతాను నేను"

దురదృష్టదేవత చిరునవ్వు నవ్వి ఊరుకున్నాడు.

భగవంతుడు తల పంకించాడు. "సరే సరే. ఈ కుటుంబం మీద అదృష్టాన్ని చిలికించు. నీకు సాధ్యమయినంత అదృష్టాన్ని చిలికించు. రేపటి వారి భావాల్ని మాత్రం కనిపెట్టు!"

ఇంకా అదృష్టదేవతకు పరిస్థితి అయోమయంగా ఉంది. ఇదంతా భగవంతుడు ఎందుకు చేస్తున్నాడో అర్థం కాలేదు. అయినా ఏ పనీ అర్థంలేకుండా భగవానుడు చేయమనడు - అని అనుకుంది అదృష్టదేవత.

చిత్తశుద్ధితో ఆ రాత్రి ఆ బీద, దీన, హీన కుటుంబాన్ని అదృష్టదేవత ఆవరించుకుంది.

***నాలుగవరోజు***

గాయత్రి (1)

ఈ కుటుంబంలో అదృష్టం ఇన్నాళ్ళకి తొంగిచూసింది.

ఇన్నాళ్ళకి ఇన్నాళ్ళకి మంచిరోజులు.

అందరికీ సంతోషం కలిగించే రోజు.

ఉదయాన్నే ఒక జీవితానికి సరిపోయే సంతోషాన్ని మోసుకువచ్చాడు ముకుందరావు.

ఎప్పుడూ విచారంగా ఉండే ముకుందరావు సంతోషాన్ని కూడా పంచిపెట్టగలడు.

బీద ముకుందరావు వద్ద వెలలేని సంతోషపు గనులున్నాయి.

"గాయత్రీ, మీ చెల్లెల్ని పెళ్ళిచేసుకుంటాను నేను."

"ఓహో! ఎంత గొప్ప విషయం చెప్పారు?"

మీ రుణం ఎట్లా తీర్చుకొనడం.

ఈ ఉపకారానికి ఈ సహాయానికి మా కుటుంబం జీవితాంతం మిమ్మల్ని గుర్తుపెట్టుకొంటుఉంది.

అదేమిటి ఇంకా ముకుందరావు కనుకొలకుల్లో నీరు నిలిచేవుంది.

పాపం దుఃఖాన్నిలాగే సుఖాన్ని తట్టుకోలేకపోతున్నాడేమో?

ఎంత మంచివాడు? ఎంత మంచివాడు.

నాలాకాకుండా సుందరయినా బాగుపడుతుంది.

నాలా కాకుండా ఉండాలనే చదువు చెప్పించాను.

కానీ నాకంటే హీనస్థితికి జారిపోయింది.

ఇప్పుడిక పరవాలేదు.

ముకుందరావుగారి భార్య అయిన సుందరి సుఖంగా బ్రతుకుతుంది.

ముకుందరావు మంచివాడు.

సుందరి మంచిది.

ఎంత మంచిరోజు ఇవాళ.

కుటుంబాన్ని పట్టుకు వేలాడుతున్న ఒక సమస్య అయినా తీరింది.

వివాహం! వివాహం!

ఎన్నాళ్ళకి ఆ మాట ఈ కుటుంబంలో వినిపించింది.

నా వివాహం గురించి అందరూ మరచిపోయారు.

నేనూ మరచిపోయాను.

కనీసం సుందరి పెళ్ళయినా గుర్తుకొచ్చింది.

ఒక్క వ్యక్తి పాడయితేగానీ మిగతావాళ్ళు బాగుపడరు.

ఒక కుటుంబం బాగుపడాలంటే బాగుపడని వ్యక్తి అండకావాలి.

వీళ్ళకి గాయ'త్రీ' ఉంది.

"అమ్మా! అమ్మా! సుందరి పెళ్ళి కుదిరింది"

"ఎలాగ? ఎలాగ?"

"ముకుందరావుగారని చెప్పేనే - ఆయన ఒప్పుకున్నారు."

"మంచిదమ్మా. మంచిది. కానీ -"

"ఏమిటమ్మా?"

"డబ్బమ్మా! డబ్బు ఎక్కడిది?"

అవును ఎక్కడిది?

పెళ్ళికొడుకు చవకగా వచ్చాడు.

కానీ పెళ్ళి చవకగా రాదే!

డబ్బులేని పెళ్ళికొడుకు, డబ్బులేని పెళ్ళికూతురుని చేసుకోవాలన్నా డబ్బు కావాలి.

"నీ ఉద్యోగాన్ని కూడా వదులుకున్నావు కదా?"

అవును వదులుకున్నాను.

ఇక అక్కడ పనిచెయ్యను.

ఆ మేనేజరు ముఖం చూస్తూ చావలేను.

డబ్బులేకపోతే బ్రతగ్గలం.

కానీ వ్యక్తిత్వం లేకపోతే బ్రతకలేం.

ఆ ఉద్యోగం వద్దు నాకు.

మరి డబ్బు! డబ్బు!

"అన్నయ్యా - డబ్బులేదు - చెల్లెలుకి పెళ్ళికావాలి"

డబ్బు! డబ్బు.

## (12)

***వెంకటరావు***

ఉద్యోగం పోతేపోయింది. చెల్లెలు బాగుపడింది.

ఉద్రేకం పోయాక నేనూ బాగుపడ్డానంటుంది అమ్మ.

కొందరు తమంతట తాము సంతోషాన్ని విశ్రాంతిని తెచ్చుకోలేరు.

వీళ్ళమీద శిక్షలాగే సంతోషాన్ని విధించాలి.

గాయత్రికి యావజ్జీవ నిర్బంధ సంతోష శిక్ష -

ఇక గాయత్రి ఉద్యోగం చెయ్యరాదు -

పోనీ! బ్రతికింది -

ఇన్నాళ్ళూ చచ్చిబ్రతికాననుకుంది -

ఇప్పుడు నిజంగా బ్రతికింది -

నాకు ఉద్యోగం వచ్చింది.

గాయత్రికి ఉద్యోగం పోయి, నాకు ఉద్యోగం రాకపోయినా సంతోషపడేవాడిని.

దాన్ని కష్టపెడుతూ ఏరోజూ సుష్టుగా భోజనం చెయ్యలేకపోయేవాడిని.

ఒక జీవితాన్ని వృథాచేసినప్పటి ఖర్చు. ఇందరి జీవితాలనిపించేది.

అమ్మయ్యా! ఇప్పటికి విశ్రాంతిగా ఊపిరిపీల్చుకునే సమయం వచ్చింది.

వెంకట్రావు బియ్యే, దిక్లర్క్ - తన కుటుంబాన్ని తను పోషించుకుంటాడు.

"అన్నయ్యకి డబ్బులేదు - చెల్లెలికి పెళ్ళికావాలి"

ఇంకా ఓ కొరత ఉండిపోయింది.

ఇంకా ఏ మూలో 'అసంతృప్తి' నినాదాలు జరుగుతూనే ఉన్నాయి.

డబ్బు! డబ్బు! డబ్బు!

దేశానికి బానిసత్వం నుంచి విముక్తి వచ్చింది అంటాడు మామయ్య

నాకు పెళ్ళి జరగపోవడానికి పెద్ద ఆటంకం అంటుందేమో సుందరి.

డబ్బంటే ఒక జీవితాన్ని వెచ్చించగా వచ్చిన ప్రతి ఫలం అంటుంది గాయత్రి.

డబ్బు ఒక బలహీనత, దేశభక్తిలాగా - అంటాడు నాన్న.

అమ్మ డబ్బు గురించి విన్నది కాని, డబ్బును చూడలేదు.

మనిషి మర్యాదను, హోదాను, ఆత్మవిశ్వాసాన్ని కొనుక్కునే సాధనం డబ్బు.

గాయత్రి ఉద్యోగం మానుకుని సుఖపడుతోంది.

సుందరి పెళ్ళిచేసుకుంటే సుఖంగా ఉంటుంది.

నాకు ఉద్యోగంవల్ల -

మామయ్యకు డబ్బువల్ల.

అలివేలును పెళ్ళిచేసుకుంటే మామయ్య డబ్బిస్తాడు.

కొందరికి పెళ్ళి చెయ్యడానికి డబ్బు కావాలి.

కొందరిని పెళ్ళిచేసుకుంటే డబ్బు వస్తుంది.

ఇంట్లో ఎవరికి చెప్పినా గుండె బాదుకుంటారు.

కుంటి అలివేలు అన్నివిధాలా కుంటిదని వీళ్ళ అభిప్రాయం.

ఈ సంతోషపు దినాన్ని డబ్బువల్ల దుఃఖపడేకంటే కుంటి అలివేలుని తలుచుకుని దుఃఖపడడమే మంచిది.

ఇవాళ కాగితం మీద నిరుద్యోగి వెంకట్రావు సంతకం చేస్తాడని మామయ్యకి మాటిచ్చాను.

కానీ హుందాగా ఉద్యోగి వెంకట్రావు వెళ్ళి అలివేలుని పెళ్ళిచేసుకుంటాడు.

డబ్బుతో సుందరి సుఖాన్ని కొనాలి ఇక్కడ.

"మామయ్యా! కాగితం మీద సంతకం చెయ్యడానికి వచ్చాను."

"వచ్చావా వెంకూ! రా రా"

"వచ్చావా బావా! నీకోసమే చూస్తున్నాను"

అలివేలు కళ్ళు నన్నంతా వెదుకుతున్నాయి.

స్త్రీకి వివాహం పెద్ద అలంకారం.

అసంతృప్తి చిత్రానికి పరిపూర్ణత.

అసమగ్రత కోసం అలివేలు కళ్ళు ఆతృత పడుతున్నాయి.

ఇవాళెంత మంచిరోజు.

డబ్బువల్ల నేను బాగుపడుతున్నాను.

నా వల్ల అలివేలు బాగుపడుతోంది.

డబ్బువల్ల నాకు తృప్తి, సంతోషం.

నావల్ల అలివేలుకు తృప్తి సంతోషం.

భగవాన్! నా వల్లకూడా ఇంకొకరి జీవితానికి సంతోషాన్నివ్వగల అవకాశాన్ని మిగిల్చావు.

నేను ధన్యుణ్ణి.

"అలివేలూ! ఏడుస్తున్నావా?"

"ఏడవడంలేదు బావా! - కానీ ఇవాళ కన్నీళ్ళు ఆగడంలేదు"

ఆగవు. నాకు తెలుసు.

నీ ప్రతి కన్నీటిబొట్టులో నీ జీవితం కోసం తపన ఉంది.

బాధ ఉంది.

"అలివేలూ! నీకిప్పుడు సంతోషంగా ఉందా?"

"కాదు కాదు. దుఃఖం వస్తోంది"

"అదే సంతోషం అలివేలూ! - పూర్తి సంతోషం ఎప్పుడూ దుఃఖమే"

"అలాగా బావా! అయితే సంతోషంగానే ఉంది"

ఈ ప్రపంచంలో పూర్తి సంతోషానికి అర్థం కన్నీళ్ళే.

పూర్తి దుఃఖానికి అర్థం కన్నీళ్ళే.

"నీ కాళ్ళకు నమస్కారం చేస్తాను బావా!"

"అలివేలూ! అలివేలూ! ఈ కన్నీళ్ళెప్పుడూ ఇలా కారుతూ ఉండాలని దీవించనా? "

"అంటే సంతోషమా బావా?"

"అవును. సంతోషం"

"దీవించు. దీవించు!"

"సుందరికి పెళ్ళి చేస్తున్నాం అలివేలూ!"

"అలాగా! అబ్బ! ఎంత మంచిమాట చెప్పావు. మీ రోజులు బాగుపడ్డాయి."

"నీ వల్ల సుందరి బాగుపడింది."

"ఎలాగ? ఎలాగ?"

"మామయ్య ఇచ్చే డబ్బుతో సుందరికి పెళ్ళిచేస్తాం"

"పోనీ, పోనీ. నాలాంటి దానివల్ల కూడా ఒక మేలు జరుగుతోంది"

"మరి వస్తా అలివేలూ!"

"ఇక డబ్బిస్తావా మామయ్యా. సుందరికి పెళ్ళి చేసుకుంటాం."

"ఇస్తాను. ఇస్తాను"

"ఉద్దేశించక నువ్వుకూడా మంచిపని చేస్తున్నావు మావయ్యా! సుందరికి పెళ్ళిచేస్తున్నాం"

"మంచిదిరా వెంకూ! మంచిదే"

"డబ్బిస్తావా మరి?"

"కాగితం మీద సంతకం పెట్టు మరి!"

"ఇంకా అలివేలుని చేసుకోనని భయమా? "

"అందుక్కాదు"

మాట తిరగడంలేదు మామయ్య.

అందుకేనని అతని ముఖం చెప్తోంది.

అందుకేనని నాకు తెల్సని మామయ్యకి తెల్సు.

ఉద్యోగి వెంకట్రావు సంతకం చేశాడు.

కాగితం సాక్ష్యంగా, నా సంతకం చేశాడు

కాగితం సాక్ష్యంగా, నా సంతకం సాక్ష్యంగా అలివేలుని వెంకట్రావు పెళ్ళిచేసుకుందుకు అంగీకరించాడు.

మామయ్య డబ్బు ఇవ్వడానికి లోపాయకారిగా అంగీకరించాడు.

అమ్మయ్య! అలివేలుకి పెళ్ళి అయిపోయిందని మామయ్య అనుకుంటున్నాడు.
అమ్మయ్య! సుందరి పెళ్ళవుతుందని నేను అనుకుంటున్నాను.
ఇక ఈ కుటుంబానికి కష్టాలుండవు.
వెంకటరావు బియ్యే ఈ కుటుంబపు కష్టాలు తీర్చలేక పోయాడు.
అలివేలు మొగుడగు వెంకట్రావు ఈ కష్టాల్ని తీర్చగలుగుతున్నాడు.
భేష్...!!

***హనుమంతయ్య***

ఒకటీ ఒకటీ కలిస్తే రెండవుతుందని నాకిదివరకే తెలుసు.
ఆ మాటే నేనెపుడూ చెప్పాను.
స్వరాజ్య నినాదాలతోపాటు ఒకటి ఒకటీ రెండనికూడా అరిచాను.
ఎవడూ వినలేదు.
నమ్మి చెడినవాడూ లేడు.
నమ్మక చెడిపోతే పోయారు.
ఒకటీ ఒకటీ రెండంటే - అర్థం ఎవడన్నా అడిగేడా?
ఒక కష్టమునకు మరొక కష్టమును కలుపగా నష్టము లేదు.
కష్టాలు పెరిగి పెరిగి సుఖం అయిపోతాయి.
ఇప్పుడు నా సంగతి చూడు.
కాలు విరిగిపోయింది కనుక నడిచే బాధలేదు -
చెయ్యి విరిగిపోతే చుట్టకూడా కాల్చే బాధలేకపోను.
కానీ వరలక్ష్మి దగ్గర కూచుని నా చేత చుట్టకాల్పించేదేమో!
వరలక్ష్మీ చుట్టలు కావాలి.
వరలక్ష్మీ సైకిలు కావాలి.
కాలు విరిగిన హనుమంతయా సైకిలెందుకయా!
మరచిపోయాను. మరచిపోయాను.
చుట్ట విరిగిన హనుమంతయా! కాలు ఎందుకయా!
ఏమిటో! వాక్యాలు మారిపోయాయి.
అర్థం బోధపడడంలేదు.
దీనిలోనూ ఒక గూడార్థం ఉంది.
జీవితం మారిపోతోంది - అర్థంకోసం ఎదురుచూడకయ్యా అని.
దేశం కోసం చావమన్నానప్పుడు.

చుట్టలకోసం చస్తున్నానిప్పుడు.

దేశమునకై పాటుపడిన హనుమంతయ్య చుట్టలు కోసం పాటుపడుతున్నాడు.

చుట్టలుకోసం ఛస్తున్నాడు.

చచ్చినట్టు పాటుపడుతున్నాడు.

"సుందరికి పెళ్ళి నాన్నా!"

సుందరి అంటే మా అమ్మాయి కాబోలు.

"సుందరంటే ఎన్నో కూతురమ్మా?"

"అదేమిటి నాన్నా! నీ రెండో కూతురు"

"ఓహో! రెండో కూతురుకి పెళ్ళి."

చుట్టలు సంపాదించుకోలేని వాడి రెండో కూతురికి పెళ్ళి.

భేష్! భేష్! భేష్!

భాష్! భాష్! భాష్!

ఒక కన్నుతో సంతోషించి ఒక కన్నుతో ఏడుస్తాను.

అయితే చిన్న గమ్మత్తు.

సంతోషం కంటివెంటా, దుఃఖం కంటివెంటా నీళ్ళు వస్తున్నాయి.

"స్నానం చేస్తారండీ - నీళ్ళు కాగాయి."

"స్నానమెందుకే నీ మొహం మండా! - కష్టాలతో తడిసి ఉన్నాను."

దుఃఖాలలో నానిపోయాను.

ఇబ్బందుల భయంతో, చలితో వణికిపోతున్నాను.

చలి! చలి! చలి

కలి! కలి! కలి

ఆకలి చలి! ఆకలి కలి!

"అన్నయ్యకు ఉద్యోగం వచ్చింది నాన్నా!"

సుఖంగా ఉంటే ఉద్యోగం ఎందుకు?

సుఖం లేని వాళ్ళకు ఉద్యోగం.

సంతోషంగా ఉండాలనే ఉద్యోగం వదులుకుని మరో ఉద్యోగం చేస్తానంటాడేమిటి?

వాడు దద్దమ్మ.

సుఖంగా ఉండే గుణం పిత్రార్జితం.

వాడికి దక్కలేదు.

ఆ గుణం సరాసరి నా చుట్టలకి వెళ్ళిపోయింది.

"అమ్మా! గాయత్రీ! మీ నాన్న చూడు. మంచం కిందకి దూరుతున్నాడు"

"అయ్యో! అయ్యో! అక్కడ పడుకున్నారేమిటండీ!"

"అరవకే! అరవకే!"

మంచం మీద కంటే మంచం కిందే వెచ్చగా ఉంది.

మంచాల్ని కొందరు సుఖం కోసం వేసుకుంటారు.

నేను సుఖం కోసం మంచాన్ని మీద వేసుకున్నాను.

అంటే మంచం కింద దూరాను.

సుళువు తెలిస్తే సుఖానికెన్ని మార్గాలు.

"నాయనా! వెంకూ! నాన్నగారికి బాగులేదు. వైద్యుడిని తీసుకురా"

"సరేనమ్మా! సరే సరే!"

వైద్యుడేం చేస్తాడు?

అప్పివ్వగలడా?

మందువేయగలడా, సత్యాపతి వీపుగోకగలడా?

నన్ను అలా వింతగా చూడకండ్రా!

నాలా ఉండాలని అనిపిస్తోందా?

ఉండలేక ఏడుస్తున్నారా?

నన్ను చూసి ఏడుస్తున్నారేమ్రా?

నా సుఖం చూసినా మీ కేడుపేనా?

నా కాలు విరిగిపోయిందని ఏడుస్తున్నారా?

ఏడవకండి -

కావలిస్తే రెండో కాలు విరుచుకుంటాను.

ఏడవకండి. ఏడవకండి.

వైద్యుడుగారు వచ్చినట్టున్నారు.

"ఏమండీ మా నాన్నగారికి ఏమయిందండి"

"ఏదండి మీ నాలిక చూపండి"

నీనాలిక చూపు. నాకేం ఇంత బాగా మాట్లాడుతుంటే నాలికెందుకూ?

"ఏమండీ డాక్టర్! ఏమయింది మా నాన్నకి?"

"వైద్యుడుగారూ! ఎలా ఉన్నారండీ ఆయన?"

"డాక్టర్ హౌ ఈజ్ హి?"

"మిస్టర్ వెంక్రటావ్ - మీ నాన్న రాజకీయాల్లో కొన్నాళ్ళు తిరిగారు కదూ?"

"అవును సార్! 20 ఏళ్ళు పనిచేశారు"

"కుటుంబంలో చాలా ఇబ్బందులు పడ్డారు కదూ?"

"అవును సార్!"

"మీ నాన్నగారు చాలా అదృష్టవంతులు"

"ఏమిటి డాక్టర్! అదేమిటి డాక్టర్!"

"అవును. మిస్టర్ వెంకట్రావ్! ఆయనకి మతి భ్రమించింది. ఆయనకింకేం కష్టం ఉండదు"

"డాక్టర్ నాన్నను బాగుచేసే మార్గం లేదా డాక్టర్"

లేదు. లేదు. లేదు.

లేదు. లేదు.

లేదు.

## (13)

***సుందరి***

ఇప్పుడిప్పుడే ఈ జీవితం ఒక దారిన పడుతున్నట్టుంది.

ఇప్పుడిప్పుడే మళ్ళీ మంచి బ్రతుకు మీద ఆశ కలుగుతోంది.

అక్కయ్య మంచితనం, అన్నయ్య ప్రేమ మళ్ళీ నా సుఖం మీద హామీని ఇస్తున్నాయి.

నాన్నగారు నన్ను అసహ్యించుకోలేదు.

అమ్మ నన్నేమనాలో తెలీక ఏడ్చింది.

ఇప్పుడన్నీ సరి.

అందరికీ నా మీద జాలి ఉంది.

అందరూ కలిసి నా జీవితాన్ని మరమ్మత్తు చేస్తున్నారు.

భగవాన్! డబ్బు వద్దు. అదృష్టం వద్దు.

మంచి అక్కనీ, అన్నయ్యనీ, అమ్మనీ ఇచ్చావు.

అంతే చాలు.

ఎప్పుడూ ఇంత తృప్తికరంగా లేను.

ఇక ముందు పవిత్రంగా బ్రతకవచ్చు.

ఇకముందు నన్ను నేను మోసం చేసుకోకుండా బ్రతకవచ్చు.

ముకుందరావు ఎవరో తెలీదు నాకు.

కానీ అక్కయ్య అతన్ని పెళ్ళి చేసుకోవాలనుకుందని అన్నయ్య అన్నాడు.

అక్కయ్య తప్పటడుగు వెయ్యదు.

ముకుందరావుగారితో మాట్లాడిన రోజున సంతోషంగా ఇంటికి వచ్చి నా ముఖంనిండా ముద్దులు కురిపించింది.

నా జీవితం మూడు పువ్వులూ, ఆరుకాయలూ అవుతుందంది.

నాకే కష్టం ఉండదంది.

నువు అదృష్టవంతురాలవంది.

అక్కయ్య నోటిమాట ఫలించాలి.

అక్కయ్య వరం వెయ్యేళ్ళు ఫలించాలి.

అక్కయ్యకు కృతజ్ఞతతో బ్రతుకుతాను.

పవిత్రంగా, ఆత్మ విశ్వాసంతో బ్రతకాలని ఎంత ఆతృత పడుతోంది మనస్సు.

ప్రేమతో ఉద్రేకాలతో ఎంత విసిగిపోయాను.

పోనీ ఇకనయినా మంచి బ్రతుకు ఎదురుగ్గా నిలిచింది.

భగవంతుడా! ఇట్లాంటి రోజుకే జీవితమంతా గడిచేటట్టు చెయ్యి.

ఈ అదృష్టం, ఈ సంతోషం. నాకే దూరంకాకుండా చూడు.

***వరలక్ష్మి***

అయిపోయింది. అయిపోయింది.

అనుకున్నంతా అయిపోయింది.

ఈ కుటుంబాన్ని చూస్తే ఎవరికయినా పిచ్చి ఎత్తుతుందనుకున్నాను.

చివరికి ఆయనకే పిచ్చి ఎత్తింది.

పోనీ. ఇప్పుడే నాన్న సుఖంగా ఉన్నాడు.

మనం బాధల్లోంచి తేరుకున్నామని సంతోషిస్తుంటే బాధలే మరిచిపోయేంత సుఖం అది - అంటాడు పెద్దవాడు.

చస్తే అందరికీ సుఖమే.

అలాగని చచ్చిపోతామా?

గాయత్రి ఉద్యోగం పోయింది.

అదీ మంచికే అంటాడు వెంకు.

పరువుపోవడంకన్నా ఉద్యోగంపోవడం మంచిది.

సుందరి పెళ్ళి.

చావుతప్పి కన్నులొట్టపోయినట్టు.

కానీ డబ్బెక్కడిదీ?

దరిద్రానికి బ్రతుకులు అంకితమయాయి.

ఈ ఇంట్లో పెళ్ళిళ్ళుకూడా అవుతాయా అనిపించింది.

వీటన్నిటి మధ్య మనస్సు రెపరెపలాడుతోంది.

సంతోషపడాలో దుఃఖపడాలో తెలీడం లేదు.

ఒక్కటిమాత్రం నిజం.

ఈ నలభై ఏళ్ళ జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ప్రశ్న రాలేదు.

సంతోషించాలా - విచారించాలా అని ప్రశ్న వేసుకోలేదు.

ఎలా ఏడవాలా? అన్న ప్రశ్న తప్ప.

నయమే. నయమే.

సంతోష విషయం కొంచెం సేపయినా ఆలోచించగలుగుతున్నాను.

ఈ సంతోషము బాగానే ఉంది.

దుఃఖంలో సంతోషం -

దుఃఖంలాంటి సంతోషం -

***గాయత్రి***

అన్నయ్య డబ్బు తీసుకువచ్చాననగానే అనుమానం వేసింది.

ఉద్రేకంలో అన్నయ్య మేనేజరు బుర్రమీద వేయవలసిన వేటు తన జీవితం మీదే వేసుకున్నాడు.

ముఖం చూస్తే నవ్వుతాడు.

ఇంకేం చేస్తాడు?

అలివేలుమీద నమ్మకం నాకు.

డబ్బుకోసం మామయ్య తనని అమ్మితే ఒప్పుకునే మనిషికాదు.

అయినా అన్నయ్యే తననికూడా ఒప్పించి ఉంటాడు.

సుందరి పెళ్ళికి అన్నయ్య అమ్ముడు పోయాడు.

చెల్లెలు సుఖం కోసం తన సుఖానికి ధరకట్టుకున్నాడు.

"మామయ్య డబ్బేనా?

"అవునమ్మా - ఎవరితో చెప్పకు. అప్పుతెచ్చినట్టు చెప్దాం. నాన్నకు పిచ్చెత్తింది. ఆ విషయం తెలిస్తే అమ్మకూ పిచ్చెత్తుతుంది."

ఈ కళ్ళల్లో నీళ్ళు రావడం మానేసి ఎన్నో సంవత్సరాలయిపోయింది.

ఈ మనస్సు ఏడ్చి ఏడ్చి విసిగిపోయింది.

"కుంటి అలివేలుతో బ్రతుకుతావా అన్నయ్యా!"

నవ్వుతాడు.

"ఇన్నాళ్ళూ నన్ను నువ్వు ఏమీ చెయ్యనివ్వలేదు. ఈ కుటుంబానికి నా వంతు ఇది -"

అవునవును.

ఈ కుటుంబానికి ప్రతివాడూ తమవంతు త్యాగం చెయ్యాలి.

అమ్మ సుఖాన్నిచ్చింది.

నేను నా వయస్సునిచ్చాను.

అన్నయ్య తన జీవితాన్ని అరణంగా ఉంచాడు.

పిచ్చెత్తి నాన్న తప్పించుకున్నాడు.

భేష్! - డబ్బు దొరికింది.

మంచిదే మంచిదే

మంచి పనిచేస్తూ విచారిస్తే లాభంలేదు.

సుందరి పెళ్ళయినా అవుతుంది -

ఒక సంతృప్తయినా జరుగుతుంది.

చీకటిపడుతోంది.

ఈ రోజు శుభప్రదంగానే గడిచిపోయింది.

ఎన్నో ఏళ్ళ తర్వాత మంచి రోజు గడిచింది.

ఆకాశం కెంపురంగు చూసే వ్యవధి కలిగింది.

రోడ్డుమీద మేకలు దూరాన వస్తున్న బస్సును చూచి నిలిచిపోయాయి.

మందనుంచి చెదిరిపోయిన మేకపిల్ల ఎటు పరుగెత్తాలో తెలీక పక్కకాలువలో పడింది.

కాలువలో నీళ్ళున్నాయి.

రోడ్డు కనిపిచకుండా దుమ్మతో నిండిపోయింది.

రోడ్డు మీద దీపాలు వెలగలేదు.

బస్సులో దీపాలు వెలిగాయి.

వెలిగి మళ్ళీ ఆరిపోయాయి.

అసలు వెలిగాయా అని అనుమానం.

వెలిగినట్టే వెలిగి ఆరినట్టే ఆరిపోయాయి.

మేకపిల్ల గుండెపగిలేట్టు అరుస్తోంది.

మేకలన్నీ ఎటుపోయాయో ఆ ధూళిలో తెలియడం లేదు. కాలువలో పడ్డ మేకపిల్ల అరుస్తోంది కాబోలు.

మేకలకాపరి మేకల్ని లెక్కపెట్టుకుంటున్నాడు.

ఒక్కటి తక్కువ వచ్చింది.

బస్సు ఆగింది.

బస్సు కండక్టరు ప్రయాణికుల్ని లెక్కపెట్టుకుంటున్నాడు.

ఒకడు ఎక్కువ వచ్చాడు.

మేకలు అరుస్తున్నాయి.

బస్సులో అంతా అరుస్తున్నారు.

కాలువలోపడి చచ్చిపోయిన మేకపిల్లని కాలువలోంచి తీశాడు మేకలకాపరి.

దానితల్లి దానికోసం మేకభాషలో ఏడుస్తోంది.

బస్సులో ఎవరో ఏడిచినట్టు మాట్లాడుతున్నారు.

మేక చచ్చిపోవడాన్ని ఎవరూ పట్టించుకోవడంలేదు.

ఇద్దరు బస్సులోంచి హడావుడిగా దిగారు. ఎవరు? ఎవరు?

ఈ బస్సులోనే ముకుందరావు వస్తానన్నాడు.

ఈ చివరిబస్సులోనే ముకుందరావు వస్తానన్నాడు.

మేక చచ్చిపోయిందని మేకలతోపాటు మేకలకాపరీ ఏడుస్తున్నాడు.

బస్సు గాండ్రించి నవ్వుతున్నట్లు ధూళిలేపుకుంటూ పోయింది.

ధూళి త్రుళ్ళి లేచింది.

మేకలు కనిపించడంలేదు.

మేకలకాపరి కనిపించడంలేదు.

ధూళి వెనక ఏడుపు వినిపిస్తోంది.

ఎవరో ఈ ఇంటివేపే వస్తున్నారు.

ముకుందరావు కాడే

"గాయత్రి ఎవరండీ?"

"నేనే! నేనే! ఏం?"

వెంకట్రావు బయటకి వచ్చాడు.

"నేనే! నేనే! ఏం?"

ముకుందరావు చచ్చిపోయాడు. సాయంకాలం మిషన్ దగ్గర నిలబడి ఉండగా పొరపాటున అతన్ని మిషన్ లోపలికి లాగేసింది.

"నిజమే! నిజమే!"

మేకలకాపరి ఇంకా ఏడుస్తున్నాడు.

నిజమే! నిజమే!

వాళ్ళేం మాట్లాడటంలేదు.

"నిజమే! నిజమే!"

వెంకట్రావు మాట్లాడడంలేదు.

చేతిలోని రూపాయలనోట్లు గాలికి రెపరెపలాడుతున్నాయి -

దుఃఖంతో వణికే మనస్సులాగా రెపరెపలాడుతున్నాయి.

దూరదూరంగా చెదిరిపోతున్నాయి -

కోరికల్లా! ఆశలా చెదిరిపోతున్నాయి.

***ఉపసంహారము***

"చూశావా! చూశావా! ఏం జరిగిందో?" అన్నది దురదృష్టదేవత.

"చూశాను. చూశాను" అన్నది అదృష్టదేవత.

"చూశావా! చూశావా! ఎలా జరిగిందో?"

"చూశాను. చూశాను"

"ఇందులో ఏదో విచిత్రము ఉంది"

"ఉంది. ఉంది"

"నా కర్థమవుతోంది కొంచెం కొంచెం"

"నాకూ అర్థమవుతోంది" అంది అదృష్టం.

"అదృష్టానికీ దురదృష్టానికీ లంకె. కష్టానికి సుఖానికీ బంధుత్వం. కష్టసుఖాల పడుగుపేకలతో ప్రపంచమనే ముఖమల్ దుపట్టాను అల్లాడు భగవంతుడు" అంది దురదృష్టం.

"ఒకరి అదృష్టాన్ని మరొకరి దురదృష్టం పాడుచేస్తుంది. ఒకరి దురదృష్టాన్ని మరొకరి అదృష్టం బాగుచేస్తుంది" అంది అదృష్టం.

ఓహో! ఎంత విచిత్రం!

ఓహో! ఎంత విజ్ఞత!

అనుకున్నాయి అదృష్టం, దురదృష్టం.

ఇద్దరూ కలిసి భగవంతుడి దగ్గరకు వచ్చారు.

వచ్చి ఇలా అన్నారు: "హే భగవాన్! ఎవరినెట్లా సత్కరించాలో ఎవరి ఎవరికెట్లా బుద్ధి చెప్పాలో నీకే తెలుసు. మధ్య జోక్యం చేసుకోడానికి మేమెవరం?"

భగవంతుడు ఆ మాటలు విని నవ్వుకొన్నాడు.

ప్రపంచం మంచినీ, చెడునీ చూస్తున్నప్పటి యుగయుగాలనాటి పాతనవ్వు అది

(సమాప్తం)